


అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

01.08.2026

శనివారం | అనంతపురం

సంపుటి : 11 | సంచిక: 80

పేజీలు : 12 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## కావేరీపై భగ్గుమన్న కర్ణాటక

- తమిళనాడు సీఎం విజయ్‌తో డీకే చర్చలు రద్దు
- జలాల విడుదలపై ఆదేశాలు
- బెంగళూరులో ఆదివారం చర్చలు వాయిదా
- విపక్షాలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్న డీకే శివకుమార్



2లో..

## పీఎంకిసాన్ పథకాన్ని మరో ఐదేండ్లు పొడిగింపు

- పీఎం-కిసాన్, ఖేలో ఇండియాకు
- భారీ నిధుల కేటాయింపు
- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు
- ప్రధాని మోదీ అధ్యక్షతన భేటీ అయిన మంత్రివర్గం
- 'ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజన'కు ఆమోదం

2లో..



న్యూఢిల్లీ, జులై 31, అనంత జనశక్తి న్యూస్
కేంద్ర మంత్రిమండలి దేశాభివృద్ధికి సంబంధించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతులు, యువత, క్రీడాకారులు, ఇంధన రంగానికి లబ్ధి చేకూర్చే బృహత్తర పథకాలకు పచ్చజెండా ఊపారు. ఈ నిర్ణయాల వివరాలను కేంద్ర సమాచార ప్రసారాల శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు.

# టేకాఫ్‌కు ఉత్తరాంధ్ర సిద్ధం



**భోగాపురం, జులై 31, అనంతజనశక్తి న్యూస్**
భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. దీన్ని ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో మోదీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. "భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించనున్నాం. ఇది దేశ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో మరో కీలక మైలురాయి" అని తెలిపారు. ప్రధాని పోస్ట్‌ను సీఎం చంద్రబాబు షేర్ చేశారు. "ఉత్తరాంధ్ర టేకాఫ్‌కు సిద్ధంగా ఉంది. మోదీజీ.. మీ రాక కోసం ఎదురు చూస్తున్నాం" అని సీఎం పేర్కొన్నారు. భోగాపురం విమానాశ్రయం ప్రారంభంతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త ఊపిరి లభిస్తుందని.. పెట్టుబడులు, పర్యాటకం, ఉపాధి

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక చరిత్రలో 2026 ఆగస్టు 1వ తేదీ నూతన అధ్యాయానికి నాంది పలకబోతున్నది. ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ, భోగాపురంలో నిర్మించిన 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని' ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితం చేయనున్నారు. సాధారణంగా విమానాశ్రయాలు రవాణా సౌకర్యాలను మెరుగుపరుస్తాయి. కానీ కొన్ని ప్రాజెక్టులు మాత్రమే ఒక ప్రాంత ఆర్థిక రూపురేఖలనే పూర్తిగా మార్చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ సరిగ్గా అటువంటి ప్రాజెక్టే ! ఎందుకంటే, ఇది కేవలం విమానాలు ఆగే చోటు కాదు. ఇది వెనకబడిన ఉత్తరాంధ్రను ప్రగతి పథంలో ముందుకు నడిపించే ఒక పవర్ హౌస్. ఇది ఉత్తరాంధ్ర యువత ఆకాంక్షలకు నిలువెత్తు ప్రతిరూపం. మౌలిక వసతుల కల్పన అనేది ఏ ప్రాంత ఆర్థికాభివృద్ధికైనా పునాది లాంటిది. రోడ్లు గ్రామాలను అనుసంధానిస్తే, రైల్వేలు పరిశ్రమలను కలుపుతాయి. ఓడరేవులు దేశాల మధ్య వ్యాపారాన్ని విస్తరిస్తే, విమానాశ్రయాలు ప్రపంచ స్థాయి అవకాశాలను ముంగిట్లోకి తీసుకొస్తాయి. నేటి గ్లోబల్ ఎకానమీలో అంతర్జాతీయ స్థాయి ఏవియేషన్ రవాణా వ్యవస్థ ఉంటేనే విదేశీ పెట్టుబడులు, ఉద్యోగావకాశాలు విస్తరిస్తాయి.

11లో..



- మోదీజీ మీ రాకకోసం ఎదురుచూస్తున్నాం
- సీఎం చంద్రబాబు నాయుడు
- అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం
- నేడు మోదీ చేతుల మీదుగా ప్రారంభం
- దేశ మౌలిక అభివృద్ధిలో కీలక మైలురాయి
- ఉత్తరాంధ్ర ప్రజల ఏళ్లనాటి కల సాకారం

## సర్ ముసాయిదా ఓటరు జాబితా విడుదల

- వివరాలను వెల్లడించిన సీఈవో వివేక్ యాదవ్
- 3.71 కోట్ల మంది ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పణ
- మొత్తం ఓటర్లలో 89.22%

2లో..



**అమరావతి, జులై 31 అనంత జనశక్తి న్యూస్**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర సవరణ ముసాయిదా ఓటరు జాబితాను అధికారులు విడుదల చేశారు. ఈ వివరాలను ఏపీ ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) వివేక్ యాదవ్ వెల్లడించారు.

## భోగాపురంలో థింసా నృత్యానికి గిన్నిస్ రికార్డు



2లో..

## అందుబాటులోకి ఫ్యామిలీ సర్టిఫికెట్ సేవ

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటన
- ప్రజలకు కొత్త సౌకర్యాన్ని అందుబాటులోకి
- పూర్తి వివరాలతో కూడిన ఫ్యామిలీ ధ్రువపత్రాలు
- తహశీల్దార్ కార్యాలయాలు, మీ సేవా కేంద్రాల ద్వారా

2లో..



**హైదరాబాద్, జులై 31, అనంతజనశక్తి న్యూస్**
తెలంగాణ ప్రజలకు ప్రభుత్వం కొత్త సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. రాష్ట్రంలో ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ ప్రక్రియ ప్రారంభమైందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇకపై కుటుంబ సభ్యుల సమాచారం..

## డీఏపీ ఎరువుల సరఫరా పెంచండి

- కేంద్రానికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి
- ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలి



2లో..

**హైదరాబాద్, జులై 31, అనంత జనశక్తి న్యూస్**
రాష్ట్రానికి డీఏపీ ఎరువుల సరఫరాను పెంచాలని కేంద్రానికి తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఖరీఫ్‌లో రైతులకు డీఏపీ ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన్ని మంత్రి తుమ్మల కోరారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాకు ఆయన లేఖ రాశారు. ఆగస్టుకు 50వేల మెట్రిక్ టన్నుల డీఏపీ కేటాయించాలని కేంద్రాన్ని ఆయన డిమాండ్ చేశారు.

## విడిపోయిన సీఎం దంపతులు

- 17 ఏళ్ల సంసారానికి ముగింపు!
- ఒమర్ అబ్దుల్లా - పాయల్ విడాకులు మంజూరు
- సీఎం వ్యక్తిగత జీవితంలో కీలక మలుపు

2లో..



## 2029లో వైసీపీదే అధికారం భారీ మెజారిటీతో గెలుస్తాం

- వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి
- సంస్థాగతంగా బలోపేతం చేశాం
- భవిష్యత్ ఎన్నికల్లో ఇది పార్టీకి మరింత బలం



11లో..

**అమరావతి, జులై 31, అనంతజనశక్తి న్యూస్**
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ సోషల్ మీడియా కార్యకర్తలకు కీలక దిశానిర్దేశం చేశారు. సోషల్ మీడియా విభాగాన్ని గ్రామస్థాయి వరకు సంస్థాగతంగా బలోపేతం చేశామని, భవిష్యత్ ఎన్నికల్లో ఇది పార్టీకి మరింత బలంగా ఉపయోగపడుతుందని అన్నారు. పార్టీ సిద్ధాంతాలు, జగన్ సందేశాలను ప్రజల్లోకి సమర్ధవంతంగా తీసుకెళ్లడంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వైసీపీకి అధికారమే లక్ష్యం కాదని, ప్రజల సంక్షేమమే పార్టీ ప్రధాన అజెండా అని సజ్జల స్పష్టం చేశారు.

## ఫార్ములా ఈకార్ కేసులో నాంపల్లి కోర్టుకు కేటీఆర్

- విచారణ ఆగస్టు 25కి వాయిదా!
- కేటీఆర్, ఐఏఎస్ అర్వింద్ కుమార్‌ల విచారణ
- నిబంధనలు ఉల్లంఘించి రూ.55 కోట్లు బదిలీ!
- ఏసీబీ అధికారుల ఆరోపణలు

11లో..



**హైదరాబాద్, జులై 31, అనంతశక్తి న్యూస్**
రాష్ట్రంలో తీవ్ర రాజకీయ దుమారం రేపిన ఫార్ములా ఈకార్ రేసు కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారానికి సంబంధించిన కేసులో తదుపరి విచారణను నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టు ఆగస్టు 25వ తేదీకి వాయిదా వేసింది. శుక్రవారం ఉదయం జరిగిన ఈ విచారణకు కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)తో పాటు ఇతర నిందితులు స్వయంగా హాజరయ్యారు.

## ధర్మేంద్ర రాజీనామా సాధ్యమయ్యేదే కాదు

- వాంగ్‌చుక్ దీక్షతోనే బలం
- కాక్రోచ్ జనతాపార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్
- మా మధ్య విభేదాల్లేవని కామెంట్

11లో..





# డీఏపీ ఎరువుల సరఫరా పెంచండి

(మొదటిపేజీ తరువాయి)

సెప్టెంబర్‌లో మరో 50 వేల మెట్రిక్ టన్నులు కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో 50 శాతం వరి నాట్లు పూర్తయ్యాయని ఆ లేఖలో మంత్రి తుమ్మల వివరించారు. డీఏపీ ఎరువుల డిమాండ్ భారీగా పెరుగుతోందని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 20 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ నిల్వ మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరగడంతో డీఏపీ ఎరువుల వైపు రైతులు మొగ్గు చూపుతున్నారని చెప్పారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా సహకరించాలని కేంద్రానికి ఈ సందర్భంగా మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.

### అందుబాటులోకి

# ఫ్యామిలీ సర్టిఫికెట్ సేవ



(మొదటిపేజీ తరువాయి)

వారి పూర్తి వివరాలతో కూడిన ఫ్యామిలీ ధ్రువపత్రాలను తహశీల్దార్ కార్యాలయాలు, మీ సేవా కేంద్రాల ద్వారా పొందవచ్చని తెలిపారు. కుటుంబ వివరాలను అధికారికంగా ధ్రువీకరించుకునేందుకు ఈ సర్టిఫికెట్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రజలు తమ కుటుంబ సమాచారానికి సంబంధించి అవసరమైన సందర్భాల్లో ఈ ధ్రువపత్రాన్ని వినియోగించుకోవచ్చని చెప్పారు.

ఫ్యామిలీ సర్టిఫికెట్ అన్ని చోట్ల చెల్లుబాటు అవుతుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలు, వివిధ అధికారిక అవసరాలు, కుటుంబ వివరాలను సమర్పించాల్సిన సందర్భాల్లో ఈ ధ్రువపత్రం కీలకంగా మారనుందని తెలిపారు. ఇప్పటివరకు కుటుంబ వివరాల ధ్రువీకరణ కోసం ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించడంతో పాటు, ప్రజలకు సులభంగా సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రక్రియను ప్రారంభించినట్లు వెల్లడించారు. తహశీల్దార్ కార్యాలయాలు, మీ సేవ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

# భోగాపురంలో థింసా నృత్యానికి గిన్నిస్ రికార్డు

భోగాపురం, జులై 31, అనంత జనశక్తి న్యూస్

భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన థింసా నృత్యం గిన్నిస్ రికార్డు సృష్టించింది. 16 వేల మంది ఆదివాసీ బాలికలతో థింసా నృత్యాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. థింసా నృత్యంలో మంత్రి సంధ్యారాణి పాల్గొన్నారు. గిన్నిస్ అవార్డును మంత్రి అందుకున్నారు. శనివారం భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఆదివాసీలు అపూర్వ స్వాగతం పలకనున్నారు. గత మూడు రోజులుగా ఆదివాసీ విద్యార్థినులు రిహార్సల్స్ చేస్తున్న విషయం తెలిసిందే. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఆదివాసీ విద్యార్థినులు తరలివచ్చి ఈ థింసా నృత్యంలో పాల్గొన్నారు.

**అంగరంగ వైభవంగా ఏర్పాట్లు..**

భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఘన స్వాగతం చెప్పేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సంప్రదాయ థింసా నృత్యంతో రేపు (శనివారం) 16 వేల మంది మంది ఆదివాసీ బాలికలు ప్రధానికి స్వాగతం పలకనున్నారు. ఆంధ్రప్రదేశ్ సంస్కృతి సంప్రదాయాలు, కళలు ఉట్టిపడేలా అల్లూరి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అధికారులు అలంకరించారు.

ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు..

విమానాశ్రయ స్వాగత ద్వారం వద్ద ఆకట్టుకునేలా భారీ స్థాయిలో ఏటికొప్పాక కళాకృతిలో అలంకరించారు. విమానాశ్రయం లోపల ప్రాంగణంలో ఏపీ చారిత్రక వైభవం చాటేలా తోలు బొమ్మలాట, బొబ్బిలి వీణ, భౌగోళిక వారసత్వం చాటిచెప్పేలా బంగినపల్లి మామిడి లాంటి చిత్రాలతో అలంకరించారు. ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇవాళ (శుక్రవారం) సాయంత్రం విశాఖపట్నం బీచ్ రోడ్డులో డ్రోన్ షో కనువిందు చేయనుంది. ఇప్పటికే అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విమాన సర్వీసుల నిర్వహణ కోసం ఎయిర్ ఇండియా షెడ్యూల్ ప్రకటించిన విషయం తెలిసిందే.





# కావేరీపై భగ్గుమన్న కర్ణాటక

బెంగళూరు, జులై 31, అనంతజనశక్తి న్యూస్



తమిళనాడు, కర్ణాటకల మధ్య మరోసారి కావేరీ జల వివాదం మంటలు రేపుతోంది. తమిళనాడుకు 15 రోజుల పాటు రోజుకు 3,500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేయాలని కర్ణాటకను కావేరీ వాటర్ రెగ్యులేటరీ అథారిటీ ఆదేశించింది. దీంతో కన్నడిగుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఈ క్రమంలో తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ఆగస్టు 3న జరగాల్సిన చర్చలను వాయిదావేస్తున్నట్టు కర్ణాటక సీఎం డీకే శివకుమార్ ప్రకటించారు. ప్రస్తుత ఉద్రిక్తతల దృష్ట్యా విజయ్ తన పర్యటనను రద్దుచేసుకోవాలని డీకే కోరారు. సందర్భం వచ్చినప్పుడు మనం కలుసుకోవచ్చని ఆయన అన్నారు.

అలాగే, విపక్షాలతో చర్చించిన తర్వాతే కావేరీ జలాల విడుదలపై నిర్ణయం తీసుకుంటామని డీకే స్పష్టం చేశారు. బంద్ నిర్ణయాన్ని ప్రతిపక్షాలు విరమించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గత మూడేళ్లుగా కర్ణాటకలో వర్షాలు సమృద్ధిగా కురువడంతో నీటి కేటాయింపులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పోయిందని, తమిళనాడుకు తన వాటా కంటే ఎక్కువ నీటిని విడుదల చేయగలిగిందని సీఎం డీకే శివకుమార్ పేర్కొన్నారు. ''తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్‌తో చర్చలకు రాష్ట్ర ప్రభుత్వం మొదట సిద్ధమైనప్పటికీ, క్యాబినెట్ సహచరులు, న్యాయ బృందంతో సంప్రదింపులు జరిపిన తర్వాత, ప్రశాంతమైన వాతావరణంలో భేటీ జరిగేలా చూసేందుకు ఈ సమావేశాన్ని వాయిదా వేయాలని నిర్ణయించాం'' శివకుమార్ తెలిపారు.

''ఈ సమయంలో వాతావరణం అనుకూలంగా లేదని నేను భావిస్తున్నాను.. చాలా సౌహార్ద్రపూర్వక వాతావరణం ఉండాలి కాబట్టి, ఈ పర్యటనను కొద్దికాలం వాయిదా వేసుకోవాలని నేను ఆయనను (విజయ్‌ను) కోరుతున్నాను. రెండు రాష్ట్రాలూ దీనివల్ల ప్రయోజనం పొందాలని నేను కోరుకుంటున్నాను.. మా ఇద్దరి మధ్య ఎలాంటి కలతలు ఉండకూడదని నేను భావిస్తున్నాను... ఇదంతా వరుణ దేవుని కృపపైనే ఆధారపడి ఉంది'' అని ఆయన పేర్కొన్నారు.

మరోవైపు, సీడబ్ల్యూఆర్ఏ ఆదేశాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. కన్నడిగులు ఆందోళనలు చేపట్టారు. దీని ప్రభావం ఇటీవల విడుదలైన విజయ్ సినిమా 'జననాయగన్'పై పడింది. కర్ణాటక వ్యాప్తంగా ఆ ఆ సినిమా ప్రదర్శన నిలిచిపోయింది. ముందుజాగ్రత్త చర్యగా పలు థియేటర్లు విజయ్ పోస్టర్లు, కటౌట్లను తొలగించి.. ప్రదర్శనలను స్వచ్ఛందంగా నిలిపివేశాయి. ఇదిలా ఉండగా, 15 రోజుల పాటు రోజుకు 7,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని కావేరీ జల నియంత్రణ కమిటీని తమిళనాడు ప్రభుత్వం కోరగా.. ఈ ప్రతిపాదనను తిరస్కరించింది. రోజుకు 3,500 క్యూసెక్కులకు అంగీకరించింది. దీనిపై కర్ణాటక ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేస్తూ కావేరీ జల నిర్వహణ అథారిటీని ఆశ్రయించగా.. సీడబ్ల్యూఆర్ఏ నిర్ణయాన్ని అది సమర్థించింది.

# పీఎంకిసాన్ పథకాన్ని మరో ఐదేండ్లు పొడిగింపు

(మొదటిపేజీ తరువాయి)




రైతులకు సాగు ఖర్చుల కోసం నేరుగా ఆర్థిక సహాయం అందించే 'ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' (పీఎంకిసాన్) పథకాన్ని 203031 ఆర్థిక సంవత్సరం వరకు పొడిగించారు. ఈ ఐదేళ్ల కాలానికి గాను రూ. 3,15,614 కోట్ల భారీ బడ్జెట్‌ను కేటాయించారు. 2019 ఫిబ్రవరి 24న ప్రారంభమైన ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ. 6,000 చొప్పున ఆర్థిక సాయం అందుతోంది. ఈ మొత్తాన్ని రూ. 2,000 చొప్పున మూడు సమాన విడతల్లో నేరుగా లబ్ధిదారుల ఆధార్ అనుసంధానిత బ్యాంకు ఖాతాల్లోకే జమ చేస్తున్నారు. ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా ఉన్న కోట్ల మంది రైతు కుటుంబాలకు రాబోయే ఐదేళ్ల పాటు నిరంతర ఆర్థిక భరోసా లభించనుంది.

**క్రీడారంగానికి రూ. 36,441 కోట్లు.. 'ఖేలో ఇండియా' విస్తరణ**

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మక క్రీడాభివృద్ధి కార్యక్రమంగా రూపుదిద్దుకున్న 'ఖేలో ఇండియా' విస్తరణకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఖేలో ఇండియా పథకంతో పాటు జాతీయ క్రీడా సమాఖ్యలకు అందించే సహాయాన్ని కలిపి మొత్తం రూ. 36,441 కోట్లు కేటాయించారు.

ఇందులో ఖేలో ఇండియా పథకానికి రాబోయే ఐదేళ్లకు గాను రూ. 29,054 కోట్లు కేటాయించారు. ఇది మునుపటి బడ్జెట్ కంటే దాదాపు ఎనిమిది రెట్లు ఎక్కువ. 2030 కామన్వెల్త్ గేమ్స్ నిర్వహణ, 2036 ఒలింపిక్స్ వేలం దిశగా అడుగులు వేస్తున్న భారత్, క్రీడల్లో ప్రపంచ శక్తిగా ఎదిగేందుకు ఈ నిధులు తోడ్పడనున్నాయి. అలాగే జాతీయ క్రీడా సమాఖ్యలకు ఐదేళ్ల వ్యవధిలో రూ. 7,387 కోట్ల సాయం అందించనున్నారు.

పాఠశాల స్థాయి నుంచే క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు రెండు కొత్త కార్యక్రమాలను ప్రారంభించారు:

**ఖేలో ఇండియా ఫీడర్ స్కూల్స్**

ఖేలో ఇండియా ఉత్కృష్ట విద్యాలయాలు

ఈ విధానం ద్వారా సాధారణ విద్యతో పాటు క్రీడలను అనుసంధానించి చిన్ననాటి నుంచే ప్రతిభను గుర్తించి శిక్షణ ఇస్తారు. మహిళా అథ్లెట్లు, పారా అథ్లెట్లు, దేశీయ సాంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ క్రీడాకారుల సమాచారం, మౌలిక వసతులు, పోటీల వివరాల కోసం ఒక డిజిటల్ స్పోర్ట్స్ ప్లాట్‌ఫామ్‌ను కూడా అందుబాటులోకి తేనున్నారు.

'సముద్ర మంథన్'తో ఇంధన రంగంలో విప్లవం

దేశీయంగా చమురు, సహజ వాయువు ఉత్పత్తిని పెంచడమే లక్ష్యంగా కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'సముద్ర మంథన్' (నేషనల్ ఆఫ్‌షోర్ ఎక్స్‌ప్లోరేషన్ స్కీమ్) ప్రారంభానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. 203031 ఆర్థిక సంవత్సరం వరకు అమలు కానున్న ఈ పథకానికి రూ. 84,084 కోట్లు కేటాయించారు.

ఈ పథకం ద్వారా సముద్ర తీర ప్రాంతాల్లో చమురు, గ్యాస్ నిల్వల అన్వేషణను వేగవంతం చేస్తారు. 600 మిలియన్ మెట్రిక్ టన్నుల ఆయిల్ ఈక్వివలెంట్ కంటే ఎక్కువ నిల్వలను కనుగొనాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనివల్ల దిగుమతులపై ఆధారపడటం తగ్గడమే కాకుండా ఇంధన రంగంలో భారీగా కొత్త ఉద్యోగాలు, పెట్టుబడులు తరలివచ్చే అవకాశముంది.

నీటిపై తేలియాడే సౌర విద్యుత్ ప్లాంట్లు: రూ.5,070 కోట్లతో 'పీఎం సూర్య సరోవర్ యోజన'కు కేబినెట్ ఆమోదం

పునరుత్పాదక ఇంధన రంగాన్ని విస్తరించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజన' పథకానికి ఆమోదం తెలిపింది. రూ.5,070 కోట్ల వ్యయంతో చేపట్టే ఈ పథకం ద్వారా నీటిపై తేలియాడే (ఫ్లోటింగ్) సోలార్ ప్లాంట్ల సాయంతో 5,000 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రాజెక్టుల వద్దే విద్యుత్‌ను నిల్వ చేసే వ్యవస్థలను కూడా అనుసంధానించనున్నారు.

ఈ పథకం కింద కనీసం రెండు గంటల పాటు విద్యుత్‌ను నిల్వ ఉంచేలా సామర్థ్యాన్ని అందుబాటులోకి తెస్తారు. 202627 నుంచి 203031 ఆర్థిక సంవత్సరాల మధ్య ఈ ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేయనుండగా, 203233 వరకు కేంద్రం నుంచి ఆర్థిక సాయం అందుతుంది. ప్రస్తుతం దేశంలో తేలియాడే సోలార్ ప్లాంట్ల సామర్థ్యం కేవలం 700 మెగావాట్లు మాత్రమే ఉండగా, ప్రాజెక్టులు, జలాశయాల్లో దాదాపు 102.18 గిగావాట్ల మేర విద్యుత్ ఉత్పత్తికి అవకాశాలున్నాయని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోలార్ ఎనర్జీ స్పష్టం చేసింది.

కేంద్ర సాయం వివరాలు:

తయారీ సాయం: ప్రాజెక్ట్ విజయవంతంగా ప్రారంభమైన తర్వాత ప్రతి మెగావాట్‌కు రూ.1 కోటి చొప్పున కేంద్రీయ ఆర్థిక సాయం లభిస్తుంది.

ప్రాథమిక అధ్యయనాలు: పర్యావరణ, హైడ్రోగ్రాఫిక్ తదితర ముందస్తు అధ్యయనాల కోసం ఒక్కో ప్రాజెక్టుకు గరిష్టంగా రూ.50 లక్షల వరకు అందిస్తారు.

ఈ ప్రాజెక్టుల వల్ల సౌర ప్లాంట్ల కోసం ప్రత్యేకంగా భూమి సేకరించాల్సిన అవసరం ఉండదు. ప్లాంట్ల ఏర్పాటు వల్ల ఏటా దాదాపు 1 కోటి టన్నుల కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయని, దేశీయంగా తయారీ రంగానికి ఊతం లభించడమే కాకుండా 16,000 నుంచి 17,000 మందికి కొత్తగా ఉపాధి లభిస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ పథకం అందుబాటులోకి రానుంది.

# సర్ ముసాయిదా ఓటరు జాబితా విడుదల

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా 3.71 కోట్ల మంది తమ ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించినట్లు వివేక్ యాదవ్ తెలిపారు. మొత్తం 4.16 కోట్ల మంది ఓటర్లలో 89.22 శాతం మంది ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించినట్లు తెలిపారు. ఓటరు జాబితాలోని 15.22 లక్షల మందిని మృతులుగా గుర్తించినట్లు తెలిపారు. అలాగే రాష్ట్రంలోని 22.30 లక్షల మంది ఓటర్లు ఎస్ఐఆర్ ప్రక్రియకు గైర్హాజరు కావడమో.. శాశ్వతంగా నివాసాలు మారడమో జరిగినట్లు తెలిపారు. అలాగే 7.37 లక్షల మంది రెండు, మూడు చోట్ల ఓటర్లుగా నమోదైనట్లు ఏపీ ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ తెలిపారు. మరోవైపు ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాలలో ఓటు ఉన్నవారి పేరును ఒకేచోట కొనసాగించామని వివేక్ యాదవ్ తెలిపారు. ఫారం 6తో నిజమైన ఓటర్లు మరోసారి నమోదు చేసుకునే వీలుందని వెల్లడించారు. ముసాయిదా ఓటరు జాబితాపై నేటి నుంచి (జులై 31) ఆగస్ట్ 30వ తేదీ వరకూ అభ్యంతరాలను స్వీకరిస్తామని తెలిపారు. వీటిని పరిశీలించిన అనంతరం.. అక్టోబర్ 3న తుది ఓటరు జాబితా ప్రకటించనున్నట్లు ఏపీ ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ వివరించారు. మరోవైపు నోటీసు, విచారణ లేకుండా ఓటర్ జాబితాలో నుంచి ఎవరి పేరును కూడా తొలగించబోమని అధికారులు స్పష్టం చేశారు. మరోవైపు ఇక్కడ క్లిక్ చేసి.. ఎస్ఐఆర్ ముసాయిదా ఓటరు జాబితాలో మీ పేరు ఉందో లేదో.. చెక్ చేసుకునే అవకాశం ఉంది. ఇక్కడ మీ జిల్లాను. నియోజకవర్గాన్ని, అలాగే ఇంగ్లీష్, తెలుగు భాషలలో ఏదో ఒకదానిని ఎంపిక చేసిన అనంతరం.. కింద ఇచ్చిన కాప్చా నమోదు చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత మీ పోలింగ్ బూత్ నెంబర్ నమోదు చేసి ఎస్ఐఆర్ ముసాయిదా ఓటరు జాబితాను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అందులో మీ పేరు ఉందో, లేదో తెలుసుకునే అవకాశం ఉంది.



# విడిపోయిన సీఎం దంపతులు

శ్రీనగర్, జులై 31, అనంత జనశక్తి న్యూస్



జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, ఆయన భార్య పాయల్ అబ్దుల్లా దాంపత్య బంధానికి అధికారికంగా ముగింపు పలికింది. దాదాపు 17 ఏళ్లుగా విడిగా జీవిస్తున్న ఈ దంపతులు పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకోవాలని నిర్ణయించుకోగా, వారి అభ్యర్థనకు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపింది. అలాగే ఒకరిపై ఒకరు దాఖలు చేసుకున్న అన్ని న్యాయపరమైన కేసులను ఉపసంహరించుకోవడానికి కూడా ఇరు పక్షాలు అంగీకరించాయి. ఈ కేసును జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ అలోక్ అరధే ధర్మాసనం విచారించింది. విచారణ సందర్భంగా ఇరు పక్షాల తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, ఒమర్ అబ్దుల్లా - పాయల్ తమ మధ్య ఉన్న అన్ని విభేదాలను పరిష్కరించుకున్నారని కోర్టుకు తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద పరస్పర అంగీకారంతో వివాహ బంధాన్ని రద్దు చేయాలని కోరుతూ జూలై 22న సంయుక్త పిటిషన్ దాఖలు చేసినట్లు వివరించారు. ఒప్పందంలోని నిబంధనల ప్రకారం తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని ధర్మాసనం పేర్కొంది.

ఒమర్ అబ్దుల్లా, పాయల్ 1994లో వివాహం చేసుకున్నారు. ఢిల్లీలోని ఒబెరాయ్ హోటల్‌లో పనిచేస్తున్న సమయంలో ఇద్దరికీ పరిచయం ఏర్పడి, ఆ తర్వాత వివాహ బంధంతో ఒక్కటయ్యారు. వీరికి జహీర్, జమీర్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే 2009 నుంచే ఇద్దరూ విడిగా నివసించడం ప్రారంభించగా, 2011లో తమ దాంపత్య జీవితం ముగిసిందని ఒమర్ అబ్దుల్లా బహిరంగంగా ప్రకటించారు. విడాకుల కోసం ఒమర్ అబ్దుల్లా ముందుగా ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించినప్పటికీ, 2016లో ఆ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. అనంతరం ఆయన ఢిల్లీ హైకోర్టులో అప్పీల్ చేశారు. 2023 డిసెంబర్‌లో హైకోర్టు కూడా ఫ్యామిలీ కోర్టు తీర్పును సమర్థిస్తూ, పాయల్‌కు నెలకు రూ.1.5 లక్షల భరణం, కుమారుడి విద్య కోసం అదనంగా నెలకు రూ.60 వేల చెల్లించాలని ఆదేశించింది. ఈ ఉత్తర్వును సుప్రీంకోర్టులో సవాలు చేసిన ఒమర్ అబ్దుల్లా కేసు మధ్యవర్తిత్వానికి వెళ్లింది. అక్కడ ఇరు పక్షాలు పరస్పర అవగాహనకు వచ్చి, అన్ని వివాదాలకు ముగింపు పలకడంతో సుప్రీంకోర్టు వారి విడాకులకు అధికారికంగా ఆమోదం తెలిపింది.

# అయోధ్య విరాళాల చోరీపై స్కిట్.. అతిథి పాత్రలో రాహుల్ గాంధీ

దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైన అయోధ్య రామాలయం విరాళాల చోరీ విషయంలో విపక్షాలు ఆందోళనలను తీవ్రం చేస్తున్నాయి. ఈ నిరసనల్లో భాగంగానే స్వతంత్ర ఎంపీ రాజేశ్ రంజన్ (పప్పు యాదవ్) పార్లమెంట్ ఆవరణలో వినూత్న స్కిట్ ప్రదర్శించారు. కాషాయ వస్త్రాలు ధరించి, ఓ సన్యాసి వేషంలో వచ్చిన ఆయన.. పార్లమెంట్ పరిసరాల్లో కూర్చొని విరాళాలు సేకరించారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీలు రుచి వీరా (మొరదాబాద్), అవధేశ్ ప్రసాద్ (అయోధ్య) కూడా ఈ స్కిట్‌లో నటించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అతిథి పాత్రలో కనిపించారు. ఆయన కొంత మొత్తాన్ని




హుండీలో వేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ కూడా తమ వంతుగా విరాళాలు ఇచ్చారు. అలా పలువురు ఎంపీలు ఇచ్చిన విరాళాలతో ఆ సన్యాసి ఉడాయిస్తాడు. అది గమనించిన ఎంపీలు అతడిని పట్టుకొన్ని దేహశుద్ధి చేసినట్లు నటిస్తారు. అక్కడితో స్కిట్ ముగుస్తుంది.

దీనిపై సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ధర్మేంద్ర యాదవ్ మాట్లాడుతూ.." ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన అయోధ్య రామాలయంలో విరాళాల చోరీ జరిగింది. దీనిపై చర్చ చేపట్టాలని విపక్షాలు డిమాండ్ చేస్తూనే ఉన్నాయి. ఇన్నాళ్లూ నీట్ పేపర్ లీక్ అంశంపై ఉభయసభల్లోనూ ఆందోళనలు రేగడంతో ఈ విషయం చర్చకు రాలేదు. దీనిపై చర్చ చేపట్టాలని నేను కూడా పార్లమెంట్ ప్రారంభమైన రోజు నుంచి నోటీసులు ఇస్తూనే ఉన్నాను. కానీ, ప్రభుత్వం నుంచి స్పందన లేదు. అందుకే, పప్పు యాదవ్ ఆలోచనతో ఈ స్కిట్ చేశాం" అని అన్నారు. లోక్‌సభలో పప్పు యాదవ్ కాషాయ వస్త్రధారణ అందరి దృష్టిని ఆకర్షించింది. దీనిపై స్పీకర్ ఓం బిర్లా ఒకింత అసహనం వ్యక్తం చేశారు. సభకు ఇలా రావడం సరికాదన్నారు. ఆయన పేరు ప్రస్తావించకుండానే 'సభకు విభిన్న వేషధారణలతో వచ్చే సభ్యులకు..' అంటూ మందలించారు.

# కావేరీ జలాల వివాదం: కన్నడనాట విజయ్ 'జననాయగన్'పై ఎఫెక్ట్

తమిళనాడు, కర్ణాటక మధ్య కావేరీ జలాల వివాదం తీవ్రరూపం దాల్చుతోంది. కావేరీ నదీ జలాల నియంత్రణ కమిషన్ . కర్ణాటక నుంచి తమిళనాడుకు 4 టీఎంసీల నీటిని విడుదల చేయాలంటూ ఆదేశాలు ఇచ్చింది. ఈ ఆదేశాలపై కన్నడిగులు భగ్గుమంటున్నారు. ఈ ప్రభావం తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ 'జననాయగన్' సినిమాపై పడింది. కర్ణాటక వ్యాప్తంగా ఆ సినిమా స్క్రీనింగ్‌ను నిలిపివేశారు. ముందుజాగ్రత్త చర్యగా రాష్ట్రంలోని అనేక థియేటర్లు విజయ్ పోస్టర్లను తొలగించి.. సినిమా ప్రదర్శనలను స్వచ్ఛందంగా నిలిపి వేశాయి.

కావేరి పరీవాహకంలో చుక్క నీటి కోసం రైతులు పరితపిస్తుండగా సీడబ్ల్యూఆర్‌సీ ఇచ్చిన ఆదేశాన్ని గురువారం కావేరి జల నిర్వహణ సంస్థ (సీడబ్ల్యూఎంఏ) కూడా సమర్థించడంతో కర్ణాటకవ్యాప్తంగా తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. రైతు సంఘాలతోపాటు రాజకీయ పార్టీలు, చలనచిత్ర పరిశ్రమ, కన్నడ సంఘాలన్నీ ఒక్కటై ఆందోళన చేస్తున్నాయి. అంతేగాకుండా విజయ్ చిత్రం 'జననాయగన్' ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ.. సినిమా థియేటర్ల వద్ద పోస్టర్లు చింపి నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆగ్రహ జ్వాలల నేపథ్యంలో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ఉండేందుకు థియేటర్ల యాజమాన్యాలు స్వచ్ఛందంగా ఈ సినిమా స్క్రీనింగ్‌ను నిలిపివేశాయి. విజయ్ నటించిన చివరి సినిమా 'జననాయగన్'కు ఆది నుంచి ఆటంకాలే ఎదురయ్యాయి. ఈ ఏడాది



సంక్రాంతికే థియేటర్లలో విడుదల కావాల్సిన ఈ చిత్రం సెన్సార్ సమస్య కారణంగా వాయిదా పడుతూ వచ్చింది. చివరకు జులై 23న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కర్ణాటకలో 125 నుంచి 150 థియేటర్లలో విడుదలైంది. తాజా నిరసనల నేపథ్యంలో.. ఈ చిత్రం స్థానంలో 'కరావళి' మూవీ షోలు వేశారు.

**విజయ్‌డీకే భేటీ వాయిదా**

ఆగస్టు 2న కావేరి సమస్యపై అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తామని కర్ణాటక ముఖ్యమంత్రి శివకుమార్ ఢిల్లీలో ప్రకటించారు. సీడబ్ల్యూఎంఏ ఆదేశాలకు వ్యతిరేకంగా కర్ణాటక ప్రభుత్వం అప్పీల్ చేస్తుందని వెల్లడించారు. దీనిపై తమిళనాడు ప్రభుత్వం నుంచి స్పందన వచ్చింది. కావేరీ జలాల్లో తమ వాటాను పొందేందుకు సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని ఆ రాష్ట్ర న్యాయశాఖ మంత్రి సీటీఆర్ నిర్మల్ కుమార్ పేర్కొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆగస్టు 3న విజయ్‌తో జరగాల్సిన సమావేశాన్ని వాయిదా వేసుకున్నట్లు డీకే వెల్లడించారు.

# కూలిన నాలుగంతస్తుల భవనం.. 8 మంది మృతి



మహారాష్ట్ర లోని భివండీలో నాలుగంతస్తుల భవనం కూలింది . ఈ ఘటనలో 8 మంది మృతిచెందగా.. శిథిలాల కింద పలువురు చిక్కుకున్నారు. ప్రమాదం జరిగిన భవనంలో ఒక్కో అంతస్తులో 12 చొప్పున మొత్తం 48 గదులు ఉన్నాయి. గురువారం రాత్రి 11:30 గంటల సమయంలో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరగడంతో .. అందులోని వారంతా శిథిలాల కింద చిక్కుకున్నట్లు పోలీసులు తెలిపారు. వెంటనే స్పందించిన స్థానికులు పలువురిని రక్షించారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

పదేళ్ల క్రితం నిర్మించిన ఈ భవనంలో పగుళ్లు ఏర్పడడంతో.. దానిని ఖాళీ చేయాల్సిందిగా అక్కడి వారికి ఇది వరకే సూచించినట్లు మున్సిపల్ అధికారులు వెల్లడించారు. అయినప్పటికీ వారు ఖాళీ చేయకుండా అనధికారికంగా మరమ్మతు పనులు చేపట్టినట్లు తెలిపారు. మృతుల్లో ఎక్కువ మంది మరమ్మతు పనులు చేస్తున్న కార్మికులేనని చెప్పారు.

# ఒంటినిండా రక్తంతో నాన్నను ఇంటికి తీసుకొచ్చారు.. ఢిల్లీ పోలీసు కుమార్తె ఆవేదన

దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన విద్యార్థుల ఆందోళనల సమయంలో ఎంతో మంది పోలీసులు గాయపడినా.. వారి గురించి ప్రజలకు పట్టట్లేదని ఆయా కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేశాయి. ఈ నిరసనల్లో గాయపడిన కొంతమంది పోలీసుల కుటుంబసభ్యులు శుక్రవారం మీడియా ముందుకొచ్చారు. నాటి సంఘటనలను గుర్తుచేసుకుంటూ తమకు కూడా న్యాయం జరగాలని డిమాండ్ చేశారు.

**నాన్నను లాగి.. మూకదాడికి యత్నం**

"నేను ఢిల్లీ యూనివర్సిటీలో చదువుతున్నా. మా నాన్న 15 ఏళ్ల పాటు నేవీలో మెరైన్ కమాండోగా సేవలందించారు. ఇప్పుడు ఢిల్లీ పోలీసు విభాగంలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. విద్యార్థుల ఆందోళనల సమయంలో నాన్న ప్రధాన వేదిక అయిన జంతర్ మంతర్ వద్ద విధులు నిర్వహించారు. ప్రతి రాత్రి ఇంటికి వచ్చిన తర్వాత.. నిరసనల గురించి మాకు చెప్పేవారు. విద్యార్థుల ముసుగులో కొంతమంది సంఘ విద్రోహ శక్తులు ఆందోళనల్లో చేరారని అన్నారు. ఆందోళనల సమయంలో మా నాన్నను కొంతమంది లాగి.. మూక దాడికి యత్నించారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను ఆసుపత్రికి తరలించారు. దాదాపు నాలుగు గంటల పాటు నాన్న స్పృహలో లేరు. ఇంటికి తీసుకొచ్చేటప్పుడు ఆయన యూనిఫామ్ అంతా రక్తంతో తడిసిపోయింది. అలాంటి రోజు మా జీవితంలో ఎన్నడూ చూడలేదు. ఈ ఘటన తర్వాత నేను సోషల్ మీడియా తెరవగా.. మా నాన్ననే నేరస్థుడిగా నిందిస్తున్నారు. ఆయనపై దాడి చేసిన వారే.. న్యాయం కావాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అప్పుడే నిర్ణయించుకున్నా.. మాకూ న్యాయం జరగాల్సిందే. అందుకే గాయపడిన పోలీసుల కుటుంబాలతో కలిసి సుప్రీంలో పిటిషన్ వేశాం'' అని ఓ ఎస్సై కుమార్తె మీడియా ముందు తన ఆవేదనను పంచుకున్నారు.

**రాళ్ల దాడికి.. హెల్మెట్ విరిగి..**

''నా భర్త ఢిల్లీ పోలీసు విభాగంలో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్. 33 ఏళ్లుగా పోలీసు శాఖలో ఉన్నారు. ఆందోళనల సమయంలో ఆయనపై కొంతమంది దాడికి పాల్పడ్డారు. రాళ్లు, చెప్పులు.. ఏది దొరికితే దాంతో కొట్టారని ఆయన చెప్పారు. రాళ్ల దాడికి ఆయన పెట్టుకున్న హెల్మెట్ విరిగిపోయింది. ఈ నిరసనల తర్వాత ఎక్కడ చూసినా.. ఆందోళనకారులను పోలీసులు కొట్టారనే వార్తలే కన్పిస్తున్నాయి. కానీ, నాణేనికి మరోవైపు కూడా ఉంది. దాన్ని ఎవరూ పట్టించుకోవట్లేదు. ప్రజల కోసం సేవలందిస్తున్న వారి ఆవేదనను దేశమంతా వినాలి'' అని ఓ అసిస్టెంట్ ఎస్సై భార్య సీమా భావోద్వేగానికి గురయ్యారు.

**నాన్నకు నాలుగు కుట్లు పడ్డాయ్..**



''మా తాత బీఎస్ఎఫ్‌లో పని చేశారు. 1971 యుద్ధంలో పాల్గొన్నారు. ఆయన స్ఫూర్తితోనే నాన్న పోలీసు శాఖలో చేరి అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నారు. ఆందోళనల సమయంలో బారికేడ్ల వద్ద విధులు నిర్వహించారు. ఉన్నట్టుండి తమపై ఆందోళనకారులు రాళ్లు విసిరారని నాన్న చెప్పారు. సీనియర్ అధికారులను రక్షించే క్రమంలో ఆయన తలకు తీవ్ర గాయమైంది. నాలుగు కుట్లు పడ్డాయ్. నేనూ విద్యార్థినే. విద్యార్థుల పట్ల నాన్న ఎప్పుడూ దురుసుగా ప్రవర్తించరు. ఈ నిరసనల్లో రౌడీలు, సంఘ విద్రోహ శక్తులు ఉన్నారు'' అని మరో పోలీసు కుమారుడు మీడియాకు తెలిపారు.

# వారికి డీఎన్ఏ టెస్ట్ చేయండి

## : రష్యాలో భారతీయుల మృతిపై 'సుప్రీం' ఆదేశాలు

రష్యా యుద్ధంలో మరణించిన భారతీయుల కుటుంబాలకు తగిన సాయం చేయాలని సుప్రీం కోర్టు విదేశాంగ శాఖ కు ఆదేశాలు జారీ చేసింది. బాధిత కుటుంబాలతో సమన్వయం చేసుకోవడానికి ఒక నోడల్ అధికారిని నియమించాలని పేర్కొంది. యుద్ధంలో మరణించిన వారి మృతదేహాలను గుర్తించేందుకు కుటుంబ సభ్యులకు డీఎన్ఏపరీక్షలు నిర్వహించాలని ఆదేశించింది. భారత్‌లోని రష్యా రాయబార కార్యాలయంలో పరిహారం కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఆ కుటుంబాలకు సహకరించాలని సూచించింది. ఈ విషయంపై బాధిత కుటుంబ సభ్యులకు స్థానిక భాషల్లో సమాచారం ఇవ్వాలని పేర్కొంది.

మంచి జీతంతో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మభ్యపెట్టి కొందరు ఏజెంట్లు తమ కుటుంబసభ్యులను రష్యా కు పంపించినట్లు పలు కుటుంబాలు పేర్కొన్నాయి. అక్కడికి వెళ్లాక రష్యా అధికారులు తమవారి పాస్‌పోర్ట్‌లు స్వాధీనం చేసుకొని.. బలవంతంగా



ఉక్రెయిన్‌తో యుద్ధంలో పోరాడడానికి పంపారని ఆరోపిస్తూ సుప్రీం కోర్టు లో పిటిషన్ దాఖలు చేశాయి. దానిపై విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం విదేశాంగ శాఖకు ఈ ఆదేశాలు జారీ చేసింది.

# ఐబీ అధికారి హత్య కేసు.. ఆప్ నేతకు జీవిత ఖైదు



ఈశాన్య ఢిల్లీలో 2020 అల్లర్ల కేసులో ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి అంకిత్ శర్మ హత్య కేసులో ఆమ్‌ఆద్మీ పార్టీ మాజీ కౌన్సిలర్ తాహిర్ హుస్సేన్‌కు ఢిల్లీ హైకోర్టు జీవిత ఖైదు విధించింది. అతడిపై మత విద్వేషాలను రెచ్చగొట్టడం, అల్లర్లకు పాల్పడటం, దాడి చేయడం, నేరపూరిత బలప్రయోగం, హత్య తదితర అభియోగాలు రుజువయ్యాయని కోర్టు పేర్కొంది.

2020 ఫిబ్రవరిలో ఈశాన్య ఢిల్లీలో సీఏఏ వ్యతిరేక నిరసనలు హింసాత్మకంగా మారిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆ ఘటనలో 53 మంది మృతి చెందగా..700 మందికి పైగా గాయపడ్డారు. ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి అంకిత్ శర్మను కూడా అత్యంత కిరాతకంగా హత్య చేసి, చంద్‌బాగ్ పులియా ప్రాంతంలోని ఖజూరీ ఖాస్ కాలువలో మృతదేహాన్ని పడేశారు. మృతుడి తండ్రి రవీందర్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా దయాల్‌పుర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ హత్య కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ నేత తాహిర్ హుస్సేన్‌తో పాటు మరో నలుగురిని ఢిల్లీ కోర్టు దోషిగా తేల్చింది. వారందరికీ తాజాగా జీవిత ఖైదు విధించింది.

# పీఎం కిసాన్ పథకం.. మరో ఐదేళ్లు



దేశవ్యాప్తంగా రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తోన్న పీఎంకిసాన్ పథకాన్ని మరో ఐదేళ్లు (203031 ఆర్థిక సంవత్సరం వరకు) పొడిగిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇందుకోసం రానున్న ఐదేళ్లకు గాను రూ.3.15 లక్షల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేసింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో దీనికి ఆమోదం తెలిపినట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

ఐదేళ్లలో 5000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా 'ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజన'కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.5070 కోట్లు కేటాయించింది. ఖేలో ఇండియాకు రూ.29వేల కోట్లు, సముద్ర మంథణ్ పథకానికి రూ.84వేల కోట్లు, సొరంగాల నిర్మాణం కోసం రూ.9779 కోట్లు కేటాయిస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది.

# ఆ సీఎంకు విడాకులు మంజూరు చేస్తాం: సుప్రీం కోర్టు



జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా. ఆయన భార్య పాయల్‌కు విడాకులు మంజూరు చేస్తామని సుప్రీంకోర్టు వెల్లడించింది. తమ వివాహ బంధాన్ని పరస్పర అంగీకారంతో రద్దు చేసుకుని.. పెండింగ్‌లో ఉన్న అన్ని వివాదాలను పరిష్కరించుకోవడానికి ఇరువురు అంగీకరించడంతో ఈ తీర్పు వెలువరించింది.

ఒమర్ అబ్దుల్లా.. పాయల్‌ను 1994లో వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు కుమారులు. 2011లో ఒమర్ తన భార్య నుంచి విడిపోతున్నట్లు బహిరంగంగా ప్రకటించి.. వారి 17 ఏళ్ల వివాహ బంధానికి ముగింపు పలికారు. నాటి నుంచి వారు విడివిడిగా జీవిస్తున్నారు. ఆమెతో తనకు విడాకులు ఇప్పించాలని కోరుతూ 2016లో ఫ్యామిలీ కోర్టును ఒమర్ ఆశ్రయించారు. కానీ, న్యాయస్థానం దానిని తిరస్కరించింది. దీన్ని సవాల్ చేస్తూ 2023లో ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అక్కడ కూడా ఆయనకు నిరాశే మిగిలింది. దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. దీంతో గతేడాది సుప్రీం కోర్టు ను ఆశ్రయించారు. పరస్పర అంగీకారంతో తమ వివాహ బంధాన్ని రద్దు చేసుకోవాలని అనుకుంటున్నట్లు ఇరువురు ఈ నెల మొదట్లో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా దీనిపై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం వీరికి విడాకులు మంజూరు చేస్తామంది.

# ప్రధాని మోదీ వీడియోపై సీజేపీ నాయకుడు దీప్కే కామెంట్

ప్రశ్నపత్రాల లీకు మాఫియా ఆటకట్టించడమే కొత్త చట్టం ఉద్దేశమంటూ ప్రధాని మోదీ ఇన్‌స్టాలో చేసిన పోస్టుపై కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పందించారు. యాంటీ పేపర్ లీక్ బిల్లు ఉభయసభల్లో ఆమోదం పొందిన నేపథ్యంలో మోదీ ప్రత్యేక వీడియో షేర్ చేశారు. దీనిపై దీప్కే స్పందిస్తూ.. ''దేశ భవిష్యత్ కంటే మీరే ధగధగలాడుతున్నారు'' అని అర్థం వచ్చేలా ఆ వీడియోకు కామెంట్ పెట్టారు.

మరోవైపు దీప్కే రోజురోజుకూ కేంద్ర ప్రభుత్వంపై విమర్శల తీవ్రతను పెంచుతున్నారు. జంతర్ మంతర్ ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులపై ప్రభుత్వ వేధింపులను ఆపాలని.. నిరసనకారులపై పెల్లెట్ తుపాకులు వాడేలా పోలీసులకు అనుమతి ఇచ్చిన వారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దారికి రాకపోతే యువత ప్రభుత్వాన్నే మారుస్తుందన్నారు..





# అన్నింటా సీసం... ఆదమరిస్తే నష్టం!

బెంగళూరులోని సెయింట్ జాన్స్ మెడికల్ కాలేజీ 'ఎమెరిటస్' ప్రొఫెసర్‌గా ఉన్న వెంకటేష్ లెడ్ ముప్పుపై దశాబ్దాలుగా పోరాడుతున్నారు. సీసం కాలుష్య నిర్మూలనకు, నాణ్యతా ప్రమాణాల పెంపునకు కృషి చేస్తున్నారు. ఆయన ప్రస్తుతం 'ఫౌండేషన్ ఫర్ క్వాలిటీ ఇండియా(ఎఫ్‌క్యూఐ)'కి సీఈవో, డైరెక్టర్‌గా, 'నేషనల్ రిఫరల్ సెంటర్ ఫర్ లెడ్ ప్రాజెక్ట్స్ ఇన్ ఇండియా'కు డైరెక్టర్‌గా సేవలు అందిస్తున్నారు. 'క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యూసీఐ)' పరిధిలోని ఎన్‌ఏబీఎల్, ఎన్‌ఏబీహెచ్ సంస్థలకు ప్రిన్సిపల్ అసెసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఐరాస పారిశ్రామిక అభివృద్ధి సంస్థ (యూఎన్ఐడీవో), డబ్ల్యూహెచ్‌వోలకు సాంకేతిక సలహాదారుగా సేవలందిస్తున్నారు. వెంకటేష్ పలు జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నారు. వివిధ అంతర్జాతీయ జర్నల్స్‌లో ఆయన పరిశోధనా పత్రాలు 350కి పైగా ప్రచురితమయ్యాయి.

**సీసం శరీరంలోకి ఎలా ప్రవేశిస్తుంది?**

దాన్ని బ్యాటరీలు, రంగులు, ప్లంబింగ్ పైపుల్లో వాడుతుంటారు. వీటి నుంచి సీసం సూక్ష్మ కణాలుగా మారి గాలి, మట్టి, నీటిలో కలుస్తుంది. ఆ నీరు, మట్టి ద్వారా మనం పండించే కూరగాయలు, పండ్లలోకి చేరుతుంది. వాటిని తిన్నప్పుడు మన శరీరంలోకి సీసం ప్రవేశిస్తుంది. విగ్రహాలకు వేసే చౌక రంగుల్లోనూ సీసం అధికంగా ఉంటుంది. ఆ విగ్రహాలను చెరువుల్లో కలిపినప్పుడు నీరు కలుషితం అవుతుంది. అదే నీటిని ఆవులు, గేదెలు తాగితే ఆ సీసం వాటి పాల ద్వారా మనుషుల శరీరాల్లోకి చేరుతుంది. ఇదొక గొలుసుకట్టు ప్రక్రియ. మన దేశంలో ఇళ్లల్లో వాడే డొమెస్టిక్, డెకరేటివ్ పెయింట్స్‌లో మాత్రమే సీసం తక్కువగా ఉండేలా నిబంధనలున్నాయి.

**సౌందర్య సాధనాలు, నిత్యం వాడే వస్తువుల్లోనూ సీసం ఉంటుందా?**

అవును. కొన్ని రకాల నాణ్యత లేని లిప్‌స్టిక్, నెయిల్ పాలిష్, ముఖ్యంగా 'హెయిర్ డై'లలో దాదాపు మూడు శాతం వరకు సీసం ఉంటుంది. ఇది చాలా ఎక్కువ పరిమాణమే. హెయిర్ డై తలకు పెట్టుకున్నప్పుడు చర్మం ద్వారా రక్తంలోకి, ఆపై కిడ్నీలకూ చేరి అవయవాలను దెబ్బతీస్తుంది. పాత కార్ల ఇంజిన్ భాగాలను కరిగించి తయారుచేసే కొన్ని రకాల పాత్రలు, ప్రెజర్ కుక్కర్ల ద్వారా వండేటప్పుడూ ఆహారంలోకి సీసం వెళ్తుంది. పిల్లల పెన్సిళ్లపై ఉండే రంగుల్లోనూ సీసం ఉంటుంది. చిన్నారులు పెన్సిళ్లను నోట్లో పెట్టుకున్నప్పుడు శరీరంలోకి చేరుతుంది.

**పిల్లలపై సీసం ప్రభావం ఎలా ఉంటుంది?**

ఆహారం, గాలి, చర్మం ద్వారా సీసం మనుషుల శరీరంలోకి ప్రవేశించి అవయవాలను దెబ్బతీస్తుంది. ముఖ్యంగా గర్భిణుల శరీరంలోకి వెళ్తే, అది నేరుగా కడుపులోని బిడ్డ మెదడుకు చేరుతుంది. పిల్లల రక్తంలో సీసం ఎక్కువగా ఉంటే ఐక్యూ తగ్గుతుంది. జ్ఞాపకశక్తి తగ్గడం, ఏకాగ్రత లేకపోవడం, రక్తహీనత, కడుపునొప్పి, కీళ్లనొప్పులు వస్తాయి. ఎముకల్లోని సీసం క్యాల్షియం అణువులను తొలగించడంవల్ల బోన్ వ్యాధులు వస్తాయి.

**లెడ్ నియంత్రణకు ఎలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు?**

దేశవ్యాప్తంగా 'ప్రాజెక్ట్-797' కింద ప్రతి జిల్లా ఆసుపత్రిలో ఒక విభాగాన్ని ఏర్పాటు చేసి, ఆ జిల్లాలో లెడ్ కాలుష్యం, పురుగు మందుల ప్రభావంపై బయో మానిటరింగ్ ద్వారా డేటా సేకరిస్తాం. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. పిల్లల ఆరోగ్యం మీదా దృష్టి పెడుతున్నాం. తెలంగాణలో మొదటి దశగా కరీంనగర్‌లో ఒక ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను ఎంపిక చేసి 200-300 మంది పిల్లలకు స్వచ్ఛందంగా లెడ్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తాం. వారి శరీరంలో సీసం ఎక్కువగా ఉంటే, పోషకాహార లోపనివారణ, పర్యావరణ మార్పుల ద్వారా చికిత్స అందిస్తాం. ఉపాధ్యాయులకు అవగాహన కల్పించి వారిని 'లీడర్'గా తీర్చిదిద్దుతాం. దీంతో వారు పిల్లలకు వారి కుటుంబాలకు అవగాహన కల్పిస్తారు.

**సీసం బారిన పడకుండా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?**

లెడ్ కాలుష్యం వందశాతం నివారించదగినదే. ఇళ్లకు రంగులు వేసేటప్పుడు 90 పీపీఎంలోపు ఉన్న బ్రాండెడ్ రంగులనే ఎంచుకోవాలి. పాత రంగులను తొలగించేటప్పుడు వచ్చే దుమ్ము శ్వాస ద్వారా శరీరంలోకి వెళ్లకుండా మాస్కులు ధరించాలి. పిల్లల్లో చేతులు, బొమ్మలను నోట్లో పెట్టుకునే అలవాటును నిలువరించాలి. కోటింగ్ సరిగా చేయని రాగి పాత్రలు, నాణ్యత లేని సిరామిక్, మట్టి పాత్రల్లో వంట చేయడం, నిల్వ చేయడం తగ్గించాలి. రంగుల ప్లాస్టిక్ బొమ్మలు, చౌక పెయింట్ బొమ్మలు వాడకూడదు. లెడ్ లేదని నిర్ధారించుకున్న రంగులనే వినియోగించాలి. మాస్కులు ధరించడం వల్ల కూడా గాలిలోని సీసాన్ని పీల్చకుండా ఉండవచ్చు. కొవిడ్ సమయంలో మాస్కులు వాడటంతో ప్రపంచవ్యాప్తంగా లెడ్ స్థాయిలు తగ్గాయి.



# ప్రజాధర్మానికి ఫిరాయింపుల తూట్లు

**ప్రజాస్వామ్యానికి మూలం ప్రజల తీర్పు. అంటే జనాదేశం. ప్రజల ప్రతినిధిగా స్థానిక సంస్థలకో, శాసనసభకో, పార్లమెంటుకో ఎన్నికయ్యేవారు ఈ జనాదేశాన్ని అనుసరించి నడుచుకోవాలి. అందుచేత పార్టీ ఫిరాయించడమనేది ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును ఉల్లంఘించడమే. అధికారం చేజిక్కించుకోవడానికి ఫిరాయింపులను ఆశ్రయించడం, మూడింట రెండొంతుల బలంతో చీలికలు తెచ్చి పబ్బం గడుపుకోవడం.. ఫిరాయింపుల నిరోధక చట్టం ఆశయాన్ని నీరుగారుస్తున్నవి. ఫిరాయింపుల చట్టానికి ఎన్ని సవరణలు చేసినా ఈ రాజకీయ అవినీతి బుల్డోజర్‌ను అడ్డుకోలేకపోతున్నాయి. కేంద్ర పాలకపక్షం స్వహస్తాలతో ఈ ఘాతుకానికి పాల్పడుతుండడాన్ని చూసి ప్రజాస్వామ్యం ముక్కున వేలేసుకుంటున్నది.**

తగిన మెజారిటీ లేక ఇటీవల వీగిపోయిన డీలిమిటేషన్, చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ సంయుక్త రాజ్యాంగ సవరణ బిల్లు స్థానంలో మళ్లీ అదే బిల్లును ప్రవేశపెట్టి ఈసారి నెగ్గించుకోవడానికి కేంద్రంలోని ఎన్డీఏ పాలకులు తృణమూల్ కాంగ్రెస్, శివసేన(ఉద్ధవ్)లో చీలికలు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. దీనివల్ల లోక్‌సభలో ఎన్డీఏ బలం పెరిగింది. కానీ రాజ్యాంగ సవరణ బిల్లు నెగ్గడానికి అవసరమైనంతగా అది పెరగలేదు. అయినా ప్రలోభాల ఎరవేసి ప్రతిపక్షంలో చీలికలు తేవడంలో తమకున్న నేర్పు



మీద భరోసాతో ఎన్డీఏ పాలకులు ఈ రాజ్యాంగ సవరణ బిల్లును మరోసారి ముందుకు తోయాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తున్నది.

లోక్‌సభలో, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం స్థానాల రిజర్వేషన్‌ను అమల్లోకి తేవడం కోసం 'నారీశక్తి వందన్ అధినియం' పేరిట 2023లో 106వ రాజ్యాంగ సవరణను తీసుకొచ్చారు. అయితే 2027 తర్వాత జరిగే నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణతో దీనిని ముడిపెట్టారు. ఇందువల్ల చట్టసభల్లో మహిళల కోటా దాదాపు 2034 వరకు అమలుకు నోచుకోని పరిస్థితి తలెత్తింది. ఇప్పుడు తమ రాజకీయ అవసరాల కోసం 2011 జనగణన ప్రాతిపదికగా డీలిమిటేషన్(నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ) చేపట్టి లోక్‌సభ నియోజకవర్గాలను సగం పెంచాలని, అదే పనిగా మహిళలకు చట్టసభల్లో 33శాతం కోటాను అమల్లోకి తేవాలని సంకల్పించి సంయుక్త రాజ్యాంగ సవరణ బిల్లును ఉద్దేశించారు.

చట్టసభల బలాన్ని పెంచడం కోసం జరపవలసిన సీట్ల పెంపు వ్యవహారం చుట్టూ అత్యంత వివాదం అల్లుకున్న సంగతి తెలిసిందే. ఆయా రాష్ట్రాల జనాభా ప్రకారం జరగవలసిన ఈ ప్రక్రియ వల్ల కుటుంబ నియంత్రణను కచ్చితంగా పాటించి జనాభా పెరుగుదలను పరిమితం చేసుకొని, అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న దక్షిణాది రాష్ట్రాలు ఈ పెంపులో తక్కువ సీట్లు పొందుతాయి. మరోపక్క జనాభా నియంత్రణలో, అభివృద్ధిలో బాగా వెనుకబడి ఉన్న ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ స్థానాలు లభిస్తాయి. ఫలితంగా దక్షిణాదికి తీవ్ర అన్యాయం జరుగుతుంది. అందుచేత జనాభా ప్రాతిపదికగా సీట్ల పెంపును దక్షిణాది రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి. అన్ని రాష్ట్రాలలో నియోజకవర్గాలను 50శాతం పెంచే చిట్కాను అమల్లోకి తెచ్చి ఈ వివాదం నుంచి బయటపడాలని కేంద్రంలోని ఎన్డీఏ పాలకులు ఆశిస్తున్నారు. మహిళల రిజర్వేషన్లను ముందుకు జరిపించి డీలిమిటేషన్‌కు జత చేయడం ద్వారా ప్రతిపక్షాన్ని కట్టడి చేయాలన్న ఉపాయాన్ని ఆశ్రయిస్తున్నారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేస్తే మహిళా వ్యతిరేకులుగా ముద్ర పడుతుందని విపక్షాలు భయపడతాయని పాలకపక్షం ఈ ఎత్తు వేసింది. విడిగా మహిళల రిజర్వేషన్ చట్టాన్ని అమలులోకి తెస్తే తమకు అభ్యంతరం లేదని స్పష్టం చేస్తూ సమైక్య ప్రతిపక్షం సంయుక్త రాజ్యాంగ సవరణ బిల్లును ఓడించిన అపూర్వ అమోఘ సన్నివేశాన్ని గత ఏప్రిల్ 17న పార్లమెంట్‌లో చూడగలిగాం. ప్రతిపక్షం అపూర్వమైన ఐక్యతను ప్రదర్శించింది. ఇది ప్రధాని మోదీని అమితంగా కలచివేసిందని అంటున్నారు. అందుచేత పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ఈ బిల్లును మళ్లీ తెచ్చి నెగ్గించుకోవాలని చూస్తున్నారు. ఇందుకోసమే అటు తృణమూల్ కాంగ్రెస్, ఇటు శివసేనలో చీలికలు తీసుకొచ్చారు. దీనివల్ల లోక్‌సభలో ఎన్డీఏ బలం 25 స్థానాలు పెరిగి 313కి చేరింది. అయినప్పటికీ రాజ్యాంగ సవరణకు కావలసిన మూడింట రెండొంతులకు (362) ఇంకా తక్కువే. కాబట్టి ప్రతిపక్షాలను మరిన్ని ప్రలోభాలతో మరింతగా చీల్చి బిల్లును నెగ్గించుకోవడానికి ఎన్డీఏ పాలకులు వెనుకాడకపోవచ్చు. ఇది ప్రతిపక్ష ఐక్యతకు పెను సవాలే!

పాలకపక్షం అధికారం అండతో తెచ్చే ఇటువంటి చీలికలు ప్రజాస్వామ్య పునాది అయిన జనాదేశానికి తూట్లు పొడిచి ప్రజాప్రాతినిధ్య పరమార్థానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయి. అందుచేత ఎన్నికల్లో ఏ పార్టీ ద్వారా నెగ్గారో అదే పార్టీలో చివరివరకూ కొనసాగవలసిన విధ్యుక్త ధర్మాన్ని విధిగా పాటించేలా తగిన చట్టాన్ని తీసుకురావాలి.

# సమాజానికి సిగ్గుచేటు!

**ఏ దేశంలో అయినా జనాభా స్థిరత్వానికి, ఆరోగ్యకరమైన కుటుంబ వ్యవస్థకు, సామాజిక అభివృద్ధికి లింగ నిష్పత్తి సమతూకంగా ఉండటం తప్పనిసరి. కానీ, 'సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్' నివేదిక ప్రకారం, సిక్కిం మినహా భారతావనిలో 2024లో ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 933 మంది అమ్మాయిలు మాత్రమే జన్మించారు. ఆ ఏడాది జాతీయ సగటుతో పోలిస్తే 11 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఆడపిల్లల జననాలు మరింత తక్కువగా నమోదయ్యాయి. నాగాలాండ్‌లో అవి అతి స్వల్పంగా (806) ఉంటే- ఝార్ఖండ్‌లో 890, బిహార్‌లో 894, గుజరాత్ 908, హరియాణా, తెలంగాణల్లో 910 చొప్పున, ఏపీలో 929గా లెక్కతేలాయి. తెలంగాణలోని 17 జిల్లాల్లో ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 900 మంది కంటే తక్కువ అమ్మాయిలు జన్మిస్తే, ఏపీలో మూడు జిల్లాల్లో అదే తరహా దురదృష్టకర పరిస్థితులు నెలకొన్నాయి. నల్గొండ జిల్లాలో మరీ తక్కువగా 787 మంది ఆడశిశువులే ఊపిరిపోసుకోవడం దేన్ని సూచిస్తోంది? ఈ గణాంకాలన్నీ దేశీయంగా పాతుకుపోయిన పితృస్వామ్య భావజాలాన్ని, లింగ వివక్షలనే కళ్లకుకడుతున్నాయి. ఒకపక్క ఆడబిడ్డలను ప్రాణప్రదంగా చూసుకుంటూ బాగా చదివిస్తున్న కుటుంబాలు క్రమంగా పెరుగుతున్నాయి.అదే సమయంలో మగపిల్లలే వంశోద్ధారకులనే బూజుపట్టిన ఆలోచనలతో ఆడపిల్లలను గుండెల మీద కుంపట్లుగా చూస్తున్నవారి మూలంగా ఇంకా కొనసాగుతున్న భ్రూణహత్యలు సమాజానికే సిగ్గుచేటు అవుతున్నాయి!**



ఆడబిడ్డలను కాపాడుకునేందుకు గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ(పీసీపీఎన్‌డీటీ) చట్టాన్ని తెచ్చినా, వ్యవస్థాగత లోపాల వల్ల దోషులకు శిక్షలు కొరవడుతున్నాయి. తత్ఫలితంగా దేశవ్యాప్తంగా ఎన్నో స్కానింగ్ సెంటర్లు, ప్రైవేటు ఆస్పత్రులు నిబంధనలకు విరుద్ధంగా పరీక్షలు నిర్వహిస్తూ భ్రూణహత్యలకు కారణమవుతున్నాయి. కొంతమంది ఆర్ఎంపీలు మొబైల్ స్కానింగ్ యంత్రాలతో గ్రామాలకే వెళ్లి గర్భస్థ ఆడశిశువుల ఉసురు పోసుకుంటున్నా అధికార యంత్రాంగం సమర్థంగా నిలువరించలేకపోతోంది. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ తదితర జిల్లాల్లో ఇలాంటి దారుణాలు యథేచ్ఛగా సాగుతున్నట్లు నిరుడు వెల్లడైంది. మరికొందరు దుర్మార్గులు అద్దె ఇళ్లలో అనైతిక స్కానింగ్ సెంటర్లు తెరుస్తున్నా వెంటనే అడ్డుకునేవారు కరవవుతున్నారు. అనంతపురంలో ఓ ప్రబుద్ధుడు ఇలాగే రెండు మూడు నెలల్లో 128 మందికి అక్రమంగా స్కానింగ్‌లు తీసినట్లు తేలింది. ఇలాంటి వాటికితోడు కుటుంబసభ్యుల ఒత్తిడిని భరించలేక కొంతమంది తల్లులు అప్పుడే పుట్టిన ఆడబిడ్డల్ని నిస్సహాయంగా వదిలేస్తుండటం దేశమెంతగా పురోగమిస్తున్నా తగ్గని సామాజిక జాడ్యాల తీవ్రతను పట్టిచూపుతోంది!

అబ్బాయే కావాలనే అనాగరిక ధోరణి మూలంగా గడిచిన అయిదు దశాబ్దాల్లో ఇండియాలో నాలుగున్నర కోట్ల మందికి పైగా అమ్మాయిలు అమ్మ కడుపులోనో లేదా భూమ్మీదకు వచ్చాకో కడతేరిపోయారన్నది ఐరాస జనాభా నిధి అంచనా! దేశీయంగా నెలకొన్న అరాచక పరిస్థితులకు ఇది అద్దంపడుతోంది. లింగ నిష్పత్తిలో సమతౌల్యం దెబ్బతింటే ఆడపిల్లల అక్రమ రవాణా, బలవంతపు పెళ్లిళ్లు, బాల్యవివాహాలు పెరిగిపోయే ప్రమాదం ఉంది. స్త్రీలపై హింస సైతం తీవ్ర స్థాయికి చేరుతుంది. లింగపరమైన అసమతుల్యత దీర్ఘకాలం కొనసాగితే కుటుంబ వ్యవస్థ బలహీనపడి సామాజిక అశాంతి ప్రబలుతుంది. ఈ ఉత్పాతాన్ని నివారించాలంటే స్కానింగ్ సెంటర్లపై నిరంతరం నిఘా ఉంచాలి. అడ్డగోలుగా అబార్షన్లు చేస్తున్న వైద్యులను తప్పక దండించాలి. ఆ మేరకు పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలి!

# ట్రంప్ దూసిన వీసా కత్తి!

**మితవాద రాజకీయం ఊరకే ఉండదు. నిరంతరం కొత్త శత్రువుల్ని వెదుక్కుంటుంది. తన చర్యల పర్యవసానంగా పుట్టుకొచ్చే సంక్షోభాలనుంచి జనం దృష్టి మరల్చడానికి నానా తంటాలూ పడుతుంది. ఆ రాజకీయంలోనే పుట్టి, దాన్ని మరింత దిగజార్చిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రెండో దఫా వచ్చాక వలసలపై కత్తిగట్టారు. అమెరికాలో చదువుకోవటానికొచ్చినవారు గరిష్ఠంగా నాలుగేళ్లకు మించి ఉండటానికి వీల్లేదంటూ తాజాగా తీసుకురావాలనుకుంటున్న నిబంధన ఆ పరంపరలో భాగమే. ఇతరేతర వీసాల సంగతి సరేసరి. ప్రపంచ దేశాల్లోని వారందరికీ ఉన్నత చదువుల గమ్యస్థానం అమెరికాయే. అక్కడ చదువుకుంటే సాఫ్ట్‌వేర్, ముఖ్యంగా కృత్రిమ మేధ (ఏఐ) రంగాల్లో మెరుగైన జీతాలతో కొలువులొస్తాయన్న నమ్మకమే అందుకు కారణం. అయితే ట్రంప్ తీసుకున్న కొత్త నిర్ణయంవల్ల విద్యార్థులకు మాత్రమే కాదు... అక్కడి విద్యాలయాలు, టెక్ రంగ సంస్థలకు కూడా సమస్యలొస్తాయి. విద్యాలయాల వేల కోట్ల ఆదాయం పడిపోతే, టెక్‌రంగ సంస్థలకు నిపుణుల కొరత ఏర్పడుతుంది.**

ఎందుకంటే స్థానికులతో పోలిస్తే విదేశాలనుంచి వచ్చే విద్యార్థులు చదువుల్లో, తెలివితేటల్లో చాలా ముందంజలో ఉంటారు. డిగ్రీ చదువులకొచ్చేవరకూ స్వదేశీయులకు అంతా ఉచితమే అయినా, అటుపై




తడిసిమోపెడవుతుంది. వారితో పోలిస్తే నిజానికి విదేశీ విద్యార్థులు రెండు మూడు రెట్లు అధికంగా చెల్లించాలి. ఆ మొత్తంతోనే స్థానికులకు స్కాలర్‌షిప్‌లిస్తారు. వారినుంచి తక్కువ ఫీజు వసూలు చేస్తారు. స్థానికులు హ్యూమనిటీస్, ఆర్ట్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్, లా తదితర కోర్సుల్లో ఆసక్తి కనబరుస్తారు. సాంకేతిక రంగంలో దూసుకెళ్లే అమెరికాకు 'స్టెమ్'(సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్) విభాగంలో నిపుణులు అవసరం. విదేశీయులు కఠినమైన వడపోత తర్వాత ఆ కోర్సులు చదవడానికి వెళ్లినవారు గనుక ఆ కోర్సులను సులభంగా ఆకళింపు చేసుకుంటారు. స్టెమ్ కోర్సుల్లో మాస్టర్స్, పీహెచ్‌డీ స్థాయిలో 70 శాతం సీట్లు విదేశీయులకే లభించటం ఇందుకే. స్థానికుల్ని వారితో పోటీపడేలా తీర్చిదిద్దటానికి తాము చేయాల్సిందేమిటన్న దృష్టి ట్రంప్‌కుగానీ, ఆయన ముందున్న పాలకులకుగానీ లేదు.

తగినంతమంది సాంకేతిక నిపుణులు స్థానికంగా లభ్యంకాకపోవటంవల్లనే అమెరికా దిగ్గజ టెక్ సంస్థలు విదేశాలనుంచి వచ్చేవారిని ఎంపిక చేసుకోవాల్సివస్తున్నది. అలా భర్తీ చేసుకోనట్టయితే ఇన్నోవేషన్ రంగంలో ఆ దేశం వెనకబడిపోతుంది. అదిగాక విదేశీ విద్యార్థులు చెల్లించే వేలాది కోట్ల డాలర్ల ఫీజులు, టెక్ సంస్థల విస్తరణ, లాభార్జనల వల్ల మరిన్ని వేలకోట్ల డాలర్లు పన్నుల రూపంలో ఖజానాకు సమకూరుతాయి. ఇతరత్రా సంస్థల సంగతలావుంచి మన భారత సంస్థలు టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ కార్పొరేట్ పన్ను రూపంలోనే నిరుడు 867 కోట్ల డాలర్లు (రూ. 73,000 కోట్లకు పైగా) చెల్లించాయి. మొత్తంగా అన్ని సంస్థలూ 13,008 కోట్ల డాలర్లకు పైగా (రూ. 10,99,166 కోట్లుకుపైగా) చెల్లించాయి. ఇవిగాక జీఎస్‌టీ, కస్టమ్స్ సుంకం, ఉద్యోగులు చెల్లించే టీడీఎస్‌లు అదనం. ఇంతగా లాభపడుతూ బాధిత దేశంగా శోకించటం అమెరికాకే చెల్లింది.

వీసా వ్యవస్థ దశాబ్దాలుగా దుర్వినియోగమవుతున్నదనీ, దేశ భద్రత ప్రమాదంలో పడిందనీ గొంతుచించుకుంటున్న అమెరికా తాను ఎడాపెడా వర్ధమాన, వెనకబడిన దేశాలనుంచి దశాబ్దాలుగా కొల్లగొడుతున్న సంపద గురించి మాట్లాడదు. ఇందులో ఆ దేశాల పాలకుల తప్పు కూడా ఉంది. మన దేశం సంగతే తీసుకుంటే 2047 కల్లా 'వికసిత్ భారత్' తీసుకొస్తామంటారు. కానీ అమెరికా మాదిరిగా కనీసం డిగ్రీవరకూ ఉచిత విద్య, నామమాత్రపు ఫీజులతో ఆపై విద్య అందుబాటులోకి తెచ్చే ఆలోచన చేయరు. జీడీపీలో కనీసం 6 శాతం విద్యకు వ్యయం చేయాలన్న లక్ష్యం పాటించరు. హైస్కూల్ విద్యవరకూ శ్రద్ధ పెడుతున్నట్టు కనబడుతూ ఆపై చదువుల్ని కార్పొరేట్లకు వదిలేశారు. వేలాదిమంది ప్రొఫెసర్ల కొరతతో విశ్వవిద్యాలయాలు దయనీయ స్థితిలో పడినా పట్టదు. కొలువుల సంగతి సరేసరి. ఇలాంటి స్థితిలో ట్రంప్ బెదిరిస్తే, పరిమితులు విధిస్తే నిస్సహాయంగా మిగలటం తప్ప మన యువత చేయగలిగేది ఏముంది?

# స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలి

**- జూలై 31 నుంచి ఆగస్టు 30వరకు క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ**
**- గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో డిఆర్వో మలోల సమీక్ష**

**అనంతపురం, జూలై 31, అనంత జనశక్తి న్యూస్**



స్వచ్ఛమైన, తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలని డిఆర్ఓ మలోల పేర్కొన్నారు.శుక్రవారం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు డిఆర్ఓ మలోల గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ...జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్2026) ప్రక్రియను పారదర్శకతతో, రాజకీయ పార్టీల సహకారంతో సమర్థవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. దీంతో జిల్లాలో మొత్తం 17,90,436 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఎస్ఐఆర్, కార్యక్రమంలో భాగంగా మరణించిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, గైర్హాజరైన వారు, డూప్లికేట్ నమోదులు తదితర కారణాల ఆధారంగా జిల్లాలో మొత్తం2,48,087 మంది ఓటర్లను ఏఎస్ డిడి కింద తొలగింపునకు ప్రతిపాదించినట్లు తెలిపారు.ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో బూత్ లెవల్ అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, మరణాలు, డూప్లికేట్ నమోదులు తదితర అంశాలపై చర్చించి, సమావేశాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరిగిందన్నారు.ప్రజల నుంచి జూలై 31 నుంచి ఆగస్టు 30, వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించబడతాయని, వాటిపై సెప్టెంబర్ 28, లోపు విచారణ పూర్తిచేసి, అక్టోబర్ 3,న తుది ఓటర్ల జాబితా ప్రచురించబడుతుందని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఓటరు ముసాయిదా జాబితాను పరిశీలించి, పేరు పొరపాటున తొలగించబడినా లేదా వివరాల్లో లోపాలు ఉన్నా వెంటనే క్లెయిమ్ దాఖలు చేయాలని సూచించారు. అలాగే మరణించిన వారు లేదా అర్హత లేని వారి పేర్లు జాబితాలో కొనసాగుతున్నట్లయితే సంబంధిత అభ్యంతరాలను తెలపాలని కోరారు.ముసాయిదా ఓటరు జాబితా పీడీఎఫ్ ప్రతులను రాజకీయ పార్టీలకు అందజేయడంతో పాటు అవసరమైన అన్ని వివరాలను అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం డిటి కనకరాజు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ

**- జిల్లాలో మొత్తం ఓటర్లు 17,90,436..**
**- పురుష ఓటర్లు 8,83,174 మంది.. మహిళా ఓటర్లు 9,07,053 మంది.. ట్రాన్స్ జెండర్లు 209 మంది ఉన్నారు.**
**- ఎవరికైనా ఏవైనా అభ్యంతరాలు ఉన్నయెడల, క్లైములు మరియు అభ్యంతరములు 31.07.2026వ తేదీ నుండి 30.08.2026 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు..**
**- జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్..**

**అనంతపురం, జులై 31 :అనంత జనశక్తి న్యూస్**



అనంతపురం జిల్లా ముసాయిదా ఓటర్ల జాబితాను జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ విడుదల చేశారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసి జాబితా ప్రతులను జిల్లాలోని ఆయా నియోజకవర్గాల ఈడిటిలకు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితా (డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్) ను ప్రచురించడం జరిగిందని, ఇందుకు సంబంధించి జిల్లాలో మొత్తం ఓటర్లు 17,90,436 మంది ఉన్నారన్నారు. ఇందులో పురుష ఓటర్లు 8,83,174 మంది (49.33 శాతం).. మహిళా ఓటర్లు 9,07,053 (50.66 శాతం) మంది.. ట్రాన్స్ జెండర్లు 209 (0.01 శాతం) మంది ఉన్నారన్నారు. జిల్లాలో మొత్తం 2,48,087 (12.17 శాతం) మంది ఓటర్లను ఏ.ఎస్.డి.డి (ASDD) క్రింద తొలగించడం జరిగిందని, వాటిలో ఆచూకీ తెలియని ఓటర్లు (Untraceable / Absent) 46,276 (2.27 శాతం), శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఓటర్లు (Permanently Shifted) 79,582 (3.90 శాతం), మరణించిన ఓటర్లు (Death) 75,378 (3.70 శాతం), రెండు ఓట్లు కలిగి ఉన్న ఓటర్లు (Double) 46,452 (2.28 శాతం), (Others) 399 (0.02 శాతం) ఉన్నారన్నారు.. ఎవరికైనా ఏవైనా అభ్యంతరములు ఉన్నయెడల, క్లైములు మరియు అభ్యంతరములు 31.07.2026 వ తేదీ నుండి 30.08.2026 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఓటర్లు ఎవరైనా ఓటరు జాబితా చూసుకోవాలి అనుకున్న వారు ఆన్లైన్ నందు కానీ, కలెక్టర్ కార్యాలయం, ఈఆర్ఓ కార్యాలయం, ఏఈఆర్ఓ కార్యాలయం మరియు మీ సంబందిత బి.ఎల్.ఓ దగ్గర పని వేళలో (10:30 AM to 05:00 PM) చూసుకొనవచ్చునన్నారు రాయదుర్గం నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,36,579 మంది ఉండగా, పురుష ఓటర్లు 1,17,518 మంది.. మహిళా ఓటర్లు 1,19,019 మంది.. ట్రాన్స్ జెండర్లు 42 మంది ఉన్నారన్నారు.ఉరవకొండ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,03,306 మంది ఉండగా, పురుష ఓటర్లు 1,00,480 మంది.. మహిళా ఓటర్లు 1,02,801 మంది.. ట్రాన్స్ జెండర్లు 25 మంది ఉన్నారన్నారు.గుంతకల్లు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,44,853 మంది ఉండగా, పురుష ఓటర్లు 1,19,335 మంది.. మహిళా ఓటర్లు 1,25,459 మంది.. ట్రాన్స్ జెండర్లు 59 మంది ఉన్నారన్నారు.తాడిపత్రి నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,19,095 మంది ఉండగా, పురుష ఓటర్లు 1,08,157 మంది.. మహిళా ఓటర్లు 1,10,920 మంది.. ట్రాన్స్ జెండర్లు 18 మంది ఉన్నారన్నారు.సింగనమల నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,22,458 మంది ఉండగా, పురుష ఓటర్లు 1,10,485 మంది.. మహిళా ఓటర్లు 1,11,945 మంది.. ట్రాన్స్ జెండర్లు 28 మంది ఉన్నారన్నారు.అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,28,673 మంది ఉండగా, పురుష ఓటర్లు 1,10,262 మంది.. మహిళా ఓటర్లు 1,18,392 మంది.. ట్రాన్స్ జెండర్లు 19 మంది ఉన్నారన్నారు.కళ్యాణదుర్గం నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,10,918 మంది ఉండగా, పురుష ఓటర్లు 1,04,752 మంది.. మహిళా ఓటర్లు 1,06,157 మంది.. ట్రాన్స్ జెండర్లు 9 మంది ఉన్నారన్నారు.రాప్తాడు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,24,554 మంది ఉండగా, పురుష ఓటర్లు 1,12,185 మంది.. మహిళా ఓటర్లు 1,12,360 మంది.. ట్రాన్స్ జెండర్లు 9 మంది ఉన్నారన్నారు. అలాగే సర్వీస్ ఓటర్లకు సంబంధించి మొత్తం ఓటర్లు 2,021 మంది ఉన్నారన్నారు. అందులో రాయదుర్గం నియోజకవర్గంలో 65 మంది, ఉరవకొండ నియోజకవర్గంలో 235 మంది, గుంతకల్లు నియోజకవర్గంలో 408 మంది, తాడిపత్రి నియోజకవర్గంలో 207 మంది, సింగనమల నియోజకవర్గంలో 413 మంది, అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 170 మంది, కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 123 మంది, రాప్తాడు నియోజకవర్గంలో 400 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మలోల, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దార్ కనకరాజ్, సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్, ఎలక్షన్ డిటిలు సుజాత, హరిప్రసాద్, కేశవరెడ్డి, నాగేంద్రప్రసాద్, హబీబాఖానం, నాగమణి, సువర్ణ, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# 2030ఏళ్ల సమస్యలకు ... రెండేళ్లలో పరిష్కారం చూపించాం

**- ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి**
**- 39వ డివిజన్ లక్ష్మీనగర్ లో కూటమి నాయకులతో కలిసి పర్యటన**
**- రూ.1296కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశామన్న ఎమ్మెల్యే**
**- గత ప్రభుత్వం కేవలం బటన్లు నొక్కి ప్రజల్ని మభ్య పెట్టిందని విమర్శలు**

**అనంతపురం జూలై 31, అనంత జనశక్తి న్యూస్**



అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 20 నుంచి 30ఏళ్లుగా ఉన్న సమస్యలకు రెండేళ్లలో పరిష్కారం చూపించామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన 39వ డివిజన్ లక్ష్మీనగర్ లో పర్యటించారు. కూటమి నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్తూ రెండేళ్లలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. సంక్షేమ పథకాలు అందాయా.. డివిజన్ లో ఇంకా ఏమైనా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలా అని అడుగుతూ ముందుకు సాగారు. ప్రజల నుంచి ఎమ్మెల్యే దగ్గుపాటికి మంచి స్పందన కనిపించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ మా పాలనపై ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతోందన్నారు. రెండేళ్లలోనే మౌళిక వసతులకు నియోజవర్గంలో 200కోట్లు ఖర్చు చేశామన్నారు. 1296కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశామన్నారు. 20ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామన్నారు. 39వ డివిజన్ లో మాత్రమే కోటి రూపాయలతో వివిధ కార్యక్రమాలు చేసినట్టు వివరించారు. 20లక్షలతో ముస్లిం మైనార్టీలకు కమ్యూనిటీ భవనం నిర్మించినట్టు చెప్పారు. రాష్ట్రంలో గత వైసీపీ పాలనలో డంపింగ్ యార్డుల్లో లక్ష టన్నుల చెత్త పెట్టిపోయారన్నారు. ఇప్పటికే 80శాతం వరకు తమ ప్రభుత్వం దానిని తొలగించిందన్నారు. నగరానికి డంపింగ్ యార్డు పెద్ద సమస్యగా మారిందని.. అందుకే తమ ప్రభుత్వం వచ్చాక.. దానిని తొలగిస్తున్నామన్నారు. ఇప్పటికే 80శాతం పైగా పూర్తైందని అక్టోబర్2 నాటికి చెత్త లేకుండా చేసి అక్కడ ఫ్రెష్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయబోతున్నామన్నారు. మిగిలిన స్థలంలో పార్కు నిర్మించబోతున్నామని వివరించారు. నగరంలో స్మార్ట్ సిటీతో పాటు ప్రభుత్వ కార్యాలయాలకు సోలార్ ఏర్పాటు చేసి విద్యుత్ బిల్లులు ఆదా చేస్తున్నట్టు వెల్లడించారు. నడమివంక, మరువ వంకకు ప్రొటెక్షన్ వాల్స్, కమ్యూనిటీ భవనాలు నిర్మిస్తామన్నారు. కొత్త పింఛన్లు కావాలని చాలా మంది దరఖాస్తులు చేసుకున్నారని.. త్వరలోనే వాటిని మంజూరు చేస్తామన్నారు. గత ప్రభుత్వం కేవలం బటన్లు నొక్కి ప్రజల్ని మభ్య పెడితే తాము ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నట్టు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో 39వ డివిజన్ క్లస్టర్ ఇంచార్జ్ చేపల హరి, టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి సంగా తేజస్విని, టిడిపి నాయకులు రాయల్ మధు, ఇస్మాయిల్, ఓంకార్ రెడ్డి, కరీం, కురుబ నారాయణస్వామి, సింగవరం రవి, కార్పొరేషన్ డైరెక్టర్లు రంగాచారి, కడియాల కొండన్న, బిజెపి జిల్లా నాయకుడు అశోక్ రెడ్డి, బిజెపి జిల్లా నాయకుడు అశోక్ రెడ్డి, టిడిపి జిల్లా మీడియా కోఆర్డినేటర్ దబ్బర కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి అర్జీ పరిష్కారమే మా బాధ్యత.. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

**- 52వ ప్రజా దర్బార్‌లో వినతుల స్వీకరణ.. అధికారులకు వెంటనే ఆదేశాలు**

**అనంతపురం జూలై 31, అనంత జనశక్తి న్యూస్**

**ప్రజల నుంచి అర్జీలను పరిష్కరించడమే తమ లక్ష్యమని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు. అనంతపురం అర్బన్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన 52వ ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి, ప్రతి సమస్యను స్వయంగా పరిశీలించారు. వినతిపత్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే, సమస్యల తీవ్రతను బట్టి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే ఏ సమస్యనూ పెండింగ్‌లో ఉంచబోమని, ప్రతి అర్జీకి నిర్ణీత గడువులో పరిష్కారం చూపించేలా నిరంతర పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని పేర్కొన్న దగ్గుపాటి ప్రసాద్, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తామని అన్నారు. ప్రజా దర్బార్ ద్వారా సామాన్యుల సమస్యలు నేరుగా ప్రభుత్వ దృష్టికి చేరుతున్నాయని, సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.**



# ఖచ్చితంగా సమస్యలను పరిష్కరించాలి..



**-వరుసగా 3వ శుక్రవారం కూడేరు మండలం ఉదిరిపికొండ గ్రామంలో ఒక నెల - ఒక నియోజకవర్గం - నాలుగు సందర్శనలు కార్యక్రమం నిర్వహణ..**
**- పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..**

**అనంతపురం, జులై 31 :అనంత జనశక్తి న్యూస్**

కూడేరు మండలం ఉదిరిపికొండ గ్రామంలో వరుసగా 3వ శుక్రవారం ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు సందర్శనలు కార్యక్రమం నిర్వహించగా, ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదిరిపికొండ పరిధిలోని గ్రామాలకు చెందిన ప్రజలు నుంచి సమస్యలను తెలుసుకుని వారి నుంచి వినతి పత్రాలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. మొదటి వారం ఈ కార్యక్రమంలో 187 అర్జీలను, రెండవ వారం 62 అర్జీలను, మూడవ వారం 76 అర్జీలను స్వీకరించడం జరిగింది. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్దేశిత గడువులోపు వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కూడేరు మండలం ఉదిరిపికొండ గ్రామంలో ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు సందర్శనలు కార్యక్రమాన్ని వరుసగా 3 శుక్రవారాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో స్వీకరించిన అన్ని రకాల అర్జీలను 4వ వారంలోపు పూర్తి స్థాయిలో ఖచ్చితంగా పరిష్కరించాలని ఆయా శాఖల మండల అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను చట్ట ప్రకారం పరిష్కరించగలిగినవి పరిష్కరించాలని, పరిష్కరించలేనివి ఎందుకు పరిష్కరించలేము అనేది అర్జీదారులకు తెలపాలన్నారు. ఈ విషయమై ప్రజలకు అవగాహన ఉండాలన్నారు. ఎక్కువగా భూమికి సంబంధించిన సమస్యలు వచ్చాయని, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఇళ్ల పట్టాలు, విద్యుత్ సమస్యలు, వ్యవసాయానికి సంబంధించిన సమస్యలు, విద్యాశాఖ, ఆర్డబ్ల్యూఎస్, వెలుగు ఏపిఎం, తదితర శాఖల పరిధిలో వచ్చిన సమస్యలను నాణ్యతగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల మండల అధికారులను ఆదేశించారు. వచ్చే శుక్రవారం ఉదయం నిర్వహించే కార్యక్రమంలో అర్జీదారులను పిలిపించుకొని వారిచ్చిన అర్జీలను చదివి వినిపించాలని, పరిష్కరించ గలిగినవి పరిష్కరించి, పరిష్కరించలేనివి ఎందుకు పరిష్కరించలేదు అనేది వివరాలతో సహా వారికి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మోహన్ కుమార్, ఆయా శాఖల మండల అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# గుమ్ముడుపాడులో గుక్కెడు నీటికోసం గిరిజనుల అవస్థలు..!





**- యుద్ధప్రాతిపదికన తాగునీటి సౌకర్యం కల్పించాలి –**
**- హ్యూమన్ రైట్స్ డిఫెండర్ బిడ్డ సింహాచలం**

**అనంతగిరి, జూలై 31 (అనంత జనశక్తి న్యూస్):**

అనంతగిరి మండలం పెదబిడ్డ పంచాయతీ పరిధిలోని గుమ్ముడుపాడు గ్రామంలో తీవ్రమైన తాగునీటి సమస్య నెలకొనడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హ్యూమన్ రైట్స్ డిఫెండర్ బిడ్డ సింహాచలం ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు మారడం లేదని ఆయన విమర్శించారు. గుమ్ముడుపాడు గ్రామంలో సుమారు 10 కుటుంబాలకు చెందిన 45 మంది నివసిస్తున్నప్పటికీ, నేటికీ కనీస తాగునీటి సౌకర్యం లేక ప్రజలు తీవ్ర కష్టాలు పడుతున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'జల్ జీవన్ మిషన్' వంటి పథకాల ద్వారా ప్రతి గ్రామానికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నామని చెబుతున్నప్పటికీ, గుమ్ముడుపాడు గ్రామం మాత్రం ఆ పథకాల ఫలాలకు దూరంగా ఉందన్నారు. గ్రామ సమస్యలను పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని, పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ స్పందన లేకపోవడం బాధాకరమని సింహాచలం మండిపడ్డారు. గ్రామానికి తాగునీటి సౌకర్యం కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.
గుమ్ముడుపాడు గ్రామంలో తాగునీటి సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని, స్థానిక అధికారులు స్పందించని పక్షంలో ఐటీడీఏ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని శాశ్వత పరిష్కారం చూపాలని హ్యూమన్ రైట్స్ డిఫెండర్ బిడ్డ సింహాచలం ప్రభుత్వాన్ని కోరారు.

# పదవి విరమణ పొందుతున్న ఆర్ ఐ కిష్టప్ప కు సన్మానం

**యాడికి, జూలై 31,అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రంలో ఉన్న తహసిల్దార్ కార్యాలయంలో పదవి విరమణ పొందుతున్న ఆర్ ఐ కిష్టప్ప ను శుక్రవారం తెదేపా నాయకులు కార్యకర్తలు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా తెదేపా నాయకులు మాట్లాడుతూ కిష్టప్ప శేష జీవితం ఆనందమయంగా కొనసాగాలని ఆకాంక్షించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆర్ ఐ కిష్టప్ప కు శాలువా కప్పి, పూలమాలలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ప్రతాప్ రెడ్డి, వీఆర్వో దామోదర్ , రుద్రమ నాయుడు, వేలూరు రంగయ్య,తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నో ఏళ్ల జర్నలిస్టుల కల ప్రెస్ క్లబ్



- నేడు ఎమ్మెల్యే అమిలినేని చొరవతో సాకారం
- వినతిపత్రం ఇచ్చిన గంటలోనే స్థలం చూపించడం..త్వరలోనే భూమిపూజ
- హర్షం వ్యక్తం చేసిన జర్నలిస్టులు

**కళ్యాణదుర్గం జూలై 31, అనంత జనశక్తి న్యూస్**

ఎంతో మంది మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు మారిపోయారు కానీ జర్నలిస్టుల ప్రెస్ క్లబ్ స్థలం ఇవ్వలేకపోయారు..నేడు జర్నలిస్టుల డిమాండ్ల దినోత్సవం సందర్బంగా ప్రజావేదిక నందు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేయగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఆర్డీఓ కి ఫోన్ చేసి వెంటనే స్థలం కేటాయించాలని చెప్పడంతో సర్వేయర్, వీఆర్వోలను పంపి స్థలం చూపించడం జరిగింది..ప్రెస్ క్లబ్ కోసం ఇప్పటికే ప్లాన్ సిద్ధం అయిందని త్వరలోనే భూమిపూజ కూడా చేయనున్నట్లు తెలిపారు.అంతే కాకుండా జర్నలిస్టులు అందరికి భీమా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు చెల్లిస్తానని తెలియజేశారు..

## "నేతన్న సేవ" పథకం కింద చేనేత కార్మికుల అర్హు ల జాబితా ప్రకటించాలి



- చేనేత అనుబంధ,ఉప వృత్తుల కార్మికులకు నేతన్న సేవ పథకం అందించాలి
- చేనేత కార్మికులు

**యాడికి, జూలై 31, అనంత జనశక్తి న్యూస్**

నేతన్న సేవ" పథకం కింద చేనేత కార్మికుల అర్హుల జాబితా ప్రకటించాలని మామిళ్ళ నారాయణస్వామి, చేనేత కార్మికులు తహాశీల్దార్ ప్రతాప్ రెడ్డి కి తెలిపారు. మండల కేంద్రంలో ఉన్న తహాశీల్దార్ కార్యాలయం లో శుక్రవారం చేనేత కార్మికులు వినతి పత్రం ను అందచేశారు.ఈ సందర్భంగా మామిళ్ళ నారాయణ స్వామి, చేనేత కార్మికులు తహాశీల్దార్ ప్రతాప్ రెడ్డి తో మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో వ్యవసాయం తరువాత చేనేత పరిశ్రముపై ఆధారపడి వేలాది మంది చేనేత కార్మికులు, అనుబంధ కార్మికులు జీవనం చేస్తున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆగస్టు 7న జాతీయ దినోత్సవం సందర్భంగా "నేతన్న సేవ" పథకం ద్వారా ప్రతి చేనేత కార్మికుని కుటుంబానికి ప్రతి ఏడాది రూ 25 వేలు ఇస్తామని ప్రకటించిందని, అనంతపురం జిల్లాలో కేవలం 5,251 మంది చేనేత కార్మికుల కుటుంబాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా 51,952 మంది చేనేత కార్మికుల కుటుంబలను అర్హ ప్రకటించిందని తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా "నేతన్న నేస్తం" పథకం ద్వారా దాదాపు 90,000 వేలమంది చేనేత కార్మికుల కుటుంబాలను ఎంపిక చేసి,ఐదు సంవత్సరాల పాటు ప్రతి ఏడాది రూ.24 వేలను చొప్పున ఐదు సంవత్సరాలు రూ. 1,20,000 లను చేనేత కార్మికుల బ్యాంకు ఖాతాలో జమా చేయడం జరిగిందన్నారు. ఉచిత విద్యుత్ 200 యూనిట్స్ పొందిన చేనేతకార్మికుల కుటుంబాలకు మాత్రమే అ ప్రకటించిందని,ఈ ప్రభుత్వం అనుబంధ కార్మికలు, ఉప వృత్తుల వారికి కూడ ఈ "నేతన్న సేవ" పథకాన్ని అమలుచేస్తామని చెప్పడం జరిగిందన్నారు .అనుబంధ కార్మికులు, ఉప వృత్తుల వారు, కండేలు చుట్టేవారు,రంగులు అద్దె వారు, అచ్చు అతికేవారు, డోలు చుట్టేవారు, జారీ రాట్నం చుట్టేవారు, వార్పు అంటు పెట్టెవారు. వీరందరికి కూడా "నేతన్న సేవ" పథకం ద్వారా రూ25వేలను వర్తింప చేయాలని తెలిపారు. అనంతరం వినతిపత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## యువత మాదక ద్రావ్యాలకు దూరంగా ఉండాలి..

- మై భారత్ ఆధ్వర్యంలో ఘనంగా

**"నషాముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్" కార్యక్రమం**

**అనంతపురం, జులై 31 :అనంత జనశక్తి న్యూస్**

భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు & క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మేరా యువ భారత్, అనంతపురం నిర్వహణలో నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో "నషాముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్" జిల్లా స్థాయి కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జేఎన్‌టీయూ అనంతపురం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా.జి. మమతా, జిల్లా యువజన అధికారి ఐశయ్య, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కమిటీ సభ్యులు డి.భరత్, ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.సరిత, నిగమా ఫౌండేషన్ కోఫౌండర్ వసుంధర, మై భారత్ కోఆర్డినేటర్ బిసాతి భరత్, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాటి జీవన్ కుమార్ మరియు కె.జయమారుతి, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె. భార్గవి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, యువత దేశ భవిష్యత్తుకు వెన్నెముక అని, మాదక ద్రావ్యాల వినియోగం యువత ఆరోగ్యం, కుటుంబం, సమాజం మరియు దేశ అభివృద్ధిపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ప్రతి యువకుడు మాదక ద్రావ్యాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకొని దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అలాగే "నషా ముక్త్ భారత్ - వికసిత్ భారత్" లక్ష్య సాధనలో భాగంగా ప్రజల్లో మాదక ద్రావ్యాల నిర్మూలనపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం అతిథులు, యువతతో కలిసి "నషాముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్" ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని యువత కోసం డిక్లమేషన్, కథా రచన, స్లోగన్ రచన, చిత్రలేఖనం, జానపద నృత్యాలు, జానపద గేయాలు, నుక్కడ్ నాటకాలు, షార్ట్ స్టోరీ తదితర పోటీలు నిర్వహించగా, యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన యువతకు బహుమతులు ప్రదానం చేయగా, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంసాపత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో జ్యూరీ సభ్యులు విష్ణుప్రియ, వీరేంద్ర, నాగభూషణ్, నాగశుభ, ప్రగతి పదం యూత్ అసోసియేషన్ సభ్యులు సాయి కార్తిక్, అంబరీష్, రాము, అలాగే మై భారత్ వాలంటీర్లు, యువజన సంఘాల ప్రతినిధులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అధ్యాపకులు మరియు పెద్ద సంఖ్యలో యువతీ యువకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు అడ్డుకట్ట వేద్దాం"

- రాయలసీమలో పెరుగుతున్న ఊపిరితిత్తుల క్యాన్సర్ భారం
- ముందస్తు పరీక్షలతోనే ప్రాణరక్షణ
- ఆగస్టు 1 – ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినోత్సవం
- డా. పి. వెంకట సింహ
- సీనియర్ కన్సల్టెంట్ & లీడ్ మెడికల్, హెమటో ఆంకాలజిస్ట్
- కిమ్స్ సవీర, అనంతపురం

**అనంతపురం జూలై 31, అనంత జనశక్తి న్యూస్**



రాయలసీమ ప్రాంతంలో ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా అనంతపురం జిల్లాలో పొగాకు వినియోగం, బీడీ అలవాటు, వాయు కాలుష్యం, గనులు-రాతి క్వారీల దుమ్ము, వ్యవసాయంలో వాడే రసాయనాలు వంటి కారణాలు ఊపిరితిత్తుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని నివేదికలు వెల్లడిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ సంబంధిత మరణాల్లో అగ్రస్థానంలో ఉన్న ఊపిరితిత్తుల క్యాన్సర్ భారతదేశంలో కూడా ప్రధాన ఆరోగ్య సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో ప్రతి సంవత్సరం ఆగస్టు 1న ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన పెంచుతున్నారు.

రాయలసీమలో ఎందుకు ఎక్కువ ప్రమాదం?

అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో గ్రామీణ ప్రాంతాల్లో బీడీ, సిగరెట్ అలవాట్లు ఇప్పటికీ విస్తృతంగా ఉన్నాయి. ఇంట్లో ఎవరో ధూమపానం చేయడం వల్ల కుటుంబ సభ్యులు కూడా పరోక్ష ధూమపానానికి గురవుతున్నారు. రాతి క్వారీల్లో పనిచేసే కార్మికులు, సిమెంట్ పరిశ్రమలు, నిర్మాణ రంగం, ధూళి ఎక్కువగా ఉండే పనుల్లో పనిచేసే వారిలో ఊపిరితిత్తుల వ్యాధులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీర్ఘకాలం ఇలాంటి వాతావరణంలో ఉండడం క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుంది.టిబీతో గందరగోళం

రాయలసీమలో క్షయవ్యాధి (టిబీ) కేసులు కూడా అధికంగా ఉండటంతో ప్రారంభ దశలో ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను టిబీగా భావించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దగ్గు తగ్గకపోయినా చాలామంది ఆలస్యంగా వైద్యులను సంప్రదిస్తారు. దీంతో వ్యాధి ముదిరిన తర్వాతే నిర్ధారణ అవుతోంది. ముందస్తుగా గుర్తిస్తే చికిత్స ఫలితాలు గణనీయంగా మెరుగవుతాయని వైద్య పరిశోధనలు చెబుతున్నాయి.

క్రింది లక్షణాలు రెండు వారాలకు మించి కొనసాగితే వెంటనే పరీక్షలు చేయించుకోవాలి:

నిరంతర దగ్గు, కఫంలో రక్తపు చారలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతినొప్పి, గొంతు బొంగురు పోవడం, ఆకస్మిక బరువు తగ్గడం, దీర్ఘకాలిక జ్వరం లేదా అలసట, ఎముకల నొప్పులు

ఎవరెవరు స్క్రీనింగ్ చేయించుకోవాలి?

50 నుంచి 80 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు, 20 సంవత్సరాలకు పైగా ధూమపానం చేసినవారు, గత 15 సంవత్సరాల్లో ధూమపానం మానేసిన వారు, గనులు, క్వారీలు, సిమెంట్, నిర్మాణ రంగాల్లో పనిచేసేవారు, తీవ్రమైన వాయు కాలుష్య ప్రాంతాల్లో నివసించే వారు వైద్యుల సలహాతో ఊపిరితిత్తుల స్క్రీనింగ్ చేయించుకోవడం మంచిది.అనంతపురంలోనే ఆధునిక చికిత్సలు

గతంలో ఊపిరితిత్తుల క్యాన్సర్ చికిత్స కోసం హైదరాబాద్ లేదా బెంగళూరు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం అనంతపురంలోనే పెట్ సీటీ, సీటీ ఆధారిత నిర్ధారణ, బ్రోంకోస్కోపీ, సీటీ స్కాన్ గైడెడ్ బయాప్సీ, బయోమార్కర్ పరీక్షలు, లిక్విడ్ బయాప్సీ వంటి పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. కీమోథెరపీ, ఇమ్యునోథెరపీ, టార్గెటెడ్ థెరపీ, ఆధునిక రేడియేషన్ చికిత్సలు, ఆధునిక శస్త్రచికిత్సలు వంటి సదుపాయాలు ఉన్నాయి.నివారణే ఉత్తమ మార్గం

ఊపిరితిత్తుల క్యాన్సర్‌లో అధిక భాగం నివారించదగినదే.ధూమపానం పూర్తిగా మానడం, ఇంట్లో పొగ తాగకుండా చూడడం, పనిస్థలాల్లో మాస్కులు ధరించడం,దుమ్ము-కాలుష్యాన్ని తగ్గించడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చు.

కుటుంబం, సమాజం కలిసి ముందుకు రావాలి

రాయలసీమలో పొగాకు వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు గ్రామస్థాయికి చేరాలి. పాఠశాలలు, కళాశాలలు, స్వచ్ఛంద సంస్థలు, వైద్య సంస్థలు కలిసి యువతలో ధూమపానం నివారణపై చైతన్యం కల్పించాలి. ప్రతి కుటుంబం “పొగాకు లేని ఇల్లు” అనే సంకల్పం తీసుకుంటే ఊపిరితిత్తుల క్యాన్సర్ భారాన్ని తగ్గించవచ్చు.

ఈ ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ ఒక నిర్ణయం తీసుకోవాలి, ధూమపానానికి దూరం, ముందస్తు పరీక్షలకు శ్రీకారం అదే ప్రాణరక్షణకు తొలి అడుగు.

## సమర్ధ వంతంగా విధులు నిర్వహించాలి.

**పుట్టపర్తి రూరల్ జూలై 31 అనంత జన శక్తి న్యూస్.**

పోలీసు వ్యవస్థలో సమర్ధవంతంగా విధులు నిర్వర్తించి ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కల్పించే వారిపై ఉక్కు పాదం మోపుతూ విధులు నిర్వర్తించాలని శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ సూచించారు.పుట్టపర్తి సబ్‌డివిజన్ నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన నిమ్మగడ్డ సత్యనారాయణ శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ శ్రీ ఎస్ సతీష్ కుమార్ ని, వారి ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేను అందజేశారు.

డి.ఎస్.పి నిమ్మగడ్డ సత్యనారాయణ మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి పుట్టపర్తి డీఎస్పీగా బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు.

పుట్టపర్తి సబ్‌డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, అసాంఘిక కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచి వాటిని కట్టడి చేసేలా సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతమైన పోలీసింగ్ అందించాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాల పట్ల రాజీ లేకుండా వ్యవహరించాలని తెలియజేశారు.





## గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సుమతి..

- పౌర హక్కుల దినోత్సవం..

**గాండ్లపెంట, జూలై,31, అనంత జనశక్తి న్యూస్:**

మండల పరిధిలోని నల్లగుట్టు తండాలో శుక్రవారం నిర్వహించిన పౌర హక్కుల పై ఎంపీడీవో రామకృష్ణ తాసిల్దార్ నరసింహులు ఎస్సై సుమతి అవగాహన కల్పించారు చట్టం దృష్టిలో అందరూ సమానమే భారత రాజ్యాంగం కల్పించిన హక్కులకు భంగం కలిపిస్తే చెట్టుపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు గ్రామలలో శాంతియుతంగా జీవనం కొనసాగించాలి సూచించారు బాలిక మహిళల పై దాడులు చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది డ్రగ్స్ కు దూరంగా ఉండాలని తెలియజేశారు ఇక్కడి గిరిజనులకు స్మశాన వాటికి రహదారి సౌకర్యం తదితరుల సమస్యలకు పరిష్కారించామని తాసిల్దార్ నరసింహులు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ ఏవో షాదాబ్ పలు అధికారులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు..

## ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

**పుట్టపర్తి, జూలై 31, అనంత జనశక్తి న్యూస్**

ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించి వారికి న్యాయం చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పుట్టపర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి ,ఆర్డీఓ సువర్ణ తో కలసి ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు.ఈ సందర్భంగా పుట్టపర్తికి చెందిన ఓ తెలుగు దేశం పార్టీ మహిళా కార్యకర్త శ్యామల మాట్లాడుతూ, 2014 లో టీడీపీ ప్రభుత్వ హయాంలో పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని బీడుపల్లి లో సర్వే నెంబర్ 115 1 బి. 132 లో తనకు 2 సెంట్లు అప్పటి మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి హయంలో ఇంటి స్థలం పట్టా మంజూరైందన్నారు. ప్ర



భుత్వం కూడా పక్కా ఇల్లు మంజూరు చేసి ఇంటి బిల్లు కూడా తన పేరున పడిందని గుర్తు చేశారు.వైసిపి ప్రభుత్వ హయాంలో అనంతరం తన స్థలాన్ని కొందరు అక్రమంగా కబ్జా చేశారని ఆమె ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి న్యాయం చేయాలని వేడుకున్నారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత జిల్లా అధికారులతో విచారణ జరిపించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.అలాగే కొత్తచెరువుకు చెందిన పలువురు ముస్లిం నేతలు ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి ,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి నీ కలిసి సయ్యద్ మస్తాన్ వలి దర్గాలో గత 30 సంవత్సరాలుగా జరిగిన అక్రమాలు, అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని వారు వినతిపత్రం సమర్పించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ, సయ్యద్ మస్తాన్ వలి దర్గాలో జరిగిన అవినీతిపై జిల్లా కలెక్టర్ లేదా ఉన్నతాధికారుల ద్వారా సమగ్ర విచారణ చేపట్టి అందుకు బాధ్యులైన వారిపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వం ద్వారా చర్యలు చేపడతామని వారికి హామీ ఇచ్చారు.ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమానికి వచ్చిన ప్రతి అర్జీని ప్రాధాన్యతతో పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడం కూటమి ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలనలో భాగమని ఆమె పేర్కొన్నారు.విద్యుత్ ,రెవిన్యూ, త్రాగునీరు, వీధిలైట్లు ,పెన్షన్లు , ఇల్లు మంజూరు చేయాలని సుమారు 10 మంది నుంచి అర్జీలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో నియోజవర్గ ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, కూటమి పార్టీల నాయకులు,కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ

- భద్రతలో నిర్లక్ష్యం వద్దు.
- పటిష్టమైన నిఘా తో 24/7 భద్రత కొనసాగించాలి.
- జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్

**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, జూలై ,31, అనంత జనశక్తి న్యూస్:**

ధర్మవరం మార్కెట్ యార్డులోని ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ శనివారం తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఈ నెలవారీ తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..... ఈవీఎంల భద్రత విషయంలో రాజీ పడకూడదని, 24/7 పటిష్టమైన నిఘా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. గోడౌన్ వద్ద భద్రతా చర్యలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిగిన పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీఓ రాంభూపాల్ రెడ్డి,ధర్మవరం తహసీల్దార్ దేవరాజు,మరియు వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



## విద్యార్ధులలో దాగి ఉన్న అంతర్గత సామర్థ్యాన్ని వెలికి తీయాలి.

-జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్–2026.

**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, జులై 31, అనంత జనశక్తి న్యూస్:**

విద్యార్థుల్లో దాగి ఉన్న అంతర్గత సామర్థ్యాలను వెలికితీసి, నేటి సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలను సైన్స్ ఇన్నోవేషన్ సృజనాత్మక ఆవిష్కరణలకు ప్రోత్సహించేందుకు జిల్లాలోని ప్రైవేటు , ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుండి ఒక సైన్స్ ఉపాధ్యాయులు ధర్మవరం కొత్తపేట మున్సిపల్ హై స్కూల్ (గర్ల్స్) పాఠశాల యందు ధర్మవరం, తాడిమర్రి, బత్తలపల్లి ,రామగిరి, కనగానపల్లి ,సికె పల్లి, కొత్తచెరువు, పుట్టపర్తి, బుక్కపట్నం మండలాల నుండి పాఠశాలకు ఒక్కరు ఉపాధ్యాయులు జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్-2026 విద్యార్థుల రిజిస్ట్రేషన్ ,సైన్స్ ఇన్నోవేషన్ ,సృజనాత్మక ఆవిష్కరణలకు సంబంధించిన అంశాలపై శిక్షణ ఆర్పీలుఅనిల్, నాగరాజులు ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు రాంప్రసాద్ , ఎన్ సి ఎస్ సి జిల్లా అకాడమీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, సైన్స్ అధ్యాపకుడు రవి శేఖర్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమం ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.



# ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు.. మన భవిష్యత్తుకు చుక్కాని భోగాపురం ఎయిర్‌పోర్ట్

- ఋషికొండ బ్లూ ఫ్లాగ్ బీచ్‌లో ఘనంగా భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవ కర్టెన్ రైజర్ కార్యక్రమం
- ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించిన రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్
- ఋషికొండ తీరంలో అలరించిన సాండ్ ఆర్ట్, సాంస్కృతిక వేడుకలు.. ఆకర్షణీయంగా నిలిచిన భోగాపురం ఎయిర్పోర్ట్ నమూనాతో రూపొందించిన సైకత శిల్పాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, సెల్ఫీ పాయింట్లు
- టూరిజం, కనెక్టివిటీతోనే లక్షలాది ఉద్యోగాలు..అభివృద్ధి బాటలో ఉత్తరాంధ్ర.. పర్యాటక శోభతో మెరిసిన ఋషికొండ: మంత్రి కందుల దుర్గేష్
- ఋషికొండ బ్లూ ఫ్లాగ్ బీచ్ పరిశుభ్రతను కాపాడడం అందరి బాధ్యత..పర్యాటక మంత్రి విజ్ఞప్తి
- చిరు వ్యాపారుల ప్రయోజనాలు కాపాడే బాధ్యత ప్రభుత్వానిదే.. మంత్రి కందుల దుర్గేష్ భరోసా
- సిగ్నేచర్ వాల్‌పై తెలుగులో సంతకం చేసిన పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



విశాఖపట్నం జూలై 31, అనంత జనశక్తి న్యూస్

భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ ముందస్తు వేడుకల్లో భాగంగా రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని ఋషికొండ బ్లూ ఫ్లాగ్ బీచ్‌లో "కర్టెన్ రైజర్" కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆగస్టు 1న (రేపు) భారత ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల చేతుల మీదుగా భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవం జరగనున్న నేపథ్యంలో.. పర్యాటక శాఖ చేపట్టిన ఈ కర్టెన్ రైజర్ కార్యక్రమం ఆహుతులను, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంది.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.."ఉత్తరాంధ్ర ప్రాంతంలో పర్యాటక రంగం అభివృద్ధితో పాటు యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించాలంటే అభివృద్ధి, రవాణా అనుసంధానత (కనెక్టివిటీ) ఎంతో అవసరం. రైలు, రోడ్డు, ఆకాశ, జల మార్గాల ద్వారా సమర్థవంతమైన కనెక్టివిటీ ఏర్పడితే పరిశ్రమలు వస్తాయి, పర్యాటక రంగం విస్తరిస్తుంది, తద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగ కల్పన జరుగుతుంది. ఈ ప్రాంతానికి అంతర్జాతీయ విమానాశ్రయం రావడం ఎంతో ఆనందదాయకం. గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టుకు "ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు" అని నామకరణం చేశారని గుర్తుచేస్తూ, ప్రజా కలలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని" మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. విమానాశ్రయ నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతన్నలకు కృతజ్ఞతలు తెలుపుతూ సైకత శిల్పంలో "థాంక్స్ ఫార్మర్స్" అని సముచితంగా పొందుపరచడం అభినందనీయం అని మంత్రి దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నమూనాను సైకత శిల్పంగా మలచడం అద్భుతంగా ఉందని కొనియాడారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పచ్చదనం, పరిశుభ్రత, పర్యాటకుల భద్రతకు పెద్దపీట వేస్తూ ఋషికొండ బీచ్ 'బ్లూ ఫ్లాగ్' గుర్తింపు పొందడం గర్వకారణం అని పేర్కొన్నారు. బీచ్‌ను నిరంతరం శుభ్రంగా ఉంచుతున్న పారిశుద్ధ్య కార్మికుల శ్రమ వల్లే ఈ గుర్తింపు కొనసాగుతోందని వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పర్యాటకులు ఎవరూ ప్లాస్టిక్ వ్యర్థాలను బీచ్‌లో పడేసి దీని ఔన్నత్యాన్ని దెబ్బతీయవద్దని, ప్లాస్టిక్ వల్ల గుర్తింపు కోల్పోతే రాష్ట్రానికే అప్రతిష్ట వస్తుందని హితవు పలికారు. ఋషికొండ బీచ్ వద్ద చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారుల ప్రయోజనాలు కాపాడే పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని మంత్రి దుర్గేష్ భరోసా ఇచ్చారు.

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు - సెల్ఫీ పాయింట్లు:**

దాదాపు 500 మంది పాల్గొన్న ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ట్రస్ట్ తరపున చిన్నారులు చేసిన అద్భుతమైన నృత్య కార్యక్రమాలను, గిరిజన నృత్య కళారూపాలను మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేకంగా అభినందించారు.సాంప్రదాయ కోలాటంతో తనకు స్వాగతం పలికిన మహిళామణులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అనంతరం "ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు.. మన ఎయిర్‌పోర్ట్ మన భవిష్యత్" పేరుతో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద, సైకత శిల్పాల వద్ద మంత్రి కందుల దుర్గేష్ ఉత్సాహంగా ఫోటోలు దిగారు. అక్కడ ఏర్పాటు చేసిన సిగ్నేచర్ వాల్‌పై తన సంతకాన్ని తెలుగులో చేశారు.అంతర్జాతీయ పర్యాటకుల రాకను పెంచేందుకు, భోగాపురం ఎయిర్‌పోర్ట్‌తో స్థానిక పర్యాటక రంగానికి ఉన్న అనుసంధానాన్ని వివరిస్తూ పర్యాటక శాఖ రూపొందించిన కార్యక్రమాలు, ఏపీ పర్యాటక విశేషాల ప్రదర్శనలు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ విజయవంతమైన కార్యక్రమాన్ని నిర్వహించిన ఉత్తరాంధ్ర టూరిజం శాఖాధికారులను మంత్రి దుర్గేష్ అభినందించారు.ఈ వేడుకలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ నాగలక్ష్మి, టూరిజం అండ్ ట్రావెల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విజయ మోహన్, హోటల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పవన్ కార్తీక్, డివిఎం జగదీష్, జనసేన పార్టీ నాయకులు సందీప్, శ్రీనివాస్ మరియు ఇతర పర్యాటక శాఖ అధికారులు, స్థానిక నాయకులు, పెద్ద ఎత్తున పర్యాటకులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో సీసీ రహదారులు, మౌలిక వసతులు కల్పించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తా..ఎమ్మెల్యే అమిలినేని



- ఐదవ రోజు ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో భైరసముద్రం గ్రామంలో స్వయంగా సమస్యలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే
- ఎన్టీఆర్ విగ్రహ కట్టకు మెరుగులు దిద్దెందుకు 50,000 అందించిన ఎమ్మెల్యే

వైసీపీ ప్రభుత్వంలో ఉన్న రహదారులకు అక్కడక్కడ పడిన చిన్నపాటి గుంతలు కూడా పుడ్చకుండా అరకొరగా ఉన్న రోడ్లు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి..నేడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉన్నా ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ తో కలసి మా ప్రాంతం చాలా వెనుకబడింది గ్రామీణ రహదారులు లేక రవాణా సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పగ తప్పకుండా మంజూరు చేస్తాను, మొదటి ప్రాధాన్యత మీ నియోజకవర్గానికే ఇస్తానని చెప్పాడని తప్పకుండా త్వరలోనే చాలా వరకు రోడ్లు మంజూరవుతాయని ఈ గ్రామంలో కూడా సీసీ రహదారులు నిర్మించి మౌలిక వసతులు కల్పించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తానని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు..నేడు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో భాగంగా ఐదవ రోజు బ్రహ్మసముద్రం మండలం భైరసముద్రం గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకులు, మండల గ్రామ స్థాయి నాయకులతో కలసి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి వివరిస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకి గ్రామస్థులు, నాయకులు పూలవర్షం కురిపించి ఘన స్వాగతం పలుకగా గ్రామంలోని తెలుగుదేశం పార్టీయా వ్యవస్థాపకుడు ల్, నటసార్వభౌముడు నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించి అన్నగారి విగ్రహం కట్టకు మెరుగులు దిద్దాలని తన స్వంత నిధులు 50,000 రూపాయలను గ్రామ టీడీపీ నాయకులకు అందజేశారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్య పాలన, కనీసం గ్రామాల్లో సరైన మౌళిక వసతుల కల్పనపై కూడా ద్రుష్టి పెట్టకుండా సమస్యలను పెంచి వెళ్లారని ఇప్పుడు వాటిని అదిగమించి గ్రామీణ రహదారులతో పాటు గ్రామాల్లో మౌళిక వసతులైన విద్యుత్, తాగునీరు, సీసీ రహదారులు నిర్మించి ప్రజల సమస్యలు లేకుండా చూస్తామని తెలిపారు. గ్రామంలో తాగునీటి ఇబ్బందులు తొలగిస్తామని, గ్రామంలో మౌళిక సదుపాయలు కల్పిస్తామని తెలిపారు..

# వైసీపీ ప్రభుత్వంలో ఉపాధ్యాయులను బ్రాంది షాపుల వద్ద ఉంచారు..




- నేడు 16,500 మంది ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేసి ప్రతి తరగతికి ఉపాధ్యాయుడిని నియమనించారు.. ఎమ్మెల్యే అమిలినేని
- నాడు బడులు మెర్జ్ చేసారు..నేడు కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారు..

కళ్యాణదుర్గం జూలై 31 అనంత జనశక్తి న్యూస్

విద్యార్థుల భవిష్యత్తుకు తోడుగా ఉండి విద్యకు ప్రాధాన్యత కల్పించి వారికి మరింత ప్రోత్సాహం అందించడం కోసం సరైన రవాణా సౌకర్యం లేక పాఠశాలలకు నడుచుకుంటూ వెళ్తున్న గ్రామీణ ప్రాంతాల 9,10 తరగతి, ఇంటర్ విద్యార్థులకు కానుకగా సైకిళ్లు అందిస్తున్నామని గత వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి మధ్యాహ్న భోజనం పేరును కూడా జగన్ పేరుపెట్టుకుని, చివరికి గుడ్డు, గరిట, జగ్గుపై బొమ్మలు వేయించుకోవడమే కాకుండా పిల్లలకు ఇచ్చే బ్యాగు, పుస్తకాలు, బెల్టు, టై పై కూడా బొమ్మలు వేసుకుని రాజకీయం చేసాడని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు.నేడు నాలుగవ రోజు గ్రామీణ విద్యార్థులకు ప్రోత్సాహక కానుకగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు అందిస్తున్న సైకిళ్ల పంపిణీ బ్రహ్మసముద్రం మండలం భైరసముద్రం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించగా టీడీపీ మండల, స్థానిక నాయకులు ఎమ్ ఈ ఓలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందంతో కలసి పాల్గొని సైకిళ్లు విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో అందజేశారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఉపాధ్యాయులను బ్రాంది షాపుల వద్ద బ్రాంది అమ్మకాల కోసం ఉపయోగించాడని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి సంతకం చేసి ఎలాంటి వివాదాలకు తావు లేకుండా 16500 మందికి ఉపాధ్యాయులను నియమించి ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా ఏర్పాటు చేయడమే కాకుండా ఉన్న పాఠశాలలను తొలగిస్తే నేడు ప్రతి పాఠశాలను కూడా కార్పొరేట్ స్థాయికి తీసుకువచ్చి ప్రభుత్వ బడుల్లో పదిలో ఉన్నత మార్కులు సాధించిన విద్యార్థుల ఫొటోలను పేపర్ లో యాడ్ ఇచ్చే స్థాయికి తీసుకువచ్చారని, అందరికి అమ్మవడి అని చెప్పి తీరా అందించే సమయానికి ఒక్క ఇంట్లో ఒక్కరికే ఇచ్చి వారి చదువులను తుంగలో తొక్కాడన్నారు.కేవలం అమ్మవడి పథకం ద్వారా కేవలం 5500 కోట్లు అందించారని,కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు తల్లిదండ్రుల బాధలు తెలుసుకుని అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంట్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్ చదివే విద్యార్థులు ఎంతమంది ఉంటే అందరికి తల్లికివందనం అందిస్తామని హామీ ఇచ్చి నేడు 10,190 కోట్లు కేటాయించి ప్రతి తల్లి ఖాతాకు జమ చేసి నిబద్ధత చాటుకున్నారని అందులో కూడా చాలీ చాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్న 30,000 మంది అంగన్వాడీ ఉపాధ్యాయులకు అందించి కూటమి ప్రభుత్వం గొప్ప మనసు చాటుకుందని తెలిపారు..అంతే కాకుండా గతంలో విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేసి ఉపాధ్యాయులను బ్రాంది షాపుల వద్ద ఉంచారని అన్నారు..ఎన్నికల ముందు గ్రామాలకు వెళ్లిన సందర్భంలో చాలా చోట్ల విద్యార్థులు పుస్తకాల బ్యాగులు మోసుకుని నడుచుకుంటూ రావడం చుసి బాధ కలిగి అనాడే అనుకున్నా విద్యార్థులకు ఏదో ఒక రాకంగా వారి ఇబ్బందులు తొలగించాలని నిర్ణయించుకున్నానని నేడు వారికి సైకిళ్లు అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు..ప్రతి విద్యార్థి భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని, వారికి అనవసరపు పనులకు కేటాయించకుండా చదువుకునేందుకు ఎక్కువ సమయం కేటాయించి వారి బంగారు భవిష్యత్తుకు బాసటగా నిలవాలన్నారు. మోడీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ దేశ విదేశాలు తిరిగి లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారని, మన ప్రాంతంలో ఎంతో మంది ఉన్నత చదువులు చదివి ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాల వెళుతున్నారని, తిమ్మసముద్రం ప్రాంతంలో ఇప్పటికే ఉన్న 1200 ఎకరాలను మరో 3000 ఎకరాలు భూమి తీసుకుని రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటు చేయబోతున్నారని తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని అంతే కాకుండా ఈ ప్రాంథంలో భూములు ధరలు పెరుగుతాయన్నారు.. బీటీపీ పనులు ఆలస్యం కావడానికి కారణం భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ఇవ్వడంలో నిర్లక్ష్యం కారణంగా ఆలస్యం అయిందని, దాదాపు 15 నెలల కాలంలో ప్రతి ఎకరాను గుర్తించి పూర్తి స్థాయిలో ప్రభుత్వానికి పంపామని త్వరలోనే వారికి పరిహారం అందిస్తామని, ముఖ్యమంత్రి ఇప్పటికే ఇరిగేషన్ క్యాలెండర్ విడుదల చేసి 2028 నాటికి బీటీపీ పూర్తిచేసేలా ప్రకటించారని తెలిపారు..

# సొంత బిడ్డల్లా చూసుకోండి

- బీసీ సంక్షేమ శాఖాధికారులతో మంత్రి సవిత

అమరావతి జూలై 31, అనంత జనశక్తి న్యూస్



వాతావరణంలో మార్పుల దృష్ట్యా బీసీ హాస్టళ్లు, గురుకులాల విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని బీసీ సంక్షేమ శాఖాధికారులను రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. వేడి చల్లార్చిన తాగునీటిని, తాజా ఆహారాన్ని మాత్రమే అందివ్వాలని ఆదేశించారు. స్వల్ప అస్వస్థత గురై గుంటూరు బీసీ హాస్టళ్లకు చెందిన ముగ్గురు విద్యార్థినులు కోలుకున్నా వారిని వైద్యులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని ఆదేశించారు. ఈ మేరకు మంత్రి సవిత... గుంటూరు జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారులను, గుంటూరు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ ను ఫోన్ లో దిశానిర్దేశం చేశారు. గుంటూరు నగరానికి చెందిన బీసీ హాస్టల్ విద్యార్థినులు ఐరన్ మాత్రలు వేసుకున్నారు. వారిలో ముగ్గురు విద్యార్థినులకు ఐరన్ ట్యాబెట్లు పడకపోవడంతో వాంతి వచ్చినట్లు, తల తిరిగినట్లు ఉండడంతో స్థానిక జీజీహెచ్ ఆసుపత్రికి బీసీ సంక్షేమ శాఖాధికారులు తరలించారు. విషయం తెలుసుకున్నవెంటనే జీజీహెచ్ ఆసుపత్రి సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ తోనూ, జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి మయూరి, ఇతర అధికారులతోనూ మంత్రి సవిత ఫోన్ లో మాట్లాడి, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. విద్యార్థినులు కోలుకున్నారని, ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలోనే ఉన్నారని వారు మంత్రికి వివరించారు. ఫుడ్ పాయిజన్ కారణంగా విద్యార్థినులెవరూ అస్వస్థతకు గురికాలేదన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, విద్యార్థినులు పూర్తిగా కోలుకునే వరకూ వైద్యుల పర్యవేక్షణలోనే ఉంచాలన్నారు. హాస్టల్ లో మిగిలిన విద్యార్థినుల గురించి అడిగి తెలుసుకుని, అవసరమైతే వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వాతావరణంలో వచ్చిన మార్పుల దృష్ట్యా మరింత అప్రమత్తంగా ఉండాలని బీసీ సంక్షేమశాధికారులకు మంత్రి సవిత దిశా నిర్దేశం చేశారు. విద్యార్థినులకు వేడి చేసి చల్లార్చిన తాగునీటిని, తాజా ఆహారాన్ని మాత్రమే అందించాలని, హాస్టల్ పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని స్పష్టంచేశారు. హాస్టల్ పరిసరాల్లో నీరు ఎక్కడ నిలబడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై అలక్ష్యం చూపితే, సహించేది లేదని, సొంత బిడ్డల్లా చూసుకోవాలని మంత్రి సవిత స్పష్టంచేశారు.

# బీసీలంటే జగన్‌కు ... మొదటి నుంచి చిన్న చూపు

- బాధితులను వదిలి.. దాడి చేసిన పరామర్శించడం దారుణం
- బడుగు, బలహీన వర్గాలను ఎప్పుడూ రాజకీయ ప్రయోజనాల కోసమే వాడుకున్నారు
- జగన్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేసిన టీడీపీ అనంతపురం నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్ ధ్వజం

అనంతపురం జూలై 31 అనంత జనశక్తి న్యూస్

వైసీపీ అధినేత జగన్ రెడ్డి రాజకీయ జీవితమంతా బీసీల పట్ల చిన్నచూపు, వివక్షతోనే సాగిందని తెలుగుదేశం పార్టీ అనంతపురం నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. మాజీ మంత్రి సిదిరి అప్పలరాజు కొడుకు చేసిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. దానిని పక్కదోవ పట్టించడానికి ప్రయత్నించిన మాజీ మంత్రి అప్పలరాజు పై పోలీసులు కేసు నమోదు చేసి జైలు పంపారని ఇందుకు జగన్ రెడ్డి వారిని పరామర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. సాధారణంగా ప్రజాప్రతినిధులు ప్రమాదాలు జరిగినప్పుడు బాధిత కుటుంబాలను పరామర్శించి వారికి అండగా నిలుస్తారని, కానీ జగన్ రెడ్డి మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను పరామర్శించకుండా, ప్రమాదానికి సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని పరామర్శించడం బాధిత కుటుంబాలను మరింత వేదనకు గురిచేసిందని విమర్శించారు. జగన్ రెడ్డికి బీసీలు అంటే మొదటి నుంచే చులకన భావమేనని, బడుగు బలహీన వర్గాలను కేవలం రాజకీయ అవసరాలకు మాత్రమే వినియోగించుకున్నారని సుధాకర్ యాదవ్ ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు కూడా బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే నిర్ణయాలు, వైఖరినే ప్రదర్శించారని అన్నారు. కోడి కత్తి కేసును ప్రస్తావిస్తూ, ఆ కేసులో బీసీ వర్గానికి చెందిన వ్యక్తి జీవితాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుని చివరకు అతనికే అన్యాయం జరిగే పరిస్థితి తీసుకొచ్చారని విమర్శించారు. ఇప్పుడు కూడా బీసీలపై ప్రేమ చూపిస్తున్నట్లు



మాట్లాడటం ప్రజలను మోసం చేసే ప్రయత్నమేనని అన్నారు. బీసీల సంక్షేమం, అభ్యున్నతి కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, కానీ జగన్ రెడ్డి మాత్రం మాటల్లో మాత్రమే బీసీ ప్రేమ చూపిస్తూ చేతల్లో పూర్తిగా భిన్నంగా వ్యవహరిస్తున్నారని సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. బీసీ సమాజం వాస్తవాలను గుర్తించి రాజకీయ మాయమాటలను నమ్మబోదని సుధాకర్ యాదవ్ స్పష్టం చేశారు.

# కమలపాడులో పౌరహక్కులపై గ్రామ సభ

యాడికి, జూలై 31, అనంత జనశక్తి న్యూస్

**మండల పరిధిలోని కమలపాడు గ్రామంలోని ఎస్ సి కాలనీలో శుక్రవారం పౌరహక్కులపై గ్రామ సభ కార్యక్రమం ను నిర్వహించారు. ముందుగా ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా తహిశీల్దార్ ప్రతాప్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు లు మాట్లాడుతూ ప్రతి పౌరునికి సమాజంలో సమానంగా జీవించేందుకు, వివక్ష నుండి రక్షణ పొందేందుకు చట్టం కల్పించిన ప్రాథమిక హక్కులు ఉన్నాయని తెలిపారు.సమానత్వం, విద్యా,స్వేచ్ఛ , వివక్షత నుండి రక్షణ,భద్రత, జీవించే హక్కు ,న్యాయపరమైన రక్షణను అందిస్తాయని తెలిపారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఆర్ ఐ కిష్టప్ప,వి ఆర్ ఓ లు , ప్రజలు పాల్గొన్నారు.**

# గిరిజన దింసా నృత్యం ప్రపంచానికి పరిచయం

- గిరిజనుల సాంస్కృతిక వారసత్వ సంప్రదాయాన్ని ప్రచారానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం

అనంతగిరి,జూలై 31, అనంత జనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్ గిరిజనుల గొప్ప సాంస్కృతిక వారసత్వమైన దింసా నృత్యాన్ని ప్రపంచ వేదికపై పరిచయం చేస్తూ కూటమి ప్రభుత్వం మరో విశిష్ట ఘట్టానికి శ్రీకారం చుట్టింది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ వేడుకల సందర్భంగా వేలాది మంది గిరిజన విద్యార్థులు, కళాకారులు సంప్రదాయ దుస్తుల్లో దింసా నృత్యాన్ని ప్రదర్శించి అందరి ప్రశంసలు అందుకున్నారు. తరతరాలుగా ఆదివాసీ సమాజం సంరక్షిస్తూ వస్తున్న దింసా నృత్యం కేవలం ఒక కళారూపమే కాదు, గిరిజనుల ఐక్యత, సంస్కృతి, జీవన విధానం మరియు సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోంది. ఈ ప్రదర్శన ద్వారా గిరిజన సంస్కృతి విశిష్టత దేశవ్యాప్తంగా మాత్రమే కాకుండా ప్రపంచ దృష్టిని కూడా ఆకర్షించింది.

గిరిజన కళలు, సంస్కృతికి ప్రాధాన్యం ఇస్తూ వాటికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ఆదివాసీ కళాకారుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు వారి సంప్రదాయాల పరిరక్షణకు దోహదపడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

"మన సంస్కృతి – మన గౌరవం, దింసా నృత్యం – ప్రపంచానికి మన గుర్తింపు" అనే భావనను చాటిచెప్పిన ఈ వేడుక గిరిజన సంస్కృతి వైభవాన్ని మరోసారి ప్రపంచానికి పరిచయం చేసిన చారిత్రక సందర్భంగా నిలిచింది.



# పెన్షన్ దారుల ఇంటి వద్దకే పెన్షన్ పంపిణీ.

**-మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, ఎంపీడీవో వెంకటేశు.**

**ధర్మవరం జులై 31, అనంత జనశక్తి న్యూస్:**



పట్టణము లోని 40 వార్డులలో గల పెన్షన్ల దారులకు ఇంటి వద్దకే పెన్షన్ పంపిణీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... పట్టణములో 17,682 మంది పెన్షన్దారులకు 7 కోట్ల 78 లక్షల 23 వేల 500 రూపాయలను పంపిణీ చేస్తామన్నారు. ఆగస్టు 1వ తేదీ సాయంత్రం లోపు పూర్తిచేసేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఒకవేళ అనానుకూలంగా పెన్షన్ తీసుకొని పెన్షన్ దారులకు ఆగస్టు మూడవ తేదీ లోపల పంపిణీ చేస్తామని తెలిపారు. పెన్షన్ దారులు సిబ్బందికి ఎటువంటి డబ్బు ఇవ్వరాదని వారు స్పష్టం చేశారు. కావున సకాలంలో పెన్షన్ తీసుకోవాలని తెలిపారు.

**మండల పరిధిలో పెన్షన్ పంపిణీ.... ఎంపీడీవో వెంకటేశులు.**

మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో గల గ్రామ ప్రజలకు ఆగస్టు ఒకటవ తేదీనే పింఛన్ పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీవో వెంకటేష్ తెలిపారు. పెన్షన్ దా రులకు ఇంటి వద్దకు సంబంధిత అధికారులు వచ్చి పెన్షన్ ఇస్తారని తెలిపారు. మొత్తం మండల పరిధిలో 6676 మంది పెన్షన్ దారులకు రెండు కోట్ల 97 లక్షల 81000 వేల రూపాయలు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇంటి వద్దకు సిబ్బంది వచ్చినప్పుడు సహకరించాలని ఎంపీడీవో తెలిపారు. ఎవరైనా లంచం అడిగిన ఇవ్వకూడదని వారు స్పష్టం చేశారు. అలా లంచం అడిగినట్లయితే మా దృష్టికి తేవాలని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని గ్రామ పెన్షన్ దారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# బుగ్గి పోసి వదిలేసిన రేగం రహదారి.

**- నిత్యం నరకయాతన పడుతున్న గ్రామస్తులు**

**అనంతగిరి జూలై 31, అనంత జనశక్తి న్యూస్**



అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం అనంతగిరి పంచాయతీ పరిధిలోని రేగం రహదారి దుస్థితిపై గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నెల రోజుల క్రితం రహదారిపై బుగ్గి (మెటీరియల్) పోసి అలాగే వదిలేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని తెలిపారు. బుగ్గి పోసిన ప్రాంతాన్ని ఇప్పటి వరకు కనీసం సరిచేయక పోవడంతో ద్విచక్ర వాహనాలు,ఆటోలు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతు న్నాయని గ్రామస్తులు వాపోయారు. ఇదే మార్గంలో నిత్యం ఉద్యోగులు, విద్యార్థులు, స్థానికులు ప్రయాణించాల్సి వస్తుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సమస్యపై పలుమార్లు కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లినా, "రేపు.. ఎల్లుండి.." అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప పనులు పూర్తి చేయడం లేదని గిరిజనులు ఆరోపించారు.ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రహదారిని సరిచేసి రాకపోకలకు అనుకూలంగా మార్చాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

# దీక్షలకు ముగింపు పోరాటానికి కాదు



**- దస్తావేజు లేఖరులు స్పష్టం...**
**- సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం కొనసాగింపు...**

**ధర్మవరం జులై 31, అనంత జనశక్తి న్యూస్ :**

"దీక్షలు విరమించాం.. కానీ ఉద్యమం మాత్రం ఆగదు" అంటూ ధర్మవరం దస్తావేజు లేఖరులు ప్రభుత్వానికి స్పష్టమైన హెచ్చరిక చేశారు. తమ వృత్తి పరిరక్షణ, ఉపాధి భద్రత, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన పది రోజుల పెన్ డౌన్, దీక్షలను శుక్రవారం ముగించారు. అయితే న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు రాజీలేని పోరాటం కొనసాగిస్తామని సంఘ నాయకులు ప్రకటించారు. గత పది రోజులుగా శాంతియుతంగా సాగిన రిలే దీక్షలకు దస్తావేజు లేఖరులు, సీనియర్ సభ్యులు, సహాయకులు పెద్ద ఎత్తున మద్దతు తెలిపారు. ప్రభుత్వ దృష్టి కి తమ సమస్యలను తీసుకెళ్లేందుకే ఈ ఉద్యమాన్ని చేపట్టామని, ఇప్పటికీ ఆశించిన స్థాయిలో స్పందన రాకపోవడం నిరాశ కలిగించిందని నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వ గుర్తింపు, వృత్తి పరిరక్షణ, ఉపాధి భద్రత, సంక్షేమ పథకాల అమలు, పెండింగ్ సమస్యల పరిష్కారం వంటి డిమాండ్ల పై ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి నిర్ణయం తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా దస్తావేజు లేఖరుల సంఘం అధ్యక్షుడు జావేద్, ఉపాధ్యక్షుడు భాస్కర్, కార్యదర్శిగా మహేంద్ర, జాయింట్ సెక్రటరీగా నాగార్జున, ట్రెజరర్‌గా మల్లికార్జున బాధ్యతలు స్వీకరించారు. సీనియర్ సభ్యులు బాలాజీ, వెంకటేష్, సుధాకర్, వాజిద్, కీర్తి, గోపి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. "హక్కుల సాధనే లక్ష్యం... సమస్యల పరిష్కారమే ఉద్యమానికి ముగింపు" అని సంఘ నాయకులు స్పష్టం చేశారు.

# శాకాంబరి అలంకారణలో కన్యకాపరమేశ్వరి

**యాడికి, జూలై 31, అనంత జనశక్తి న్యూస్ :**



మండల కేంద్రంలో ఉన్న కన్యకాపరమేశ్వరి దేవాలయం లో శుక్రవారం కన్యకాపరమేశ్వరి దేవి అమ్మ భక్తులకు శాకాంబరీ అలంకరణలో దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం సందర్భంగా కన్యకాపరమేశ్వరి దేవి మాత కు అభిషేకము చేసి, కూరగాయలతో అలంకరణ చేశారు. అర్చనలు చేసి, మహా మంగళహారతులు సమర్పించారు.భక్తులు అధిక సంఖ్యలో కన్యకాపరమేశ్వరి దేవి మాత ను దర్శించి, టెంకాయలను కానుకలను సమర్పించారు.భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గాధంశెట్టి బాలా, లయన్ పవన్,ఆర్యవైశ్య సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు

# ప్రజల సౌకర్యార్థం ముసాయిదా ఓటర్ల జాబితా

**- ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్) – 2026**
**- ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ**
**- ప్రతి పౌరుడు ముసాయిదా ఓటర్ల జాబితాలో తమ పేరు, చిరునామా, ఓటర్ వివరాలు పరిశీలించుకోవాలి.**
**- ఆర్డీవో రామ భూపాల్ రెడ్డి.**

**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, జులై 31, అనంత జనశక్తి న్యూస్:**




ప్రభుత్వ, కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్) 2026 ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించడం జరిగిందని ఆర్డిఓ రామ భూపాల్ రెడ్డి తెలిపారు. అనంతరం మాట్లాడుతూ..... ధర్మవరం అసెంబ్లీ నియోజక వర్గంలో జులై 1వ తేదీ అర్హత తేదీగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ 2026 ప్రక్రియలో భాగంగా రూపొందించిన ముసాయిదా ఓటర్ల జాబితాలు జులై 31వ తేదీన ప్రచురించడం జరిగిందని తెలిపారు., ముసాయిదా ఓటర్ల జాబితాలను సంబంధిత పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్వో), సహాయ ఎన్నికల నమోదు అధికారులు, కార్యాలయాలలో , ఇతర నిర్దేశిత ప్రదేశాలలో ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచడం జరిగింది అని తెలిపారు. అలాగే, ప్రజల సౌకర్యార్థం ముసాయిదా ఓటర్ల జాబితాలు అధికారిక ఎన్నికల పోర్టల్‌లో కూడా అందుబాటులో ఉంచబడతాయి అని తెలిపారు మే 25వ తేదీ నాటికి ఓటర్లు జులై 31వ తేదీ నాటికి ఓటర్లు తొలగించబడిన ఓటర్లు, అర్హత కలిగిన ప్రతి పౌరుడు ముసాయిదా ఓటర్ల జాబితాలో తమ పేరు, చిరునామా, ఇతర ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని వారు తెలిపారు. అర్హత ఉన్నప్పటికీ తమ పేరు ముసాయిదా ఓటర్ల జాబితాలో లేకపోయినట్లయితే లేదా ఓటరు వివరాలలో ఏవైనా తప్పులు/లోపాలు ఉన్నట్లయితే, ఎస్ ఐ ఆర్-2026 షెడ్యూల్‌లో నిర్దేశించిన గడువులో సంబంధిత బి ఎల్ వో లు, ఏ ఈ ఆర్ వో లకు క్లెయిమ్‌లు అభ్యంతరాలను సమర్పించవచ్చు అని తెలిపారు.

ప్రజలు క్రింది అంశాలకు సంబంధించి దరఖాస్తులు సమర్పించవచ్చు అని తెలిపారు.క్లెయిమ్‌లు అభ్యంతరాల దాఖలుకు సంబంధించి ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలను అందించడంతో పాటు, సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేలా సంబంధిత బి ఎల్ ఓ లకు, ఏ ఈ ఆర్ వో లకు తగిన సూచనలు జారీ చేయబడినవి తెలిపారు.అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, బూత్ లెవల్ ఏజెంట్లు , ప్రజలు ఈ సవరణ ప్రక్రియలో చురుకుగా పాల్గొని, అర్హులైన ఓటర్ల పేర్ల చేర్పు లేదా ఓటర్ల జాబితాలో ఉన్న లోపాలు/తప్పులను సంబంధిత ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ముసాయిదా ఓటర్ల జాబితాలో తమ పేరు , ఓటరు వివరాలను పరిశీలించుకుని, తమ వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని వారి స్పష్టం చేశారు.

# మహిళలకు ఉచిత వైద్య చికిత్స శిబిరం



**-రోటరీ క్లబ్ ధర్మవరం మిడిల్ టౌన్, మరియు గండికోట హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో.**

**ధర్మవరం జులై 31, అనంత జనశక్తి న్యూస్:**

చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు 2వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు స్త్రీలకు కన్సల్టెంట్ అబ్‌స్ట్రిట్రీషియాన్ అండ్ గైనకాలజిస్ట్ సంతాన సౌభాగ్యం గర్భకోశ వ్యాధులకు మరియు గర్భిణీ స్త్రీలకు ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తూ స్త్రీ సమస్యలకు పరీక్షలు నిర్వహించి సలహాలు సూచనలు ఇస్తామని అదేవిధంగా అన్ని రకాల జబ్బులకు మందులు ఉచితంగా ఇవ్వబడునని తెలిపారు. అదేవిధంగా ఉచిత వైద్య శిబిరమునందు జనరల్ ఫిజీషియన్ దయా లెటాలజిస్ట్ బిపి,షుగర్ థైరాయిడ్,విష జ్వరాలు, పురుగుల మందుకు,పాము కాటు తేలుకాటు గుండె జబ్బులు పక్షపాతం వ్యాధులకు ప్రత్యేకంగా చూడబడునని, మరియు మా హాస్పిటల్ నందు ఈ హెచ్ ఎస్ ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉన్నాయని గండికోట హాస్పిటల్ యాజమాన్యం డాక్టర్ రాజశేఖర్ రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమం ధర్మవరం గండికోట హాస్పిటల్ వారిచే, మరియు రోటరీ క్లబ్ ధర్మవరం మిడ్ టౌన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ కె.జయసింహ, సెక్రెటరీ ఎం.చంద్రశేఖర్, ట్రెజరర్ కె. పెద్దారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కె. శ్రీనివాసరెడ్డి, క్యాంపు నిర్వాహకులు సోలిగాళ్ళ వెంకటేశులు, ఎస్. ప్రసన్నకుమార్ కె. నరేంద్ర రెడ్డి కొండయ్య, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

# రాప్తాడులో ముసాయిదా ఓటరు జాబితా విడుదల



**- 28,321 మంది ఓటర్లు ఏఎస్‌డీడీ కింద గుర్తింపు**

**రాప్తాడు జులై 31 అనంత జనశక్తి న్యూస్**

రాప్తాడు మండల కేంద్రంలో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సత్వర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)2026 కార్యక్రమంలో భాగంగా 31072026 తేదీన ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించడం జరిగింది. రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 2,24,554. అందులో పురుషులు 1,12,185 మంది, మహిళలు 1,12,360 మంది, తృతీయ లింగానికి చెందిన వారు 09 మంది ఉన్నారు.రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 28,321 మంది ఓటర్లు ఏఎస్‌డీడీ కింద తొలగించినట్లు అధికారులు తెలిపారు. వీరిలో ఆచూకీ తెలియని ఓటర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఓటర్లు, మరణించిన ఓటర్లు, రెండు చోట్ల పేర్లు నమోదైన ఓటర్లు, ఇతరులు ఉన్నారు.

ఈ వివరాలపై ఎవరైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే ఆన్లైన్ కలెక్టర్ కార్యాలయం, ఈఆర్వో కార్యాలయం నందు గానీ, ఏఈఆర్ఓ కార్యాలయం నందు గాని, మరియు మీకు సంబంధిత బిఎల్ఓ ల దగ్గర క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, చెప్పవచ్చు. పనివెలలు: 31072026 తేదీ నుంచి 30082026 తేదీ వరకు దాఖలు చేసుకోవచ్చని తెలిపారు.

# ప్రజలతో మమేకమవడమే ప్రజాప్రతినిధిగా నా బాధ్యత, నా బలం

**తలుపుల జులై 3 అనంత జనశక్తి న్యూస్**

మండల పరిధిలోని పులిగుండ్లపల్లి గ్రామంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా నిర్వహించిన డోర్ టు డోర్ కార్యక్రమంలో కదిరి శాసనసభ్యుడు కందికుంట వెంకటప్రసాద్ పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా కలిసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నాను. గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించే కరపత్రాలను అందజేశారు. అనంతరం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా ఆదేశించారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా కదిరి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇదే నిబద్ధతతో ముందుకు సాగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కదిరి మాజీ శాసనసభ్యుడు ఎంఎస్ పార్థసారథి, మండల కన్వీనర్ మేడా శంకర్, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారమే నా ధ్యేయం

**- కదిరి శాసనసభ్యుడు కందికుంట వెంకట ప్రసాద్**

**తలుపుల జులై31 అనంత జనశక్తి న్యూస్**

మండలం పరిధిలోని పులిగుండ్ల పల్లి గ్రామంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొని గ్రామ ప్రజలను కలిసి వారి సమస్యలు, కష్టసుఖాలు అడిగి తెలుసుకున్న కదిరి శాసనసభ్యుడు కందికుంట వెంకటప్రసాద్. ప్రజలు సమర్పించిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సాధ్యమైనంత మేరకు అనేక సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. దీర్ఘకాలిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, త్వరితగతిన పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాను.ప్రజల గడప వద్దకే పాలనను తీసుకెళ్లడం, ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సేవలు అందించడం, ప్రతి సమస్యకు పరిష్కారం చూపించడం కూటమి ప్రభుత్వ లక్ష్యం. మీ ఆశీస్సులు, విశ్వాసంతో కదిరి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి నిరంతరం అంకితభావంతో పనిచేస్తూనే ఉంటానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కదిరి మాజీ ఎమ్మెల్యే పాత సారధి,మండల కన్వీనర్ మేడా శంకర్ వరప్రసాద్, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

**- అనంత కలెక్టర్ ఆనంద్**

**అనంతపురం, జులై 31 అనంత జనశక్తి న్యూస్**

పదవ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆకాంక్షించారు. శుక్రవారం కూడేరు మండలంలోని ఉదిరిపికొండ గ్రామంలో పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జడ్పీ పాఠశాల పీఎంశ్రీ కింద ఎంపిక కాగా, పాఠశాలలో ఏర్పాటు చేసిన ల్యాబ్ ను పరిశీలించి, చాలా బాగా ఏర్పాటు చేశారని, ల్యాబ్ బాగుందని కితాబిచ్చారు. అనంతరం అక్కడ సిసి కెమెరాలను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. తదనంతరం పదవ తరగతి విద్యార్థులతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు బాగా చదువుకోవాలని, ఈ ఏడాది పూర్తిస్థాయిలో ఉత్తీర్ణత సాధించేందుకు కష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో చక్కటి ల్యాబ్ ఉందని, మంచి టీచర్లు ఉన్నారు, బాగా కష్టపడండి, విద్యార్థులు మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. ఐ.ఎఫ్.పి ప్యానెల్ ఎలా వాడతారు, పిల్లలకి ఏ విధంగా బోధిస్తారు అనేది హెచ్ఎంతో ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ నాగరాజు, తహసీల్దార్ మోహన్ కుమార్, ఆయా శాఖల మండల అధికారులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# అధికారంలో నిర్లక్ష్యం ప్రతిపక్షంలో పాదయాత్రలు

- ప్రకాష్ రెడ్డిపై టిడిపి నేతల విమర్శలు

రాప్తాడు జులై 31 అనంత జనశక్తి న్యూస్

హంద్రీనీవా కాలువల పేరుతో మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి చేపట్టిన పాదయాత్ర పూర్తిగా రాజకీయ స్టంట్ మాత్రమేనని తెలుగుదేశం పార్టీ హిందూపురం పార్లమెంటు అధికార ప్రతినిధి పాలచర్ల ముత్యాలప్ప విమర్శించారు.

రైతులపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే అధికారంలో ఉన్న సమయంలో హంద్రీనీవా కాలువల పనులను ఎందుకు పూర్తి చేయలేదో, రైతుల బోర్లలో నీరు అందేలా ఎందుకు చర్యలు తీసుకోలేదో ముందుగా ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఏళ్ల తరబడి కాలువల పనులను నిర్లక్ష్యం చేసి, ఇప్పుడు అదే అంశంపై ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రస్తుతం రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత చొరవతో హంద్రీనీవా కాలువల మరమ్మతులు, అభివృద్ధి పనులు వేగంగా జరుగుతుండటంతో ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకే ప్రకాష్ రెడ్డి అసత్య ప్రచారాలకు దిగుతున్నారని ఆరోపించారు.

అధికారంలో ఉన్నప్పుడు రైతుల గోడు వినిపించని నాయకులు, ఇప్పుడు పాదయాత్రల పేరుతో రైతుల కన్నీళ్లపై రాజకీయాలు చేయడం ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. రైతుల సమస్యలపై చిత్తశుద్ధితో కాకుండా రాజకీయ లబ్ధి కోసం మాట్లాడితే ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు.

ప్రజలకు వాస్తవాలు తెలుసని, ఎవరి పాలనలో హంద్రీనీవా పనులు నిలిచిపోయాయో, ఎవరి హయాంలో మళ్లీ పనులు ప్రారంభమయ్యాయో అన్నది ప్రజలే అంచనా వేసుకుంటున్నారని తెలిపారు. అసత్య ప్రచారాలు, నిరాధార ఆరోపణలు మానుకుని అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని ప్రకాష్ రెడ్డికి హితవు పలికారు.రైతుల పేరుతో రాజకీయాలు కాదు రైతులకు శాశ్వత పరిష్కారమే మా ప్రభుత్వ లక్ష్యం అని టిడిపి నాయకులు స్పష్టం చేశారు.



# అనంత జనశక్తి కథనానికి స్పందన



లేపాక్షి,జులై 31 అనంత జనశక్తి న్యూస్,

రోడ్డు భద్రత పాటించని కంకర లారీలు, గాలి వస్తే జనాల కళ్లల్లో లో దుమ్ము, ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టించుకోని అధికారులు అనే వార్తా కథనం అనంత జనశక్తి దినపత్రికలో ప్రచురితమైంది. ప్రజలు, వాహనదారుల భద్రత దృష్టిలో ఉంచుకొనిరోడ్ ప్రమాదాల నివారణకి ప్రత్యేక రూరల్ సీఐ జనార్దన్ ఆధ్వర్యంలోతనిఖీలు నిర్వహించారు .ఈ తనిఖీలలో లోడుతో ప్రయాణిస్తున్న టిప్పర్ వాహనాలు , కంకర ధూళి రవాణా చేసే వాహనాలు తప్పనిసరిగా టార్పలిన్ ఏర్పాటు చేసుకోవాలని హెచ్చరించారు. నిబంధన ఉల్లంగించిన ప్రతి వాహనంపై మోటార్ వాహనాలు చట్టం ప్రకారం 2035 రూపాయలు చొప్పన జరిమానా విధించారు . అదేవిధంగా టిప్పర్ డ్రైవర్లు యజమానులకు వాహనాలు లోడ్ తరలించిన సమయంలో తప్పనిసరిగా బాడీ కవర్లు ఉపయోగించాలని , నిర్దేశిత వేగ పరిమితులను కచ్చితంగా పాటించాలని ట్రాఫిక్ నిబంధనలను గౌరవిస్తూ ప్రజల ప్రాణాలకు ఎటువంటి ప్రమాదం కలవకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పోలీసులు వారికి సూచించారు. నిబంధన ఉల్లంగించే వారిపై చట్టపరమైన చర్య తీసుకుంటామని సిఐ హెచ్చరించారు.


అనంత జనశక్తి శుక్రవారం। 17.07.2026

రోడ్డు భద్రత పాటించని
కంకర లారీలు

-గాలి వస్తే జనాల కళ్ళల్లో దుమ్ము
- నిద్రమత్తులో అధికారులు

లేపాక్షి ,జులై 16, అనంత జనశక్తి న్యూస్:

రహదారిపై ప్రతిరోజూ దాదాపు వందల కొద్ది లారీలు కంకర పొడి, ఎరువు, రాయి రవాణా చేస్తుంటారు. కానీ రోడ్డు భద్రత నియమంపాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కంకర పొడి లారీ వెళ్లేటప్పుడు ఎగసి పడి కంకర ధూళి దేవాలయానికి వెళ్లే యాత్రికులు, పాదచారులు ద్విచక్ర వాహదారుల కళ్ళల్లో పడి ఇబ్బందులు పడుతున్నారు. అలాగే లారీలోని కంకర పక్కన వాహనదారులపై పడి ప్రమాదాలు జరుగుతాయి. ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో ప్రయాణిస్తున్న వారు ఇబ్బందులు పడుతున్నారు. నిబంధనల ప్రకారం లారీలో ఇసుక కంకర పొడి, ఎరువు రవాణా చేసేటప్పుడు లారీ పై భాగాన్ని తప్పనిసరిగా టార్పలిన్ కవర్లతో కప్పాలన్న నిబంధనలను పాటించకుండా ఇష్టానుసారంగా నిర్లక్ష్యంగా రవాణా చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కంకర రవాణా చేసే లారీలపై చర్యలు తీసుకోవాలి యాత్రికులు ప్రజలు కోరుతున్నారు.

# ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం గడువు ఆగస్టు 15 వరకు పెంపు

- రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్

పుట్టపర్తి, జూలై 31:అనంత జనశక్తి న్యూస్

జిల్లా రైతు శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద ఎన్రోల్మెంట్ కి గడువు ఆగస్టు 15 వరకు పొడిగించబడినదిని, రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్రీ శాంప్రసాద్ తెలిపారు. ఈ పథకం కింద ముఖ్యంగా కంది మొక్కజొన్న ఆముదము రాగి మరియు వరి పంటలు ఉన్నాయని కంది పంటకు ఎకరానికి 102 రూపాయలు, మొక్కజొన్న పంటకు ఎకరానికి 165 రూపాయలు, ఆముదం పంటకు ఎకరానికి 100 రూపాయలు, రాగి పంటకు ఎకరానికి 100 రూపాయలు అలాగే వరి పంటకు ఎకరానికి 200 రూపాయలు ప్రీమియం చెల్లించి వెంటనే రైతులు పంటల బీమా పథకంలో ఆగస్టు 15వ తేదీ లోపల ఎన్రోల్ చేసుకోవాలన్నారు. అదేవిధంగా జిల్లా రైతాంగ శ్రేయస్సుని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వారు ఫ్రీ హోల్డ్ లో ఉన్న అసైన్డ్ ల్యాండ్స్ కూడా ఇన్సూరెన్స్లో అవకాశం కల్పించారు. ఇప్పటివరకు ఇన్సూరెన్స్ చేసుకొని ఫ్రీ హోల్డ్ లో అసైన్డ్ లాండ్స్ ఉన్న రైతులందరూ కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పంటలను ఇన్సూరెన్స్లో నమోదు చేసుకోవాలని కోరారు . వ్యవసాయ శాఖ వారు రైతులందరికీ అవగాహన కల్పించి అర్హత ఉన్న అందరు రైతులు పంటల బీమా కట్టుకునేటట్లు అవగాహన కల్పించాలన్నారు.ఇప్పటివరకు జిల్లాలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద 21 868 హెక్టార్లు వాతావరణ ఆధారిత బీమా పథకం కింద 106023 హెక్టార్లు నమోదు చేయించుకోవడం జరిగిందన్నారు.



# 22ఎ నిషేధిత జాబితా భూముల పరిష్కార బాధ్యత ఇక ఆర్డీఓలకే

- రెండు వారాల్లో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం
- గ్రామాల్లో విస్తృత ప్రచారం ప్రజల ఏళ్ల నాటి సమస్యలకు చెక్
- జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పుట్టపర్తి జూలై 31:అనంత జనశక్తి న్యూస్

ప్రజల ఏళ్ల నాటి భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు, భూగర్భ జలాల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో రెవెన్యూ, సర్వే అధికారులకు జారీ చేసిన ముఖ్యమైన ఆదేశాలు. గతంలో 22ఎ నిషేధిత జాబితా భూముల తొలగింపు ప్రతిపాదనల ప్రక్రియ కలెక్టర్ల వద్ద ఉండగా, ప్రస్తుతం ఆ బాధ్యతలను ఆర్డీవో లకు అప్పగించారు.రెవెన్యూ కార్యాలయాల్లో పెండింగ్లో ఉన్న 22ఎ సంబంధిత ఫైళ్లన్నింటినీ రాబోయే రెండు వారాల్లోగా పూర్తిగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఈ ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు గ్రామ స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలి.భూగర్భ జల శాఖ నుంచి ముందస్తు అనుమతి పొందితేనే కొత్త బోర్వెల్స్కు అనుమతులు ఇస్తారు.నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా బోర్లు వేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్లకు హెచ్చరిక జారీ చేశారు. గ్రామాల్లో జరిగే భూ రీసర్వే ఎటువంటి తప్పులు లేకుండా నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేయాలి. సర్వే బృందాల పనితీరును పెంచేందుకు జిల్లా యంత్రాంగం తరపున ప్రత్యేక వర్క్షాప్లు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తారు.సర్వే పూర్తయిన వెంటనే అర్హులైన రైతులకు తప్పుల్లేని డిజిటల్ పట్టాదార్ పాస్ పుస్తకాలను పంపిణీ చేయనున్నారు.



# రైతులందరికీ శుభవార్త..

- ఖరీఫ్ పంటల బీమా నమోదు గడువు ఆగస్టు 15 వరకు పొడిగింపు: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

అమరావతి, జూలై 31:అనంత జనశక్తి న్యూస్

ఖరీఫ్2026 సీజన్కు సంబంధించి పంట దిగుబడి ఆధారిత ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (PMFBY) కింద వరి పంట మినహా మిగిలిన అన్ని నోటిఫై చేసిన ఖరీఫ్ పంటలకు పంటల బీమా నమోదు (ప్రీమియం చెల్లింపు) గడువు ఈరోజు జూలై 31తో ముగియాల్సి ఉండగా, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఆగస్టు 15 వరకు మరో 15 రోజులపాటు పొడిగించినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన PMFBY నోటిఫికేషన్ ప్రకారం వరి మినహా అన్ని పంటలకు జూలై 31 వరకు, వరి పంటకు ఆగస్టు 15 వరకు బీమా నమోదు గడువు నిర్ణయించబడగా, రాష్ట్రంలో నెలకొన్న ఎల్నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, బీమా సంస్థలతో విస్తృతంగా చర్చించి, వరి మినహా మిగిలిన అన్ని ఖరీఫ్ పంటలకు కూడా గడువును ఆగస్టు 15 వరకు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసిందన్నారు.రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తికి కేంద్ర ప్రభుత్వం, బీమా సంస్థలు సానుకూలంగా స్పందించి, PMFBY కింద నోటిఫై చేసిన వరి మినహా అన్ని ఖరీఫ్ పంటలకు పంటల బీమా నమోదు గడువును జూలై 31 నుంచి ఆగస్టు 15 వరకు పొడిగించడం రైతులకు ఎంతో ఊరటనిచ్చే నిర్ణయమని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. మంత్రి మాట్లాడుతూ, ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావం, ఇతర అనుకోని పరిస్థితుల వల్ల రైతులకు కలిగే పంట నష్టాలకు ఆర్థిక రక్షణ కల్పించడంలో పంటల బీమా కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. అందువల్ల రుణగ్రహీత, రుణేతర రైతులు అనే తేడా లేకుండా అర్హులైన ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పంటల బీమాలో నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.సాగు చేసిన ప్రతి ఎకరానికి పంటల బీమా నమోదు చేయించుకుని భవిష్యత్తులో ఎలాంటి నష్టం జరిగినా రక్షణ పొందాలని సూచించారు. రైతులు సంబంధిత బ్యాంకులు, కామన్ సర్వీస్ సెంటర్లు (CSCలు), రైతు సేవా కేంద్రాలు,NCIP మొబైల్ యాప్ ద్వారా స్వయంగా లేదా వ్యవసాయ శాఖ అధికారుల సహాయంతో ఆగస్టు 15లోగా పంటల బీమా నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు.రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతుల ప్రయోజనాలకు సంబంధించిన ప్రతి అంశంలో కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన నిర్ణయాలు తీసుకుంటున్నామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. చివరి తేదీ వరకు వేచి ఉండకుండా, పోర్టల్పై చివరి రోజులలో ఏర్పడే రద్దీని నివారించేందుకు వీలైనంత త్వరగా పంటల బీమా నమోదు పూర్తి చేసుకోవాలని రైతులకు మంత్రి విజ్ఞప్తి చేశారు.



# ఆన్లైన్ బెట్టింగ్ వ్యామోహం..



- బామ్మను హత్య చేసిన మనవడు అరెస్ట్
- కళ్యాణదుర్గం పోలీసులు కేసు ఛేదన.. 2.6 తులాల బంగారు ఆభరణాల స్వాధీనం

అనంతపురం, జూలై 31:అనంత జనశక్తి న్యూస్

ఆన్లైన్ బెట్టింగ్ వ్యసనంతో అప్పులపాలైన ఓ యువకుడు, అప్పులు తీర్చుకునేందుకు వరుసకు బామ్మ అయ్యే వృద్ధురాలిని హత్య చేసి ఆమె బంగారు ఆభరణాలు దోచుకున్న కేసును కళ్యాణదుర్గం పోలీసులు ఛేదించారు. నిందితుడు ఈడిగొట్టు రఘు (24)ను అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 2.6 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.డీఎస్పీ పి. రవిబాబు తెలిపిన వివరాల ప్రకారం, కళ్యాణదుర్గం వడ్డే కాలనీకి చెందిన రఘు ఆన్లైన్ బెట్టింగ్లో డబ్బులు కోల్పోయి అప్పులపాలయ్యాడు.దీంతో జూన్ 30న ఇంట్లో ఒంటరిగా ఉన్న వరుసకు బామ్మ ఈడిగొట్టు లక్ష్మీదేవిని స్టీల్ రోలుతో తలపై మోది, స్టీల్ కడ్డీతో గొంతుపై పొడిచి హత్య చేసి, ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు తీసుకుని పరారయ్యాడు. జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు డీఎస్పీ రవిబాబు పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టి, శుక్రవారం కళ్యాణదుర్గం హిందూపురం రోడ్డులోని కొల్లాపురమ్మ ఆలయం సమీపంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నాయి. అతని వద్ద నుంచి బంగారు చైన్, పూసల దండ, చెవి కమ్మలు, ముక్కు పుడకతో కలిపి 2.6 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని రిమాండ్కు తరలించారు.కేసును స్వల్ప వ్యవధిలోనే ఛేదించిన సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ పి. జగదీష్ అభినందించారు.

# జిల్లా వ్యాప్తంగా పౌర హక్కుల దినోత్సవం నిర్వహణ



చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ప్రజలకు సూచించిన అధికారులు

అనంతపురం, జూలై 31:అనంత జనశక్తి న్యూస్

జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం 'పౌర హక్కుల దినోత్సవం' (సివిల్ రైట్స్ డే) సందర్భంగా పోలీసులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు.ప్రతి నెల చివరి రోజున నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా అధికారులు గ్రామాలను సందర్శించి పౌర హక్కులు, రాజ్యాంగం కల్పించిన హక్కులు, రక్షణ చట్టాలు, సామాజిక సమానత్వంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అంటరానితనం, కుల వివక్షను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.పోలీస్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో గ్రామస్థుల సమస్యలను తెలుసుకుంటూ సౌభ్రాతృత్వ వాతావరణాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నాయని అధికారులు తెలిపారు. వివక్షలేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో స్థానిక అధికారులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# విద్యార్థుల భద్రతపై పోలీసుల ప్రత్యేక అవగాహన



- ఈవ్టీజింగ్, సైబర్ నేరాలు, మైనర్ డ్రైవింగ్పై హెచ్చరిక

అనంతపురం, జూలై 31:అనంత జనశక్తి న్యూస్

జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో శుక్రవారం పోలీసు అధికారులు విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించారు. మహిళల భద్రత, సైబర్ నేరాలు, పోక్సో చట్టం, రోడ్డు భద్రత, మైనర్ డ్రైవింగ్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.మహిళలు, చిన్నారులపై వేధింపులు, ఈవ్టీజింగ్ వంటి ఘటనలు ఎదురైతే వెంటనే 100 లేదా 112కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్ మోసాల నుంచి అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలు, బ్యాంకు వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. సైబర్ మోసాలకు గురైతే 1930 హెల్ప్లైన్కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.18 ఏళ్లలోపు వారు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం తప్పనిసరి అని సూచించారు.విద్యార్థులు మత్తు పదార్థాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని పోలీసులు పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో స్థానిక సీఐలు, ఎస్ఐలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఆడవారి ప్రైవేట్ భాగాల్లో వచ్చే దురదని తగ్గించే చిట్కా, ఇంట్లోని పదార్థాలతోనే ప్రాబ్లమ్ సాల్వ్

మహిళలు వెజైనా ప్రాంతంలో దురద, చికాకు వంటి సమస్యలను ఎక్కువగా ఎదుర్కొంటూ ఉంటారు. ఏదో ఒక సమయంలో ప్రతి మహిళలు.. యోని ప్రాంతంలో చికాకు, దురదను అనుభవిస్తూ ఉంటారు. నలుగురిలో ఉంటే.. ఇంకా చికాకుగా ఉంటుంది. వెజైనా దగ్గర దురద, మంట అంటే అత్యంత సాధారణమైన కారణం వెజైనల్ఇన్ఫెక్షన్. ఇది ఫంగస్‌వల్ల కానీ ట్రైకోమోనాస్‌వల్ల కానీ లేదా బ్యాక్టీరియా వల్ల కానీ వస్తుండచ్చు. లేదా ఒక్కోసారి డెర్మటైటిస్‌వంటి చర్మ వ్యాధులు, అలర్జీలు కూడా ఇందుకు కారణం కావచ్చు. పీరియడ్‌స్‌టైమ్‌లో ఉపయోగించే.. కెమికల్స్‌తో కూడిన శానిటరీ ఫ్యాడ్‌ల వల్ల కూడా చికాకు సంభవించవచ్చు. కొన్ని హోంరెమిడీస్‌తో వెజైన ప్రాంతంలో చికాకు, దురదను తగ్గించుకోవచ్చు.









**యాపిల్ సైడర్ వెనిగర్ వాడండి చూడండి**

ఆపిల్ సైడర్ వెనిగర్‌లో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు ఉంటాయి. ఇవి బాక్టీరియల్, ఫంగల్ ఇన్ఫెక్షన్ వల్ల కలిగే చికాకును పూర్తిగా దూరం చేస్తాయి. ఒక గ్లాస్ గోరు వెచ్చని నీళ్లలో రెండు చెంచాల యాపిల్‌సైడర్‌వెనిగర్‌వేసి.. మీ యోని ప్రాంతాన్ని శుభ్రం చేసుకోండి. వెజైనా.. ఎసిడిక్‌గా మారుతుంది.. దీంతో బ్యాక్టీరియా దూరం అవుతుంది.

**కోల్డ్ కంప్రెస్ హెల్ప్‌అవుతుంది**

రాత్రిపూట వెజైనా చికాకు ఎక్కువగా ఉంటుంది.. దీంతో మీ నిద్రకు కూడా భంగం కలిగే అవకాశం ఉంది. మీ వెజైనా ఏరియాలో కోల్డ్‌కంప్రెస్‌ఉంచండి.. ఇంది చికాకు, దురద నుంచి ఉపశమనం ఇస్తుంది.

**ఉప్ప నీళ్లతో శుభ్రం చేసుకోండి**

ఉప్ప బ్యాక్టీరియాను చంపుతుంది.. దురద చికాకును దూరం చేస్తుంది. మీరు వెజైనా దురద కారణంగా బాధపడుతుంటే.. ఉప్ప నీళ్లతో మీ యోని ప్రాంతాన్ని శుభ్రం చేసుకోండి. ఇది వెజైనా చికాకు నుంచి త్వరాగా ఉపశమనం కలిగిస్తుంది. బ్యాక్టీరియా పెరిగే అవకాశాన్ని తగ్గిస్తుంది.

**వెల్లుల్లి పేస్ట్ మంచిది**

వెల్లుల్లిలో యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉన్నాయి, ఇవి యోని చికాకు, దురద నుంచి ఉపశమనం ఇస్తాయి. వెల్లుల్లిని పేస్‌ట్‌గా తయారు చేసి.. మీ వెజైనా ఏరియాకు అప్లై చేయండి.

**పెరుగు వాడండి**

పెరుగులో యాక్టివ్‌కల్చర్‌ఉంటుంది. దీనిలో మంచి బ్యాక్టీరియా.. చెడు బ్యాక్టీరియాను తొలగిస్తాయి. రోజూ ఒక కప్ప పెరుగును మీ డైట్‌లో తీసుకోండి. మీ యోని ప్రాంతంలో కూడా.. పెరుగును అప్లై చేసినా మంచి రిజల్ట్స్ ఉంటాయి.

# ఎంత ట్రై చేసినా బరువు తగ్గట్లేదా? ఎలాంటి తప్పులు చేస్తున్నారో చెక్ చెసుకోండి





బరువు తగ్గాలని చాలా మంది అనుకుంటారు. కానీ, కొంతమంది మాత్రమే ఆ టార్గెట్ రీచ్ అవుతూ ఉంటారు. మరికొందరికి కఠినమైన డైట్స్ పాటించినా, జిమ్‌లో గంటల తరబడి కష్టపడినా ఫలితం కనిపించదు. దీనికి పెద్దపెద్ద కారణాలే ఉండనవసరం లేదు, మనం నిర్లక్ష్యం చేసే చిన్న చిన్న అలవాట్లే వెయిట్ లాస్ జర్నీకి అడ్డుగా మారతాయి. ఈ అలవాట్లు మెటబాలిజాన్ని మందగించడమే కాకుండా శరీరంలో కొవ్వును నిల్వ చేస్తాయి, మనకు రోజంతా ఆకలిగా అనిపించేలా చేస్తాయి. మీరు ఎంత ప్రయత్నించినా బరువు తగ్గకపోతుంటే.. మొదట ఈ తప్పలను తెలుసుకుని వాటిని మానుకుంటే మంచిది. దీంతో మీరు కేవలం బరువు తగ్గడమే కాదు.. శక్తి స్థాయులు పెరుగుతాయి, దీర్ఘకాలిక అనారోగ్యాల ముప్ప దూరం అవుతుంది.

**మీ ఆహారంలో ప్రోటీన్ లేకపోవడం**

బరువు తగ్గడంలో ప్రోటీన్ కీలక పాత్ర పోషిస్తుంది. ప్రోటీన్ ఎక్కువసేపు మీ కడుపు నిండుగా ఉండేలా చేస్తుంది, ఆకలిని కంట్రోల్‌లో ఉంచుతుంది. క్యాలరీ ఇన్‌టేక్‌ను పరిమితం చేస్తునే లీన్ కండర ద్రవ్యరాశిని రక్షిస్తుంది. మీ ఆహారంలో ప్రొటీన్ సమృద్ధిగా తీసుకుంటే శరీర జీవక్రియ రేటు పెరుగుతుంది, బరువు పెరగకుండా కంట్రోల్‌లో ఉంటుంది. అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్ ప్రకారం, మన ఆహారంలో తగినంత ప్రొటీన్ తీసుకుంటే కొవ్వు త్వరగా కరుగుతుంది. మీ ఆహారంలో గుడ్లు, చేపలు, పాల ఉత్పత్తులు, చిక్కుళ్లు వంటి ఆహార పదార్థాలను తీసుకోండి.





**ఫైబర్ తక్కువగా తింటున్నారా?**

జీర్ణక్రియను మెరుగుపరచడానికి, ఆకలిని తగ్గించడానికి ఫైబర్ చాలా అవసరం. ఫైబర్ తక్కువగా తీసుకుంటే మీ వెయిట్ లాస్ జర్నీని లేట్ చేస్తాయి. అంతేకాదు పేగు ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. మీ ఆహారంలో తృణధాన్యాలు, అవిసె గింజలు, సబ్జా గింజలు, గుమ్మడికాయ గింజలు, మెంతులు, వేరుశనగలు, పొద్దుతిరుగుడు విత్తనాలు, బీన్స్, బఠానీలు, అవకాడో, పండ్లు చేర్చుకోండి.

**బ్రేక్‌ఫాస్ట్ స్కిప్ చేస్తున్నారా?**

చాలామంది తిండి మానేస్తే.. బరువు తగ్గుతాం అనే అపోహలో ఉంటారు. దీంతో బ్రేక్‌ఫాస్ట్ మానేస్తూ ఉంటారు. అయితే ఇది మంచి ఆలోచన కాదని నిపుణులు అంటున్నారు. ఉదయం పూట టిఫిన్ మానస్తే ఆ తర్వాత ఆకలి పెరుగుతుంది, రోజంతా ఆకలిగా అనిపిస్తుంది కడుపు మాడితే, ఏది పడితే అది నోటిలోకి వెళ్లిపోతుంది. మీరు బరువు తగ్గాలనుకుంటే ప్రొటీన్, ఫైబర్‌తో కూడిన సమత్యల ఆహారం తీసుకోండి.

**బ్లడ్ షుగర్‌స్‌ను కంట్రోల్‌లో ఉంచుకోకపోతే**

రక్తంలో చక్కెర స్థాయిలు అస్థిరంగా ఉండటం వల్ల బరువు తగ్గడం కష్టమవుతుంది. బ్లడ్ షుగర్స్ ఎక్కువగా ఉంటే ఆకలి ఎక్కువగా వేస్తుంది, అతిగా తింటారు, శరీరంలో కొవ్వు నిల్వలు పెరుగుతాయి. కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్స్, ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, సమతుల్య ఆహారం తీసుకుంటే బ్లడ్ షుగర్స్ కంట్రోల్‌లో ఉంటాయి.

**తగినంత నిద్ర లేకపోయినా**

నిద్రసరిగ్గా లేకపోయినా.. మీరు బరువు తగ్గడం కష్టం అవుతుంది. నిద్ర సరిగ్గా లేకపోతే.. ఆకలి, సంతృప్తిని నియంత్రింతే హార్మోన్లకు అంతరాయం కలిగిస్తుంది. దీంతో ఆకలి పెరుగుతుంది, జీవక్రియను నెమ్మదిస్తుంది. మీరు త్వరగా బరువు తగ్గాలంటే.. 7-9 గంటలు ప్రశాంతంగా నిద్రపోండి.

**వ్యాయామం తక్కువ చేసినా, అతిగా చేసినా కూడా**

వ్యాయామం అవసరమే కానీ మితిమీరి చేసినా, అసలు చేయకపోయినా కూడా ప్రతికూల ఫలితాలు వస్తాయి. వ్యాయామం చేయకపోతే.. కండరాల నష్టం జరుగుతుంది, జీవక్రియ తగ్గుతుంది.. దీంతో బరువు పెరుగుతారు. అతిగా వ్యాయామం చేసినా... ఒత్తిడి, అలసట కారణంగా బరువు పెరుగుతారు. కార్డియో, స్ట్రెంథ్ ట్రైనింగ్ వంటి వ్యాయామాలు కచ్చితంగా మీ డైలీ రొటీన్‌లో చేర్చుకోండి.



# 2029లో వైసీపీదే అధికారం భారీ మెజారిటీతో గెలుస్తాం



(మొదటిపేజీ తరువాయి)

అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విధానంలో ఎలాంటి మార్పు ఉండదని అన్నారు. పరిస్థితులకు అనుగుణంగా మారే నాయకుడు కాదని, తన సిద్ధాంతాలకు కట్టుబడి ఉండే నాయకుడేనని జగన్‌ను అభివర్ణించారు.

చంద్రబాబు నాయుడు రాజకీయాలు అధికారం కోసం ఉంటే, వైసీపీ రాజకీయాలు ప్రజల కోసం ఉంటాయని సజ్జల వ్యాఖ్యానించారు. ఒకప్పుడు కొన్ని వర్గాలు మీడియాను ఉపయోగించి ప్రజల్లో భ్రమలు సృష్టించాయని, ప్రస్తుతం సోషల్ మీడియా ప్రజలతో నేరుగా మమేకమయ్యే అత్యంత ప్రభావవంతమైన వేదికగా మారిందని చెప్పారు. అయితే, 2029 అసెంబ్లీ ఎన్నికల్లో గతం కంటే మరింత భారీ మెజారిటీతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందనే పూర్తి నమ్మకం తమకు ఉందని సజ్జల తెలిపారు. పార్టీ కార్యకర్తల త్యాగాలు, కష్టాల వల్లే వైసీపీ ఈ స్థాయిలో నిలబడగలిగిందని కొనియాడారు. ఎన్ని సవాళ్లు ఎదురైనా జగన్ ముందుండి నాయకత్వం వహిస్తున్నారని అన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని వెల్లడించిన సజ్జల, ఒక్క పంచాయతీని కూడా పోటీ లేకుండా వదిలే పరిస్థితి ఉండదని జగన్ స్పష్టం చేశారని గుర్తు చేశారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగితే వైసీపీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల జగన్ పర్యటనలకు ప్రజల నుంచి లభిస్తున్న విశేష స్పందనే రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందనే విషయాన్ని నిరూపిస్తోందని పేర్కొన్నారు. పేదలకు ఉపయోగపడని రాజకీయాలకు జగన్ ఎప్పుడూ ప్రాధాన్యం ఇవ్వరని సజ్జల అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం భారీ పరిశ్రమలు, పోర్టులు, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని, కేవలం పైపై కనిపించే అభివృద్ధి (కాస్మెటిక్ డెవలప్‌మెంట్) వల్ల ప్రజలకు ప్రయోజనం ఉండదని అభిప్రాయపడ్డారు.

సోషల్ మీడియా కార్యకర్తలకు ప్రత్యేక సూచనలు చేసిన సజ్జల, వైఎస్ జగన్ చెప్పే అంశాలను చిన్న చిన్న వీడియోలు, క్యాప్సూల్స్ రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి సోషల్ మీడియా కార్యకర్త పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు చేర్చే ప్రచారకుడిగా పనిచేయాలని కోరారు. అసభ్య పోస్టులు, వ్యక్తిగత దూషణలు, అనుచిత వ్యాఖ్యలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. పార్టీ కమ్యూనికేషన్ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించుకుని ప్రతి నియోజకవర్గంలో సోషల్ మీడియా బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి..

# ఫార్ములా ఈకార్ కేసులో నాంపల్లి కోర్టుకు కేటీఆర్

(మొదటిపేజీ తరువాయి)

ఈ కేసులో ఏ2గా ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బి.ఎల్.ఎన్.రెడ్డిలతో కలిసి ఏ1 నిందితుడిగా ఉన్న కేటీఆర్ నాంపల్లి ఏసీబీ కోర్టులో ప్రత్యక్షం అయ్యారు. కేటీఆర్‌కు మద్దతుగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, సీనియర్ నాయకుడు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌లతో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు కోర్టు ఆవరణకు తరలివచ్చారు. బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలిరావడంతో నాంపల్లి కోర్టు పరిసర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి.. కొంతసేపు ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది.

రూ.55 కోట్ల నిధుల దుర్వినియోగం ఆరోపణలు

ఫార్ములాఈ రేసు నిర్వహణలో హెచ్ఎమ్‌డీఏ నిధులను అక్రమంగా వాడారని ఏసీబీ ప్రధానంగా అభియోగం మోపింది. ఫార్ములాఈ రేస్, రేసింగ్ ట్రాక్ నిర్మాణం, ఇతర అనుబంధ ఏర్పాట్ల పేరిట



హెచ్ఎమ్‌డీఏ ఖజానా నుంచి రూ.55 కోట్లకు పైగా నిధులను వెచ్చించారని తెలిపింది. ఎలాంటి అధికారిక రికార్డులు పాటించకుండా ఈ ఖర్చులు చేయడం ద్వారా ఆడిట్ తనిఖీల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశారని ఏసీబీ పేర్కొంది. మూడు సీజన్లకు వర్తించే వ్యయాన్ని ఒకే ఒక్క రేసుకు చేసిన ఖర్చుగా చూపించి.. రాష్ట్ర మంత్రివర్గ ఆమోదం తీసుకోకుండా నిబంధనలను పక్కనబెట్టారని పేర్కొంది.

**నిధుల దుర్వినియోగంతో రూ.8.06 కోట్ల అదనపు భారం**

విదేశీ సంస్థలకు నిధుల బదిలీ విషయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలను, దేశీయ పన్ను విధానాలను ఉల్లంఘించారని ఏసీబీ దర్యాప్తులో తేల్చింది. ఈ చెల్లింపుల ప్రక్రియలో జరిగిన అక్రమాల కారణంగా ప్రభుత్వ ఖజానాపై రూ.8.06 కోట్ల మేర అదనపు పన్నుల భారం పడిందని స్పష్టం చేసింది. కేటీఆర్, అర్వింద్ కుమార్‌లపై చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి ప్రాసిక్యూషన్ అనుమతులు లభించిన అనంతరమే ఏసీబీ కోర్టులో అధికారికంగా ఛార్జిషీట్ దాఖలు చేసింది.

# ధర్మేంద్ర రాజీనామా సాధ్యమయ్యేదే కాదువ

న్యూఢిల్లీ, జులై 31, అనంతజనశక్తి న్యూస్

సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌తో తనకు విభేదాలు ఉన్నాయన్న వార్తలను కాక్రోచ్ జనతాపార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కొట్టిపారేశారు. నీట్ పేపర్ లీక్ ఉద్యమంలో ఆయన త్యాగాన్ని ఎన్నటికీ మర్చిపోలేమని అన్నారు. తమ మధ్య ఏకాభిప్రాయం ఉందని స్పష్టం చేశారు. జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అభిజీత్ దీప్కే ఈ వ్యాఖ్యలు చేశారు. ఆందోళన ముగింపు ప్రసంగంలో సోనమ్ వాంగ్‌చుక్ గురించి తాను ప్రస్తావించకపోవడానికి విభేదాలే కారణమన్న వాదనను అభిజీత్ తోసిపుచ్చారు. తమ మధ్య ఏకాభిప్రాయం ఉందని అన్నారు. ఆయనతో ఫోన్‌లో మాట్లాడినట్టు కూడా తెలిపారు. నాటి ఆందోళన యువత చేపట్టారని, పోలీసు చర్యలను ఎదుర్కొన్నారని అన్నారు. కాబట్టి తన ప్రసంగంలో వారికి ధన్యవాదాలు తెలిపానని అభిజీత్ వివరించారు.

వాంగ్‌చుక్ దీక్షతోనే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా..

'కానీ వాంగ్‌చుక్ సర్ త్యాగాన్ని మేము ఎన్నటికీ మర్చిపోలేము. ఆయన తన ప్రాణాల్ని సైతం లెక్క చేయక 26 రోజుల పాటు ఆమరణ దీక్ష చేశారు. తన ప్రాణాల్ని పణంగా పెట్టి జాతి అంతరాత్మను జాగృతం



చేశారు. యువత వీధుల్లోకి వచ్చి ప్రభుత్వాన్ని ప్రశ్నించేలా చేశారు. ఆయన ఆమరణ దీక్ష చేయకుంటే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా సాధ్యమయ్యేదే కాదు' అని అన్నారు. ఆమరణ దీక్షను ముగించాలని తాను వ్యక్తిగతంగా ఎన్నోసార్లు చెప్పానని అన్నారు. కేంద్ర మంత్రుల సమక్షంలో వాంగ్‌చుక్ దీక్షను విరమించడం విచారం కలిగించిందా? అన్న ప్రశ్నకు అలాంటిదేమీ లేదని అభిజీత్ బదులిచ్చారు. ఆసుపత్రిలో వాంగ్‌చుక్‌ను కలిసేందుకు తనను అనుమతించకుండా, కేంద్ర మంత్రులకు ఆ అవకాశం కల్పించినందుకు అసంతృప్తి కలిగిందని చెప్పారు. ఇతర సీజేపీ సభ్యులతో పాటు ప్రతిపక్ష నాయకులను కూడా వాంగ్‌చుక్‌ను కలిసేందుకు అనుమతించలేదని అన్నారు. ఒక రకంగా చూస్తే కేంద్రం వాంగ్‌చుక్‌ను కిడ్నాప్ చేసినట్టేనని వ్యాఖ్యానించారు. అయితే, వాంగ్‌చుక్ తన దీక్షను విరమించారని తెలిసి ఊపిరి పీల్చుకున్నట్టు దీప్కే తెలిపారు. దేశ భవిష్యత్తుకు ఆయన అవసరం ఉందని అన్నారు.

రాజకీయ పార్టీగా మారే ఉద్దేశం లేదు..

సీజేపీకి రాజకీయ పార్టీగా మారే ఉద్దేశం లేదని మరోసారి చెప్పారు. రాజకీయంగా ఒత్తిడి తెచ్చే ప్రెషర్ గ్రూప్‌గా మాత్రమే కొనసాగుతామని చెప్పారు. ప్రభుత్వంలో జవాబుదారీతనం తేవడమే తన లక్ష్యమని అన్నారు. తాను రాజకీయ నాయకుడిగా మారనని కూడా చెప్పారు. నేటి పరిస్థితుల్లో అర్థవంతమైన మార్పులు ప్రజా ఉద్యమాలతోనే సాధ్యమని అన్నారు.

# టేకాఫ్‌కు ఉత్తరాంధ్ర సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

ఈ ఆలోచనా సరళితోనే కూటమి ప్రభుత్వం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అత్యాధునిక వసతులతో తీర్చిదిద్దింది.

దశాబ్దాలుగా విశాఖపట్నం ఉత్తరాంధ్రకు ఆర్థిక, వాణిజ్య కేంద్రంగా వర్ధిల్లుతున్నప్పటికీ... ప్రస్తుతం ఉన్న విశాఖ విమానాశ్రయం పూర్తిస్థాయి పౌర విమానాశ్రయం కాదు. అది తూర్పు నౌకాదళంఇండియన్ నేవీ నియంత్రణలో పనిచేస్తున్న ఎయిర్‌పోర్ట్. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు అక్కడ వాణిజ్య విమానాల రాకపోకలకు అనుమతి ఉండదు. నౌకాదళ శిక్షణ, రక్షణ కార్యకలాపాల విస్తరణ వల్ల, అనేక ప్రముఖ ఎయిర్‌లైన్స్ సంస్థలు విశాఖకు తగినన్ని సర్వీసులు నడపలేని అనివార్య పరిమితులు ఏర్పడ్డాయి. విశాఖపట్నం ఐటీ, ఫార్మా, వైద్యం, విద్య పర్యాటక రంగాల్లో అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా ఎదుగుతున్న వేళ, ఒక పూర్తిస్థాయి పౌర అంతర్జాతీయ విమానాశ్రయం అవసరం ఏర్పడింది. విశాఖపట్నం సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు చేయాలనే ఆలోచన 1997లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి వచ్చింది. అప్పట్లోనే భోగాపురం, సబ్బవరం, అచ్యుతాపురం ప్రాంతాలను పరిశీలించారు.

2014లో రాష్ట్ర విభజన జరిగి సాంకేతికంగా ఉమ్మడి రాజధాని అయిన హైదరాబాద్ దూరమవడం, అదే సమయంలో హుద్‌హుద్ తుఫాన్ దాటికి విశాఖ విమానాశ్రయం రన్‌వే మునిగిపోవడం వంటి పరిణామాలు ఈ ప్రాంతానికి ప్రత్యేక విమానాశ్రయం ఎంత అత్యవసరమో స్పష్టం చేశాయి. మారిన పరిస్థితులకు అనుగుణంగా 2014 తర్వాత భోగాపురమే అంతర్జాతీయ విమానాశ్రయానికి అత్యంత అనుకూలమైన ప్రాంతంగా రూపుదిద్దుకుంది. 2014లో విశాఖ సమీపంలోని భోగాపురాన్ని గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయానికి అనువైన ప్రాంతంగా గుర్తించారు. ఒకవైపు బంగాళాఖాతం అందాలు, మరోవైపు మన్యం పచ్చని అందాల మధ్య విమానాలు ఎగిరేలా ప్రణాళికలు సిద్ధం చేసి,





2019 ఫిబ్రవరిలోనే నారా చంద్రబాబు నాయుడు గారు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. కేవలం విమానాశ్రయమే కాకుండా ఏరోసిటీ, విమానాల మరమ్మత్తులు, పైలట్ శిక్షణ కేంద్రాలతో కూడిన లాజిస్టిక్స్ హబ్‌గా దీనిని డిజైన్ చేశారు. కవులవాడ, కంచేరు, రావాడ, గూడెపువలస వంటి గ్రామాల పరిధిలో భూసేకరణ చేపట్టి, ఇళ్లు కోల్పోయిన 390 కుటుంబాలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీతో పాటు ప్రత్యేక కాలనీలు నిర్మించారు.

తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ హయాంలో ఈ ప్రాజెక్టు నిర్లక్ష్యానికి గురైంది. గత ప్రభుత్వం ఈ ఒప్పందాలను తిరగదోడి, జీఎంఆర్ సంస్థకు కేటాయించిన 2,703 ఎకరాల్లో 500 ఎకరాలను వెనక్కి తీసుకుని విమానాశ్రయం సమగ్ర రూపురేఖలను దెబ్బతీసింది. ఐదేళ్ల కాలంలో కేవలం 26 శాతం పనులే పూర్తిచేసి కాలయాపన చేసింది. కానీ, 2024లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే ఈ ప్రాజెక్టు మళ్లీ శరవేగంగా పట్టాలెక్కింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించగా, కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు క్షేత్రస్థాయిలో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ రోజుకు 5,000 మంది కార్మికులతో 24 గంటలూ రాత్రింబవళ్లు పనులు జరిగేలా చర్యలు తీసుకున్నారు. దీనికి తోడు ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇస్తున్న ప్రాధాన్యతతో, అనుకున్న గడువు కంటే ముందే ఈ భారీ ప్రాజెక్టు రూపుదిద్దుకుంది. జనసేన పార్టీ మొదటి నుంచీ ప్రాంతీయ అసమానతలు తొలిగిపోవాలని, ముఖ్యంగా ఉత్తరాంధ్ర, రాయలసీమ వంటి ప్రాంతాలు ఆర్థికంగా బలోపేతం కావాలని బలంగా ఆకాంక్షించింది. భోగాపురం విమానాశ్రయం నిర్మాణం సమతుల్య ప్రాంతీయ అభివృద్ధి సాధనలో కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తున్నది.

సుమారు రూ.4,750 కోట్ల భారీ వ్యయంతో 2,700 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం దేశంలోనే అత్యంత ఆధునిక గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టులలో ఒకటి. ఇక్కడ నిర్మించిన 3.8 కిలోమీటర్ల సుదీర్ఘ 'కోడ్ 4ఈ' రన్‌వే ద్వారా భారీ అంతర్జాతీయ విమానాలు కూడా సునాయాసంగా ల్యాండ్ కాగలుగుతాయి. 81 మీటర్ల ఎత్తైన ఏటీసీ టవర్, 14 ఏరోబ్రిడ్జ్ లు, 40 చెక్‌ఇన్ కౌంటర్లు, 200 ప్యాసింజర్ సర్వీస్ కౌంటర్లతో పాటు ప్రాథమికంగా ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించేలా ఈ టెర్మినల్ రూపుదిద్దుకుంది. అలాగే తూర్పు తీరం తరచూ తుపానుకు గురయ్యే అవకాశం ఉన్నందున, 2014 నాటి 'హుద్‌హుద్' తుఫాను నేర్పిన పాఠాలను దృష్టిలో ఉంచుకుని, శాస్త్రీయంగా పటిష్టమైన డ్రైనేజీ వ్యవస్థతో ప్రకృతి విపత్తులను సైతం తట్టుకునేలా అత్యున్నత ప్రమాణాలతో దీనిని నిర్మించారు.

ఈ విమానాశ్రయ ప్రాధాన్యత కేవలం విమానాల రాకపోకలకే పరిమితం కాదు. అంతర్జాతీయ విమానాశ్రయాలు ఆర్థిక పరివర్తనకు శక్తివంతమైన ఇంజిన్లుగా పనిచేస్తాయి. భోగాపురం కేంద్రంగా కేవలం విమానాశ్రయం మాత్రమే కాకుండా ఒక సమగ్ర 'ఏవియేషన్ ఈకోసిస్టమ్' రూపుదిద్దుకోబోతున్నది. ఎయిర్‌పోర్ట్ చుట్టుపక్కల ఏరోసిటీ, లాజిస్టిక్స్ పార్కులు, కార్గో టెర్మినల్స్, హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లు, వాణిజ్య సముదాయాలు ఏర్పడనున్నాయి. అంతర్జాతీయ ఎయిర్ పోర్టుతో ఇక్కడ రియల్ ఎస్టేట్ పెరగనుంది. అంతేకాకుండా, విమానాల మరమ్మత్తు, నిర్వహణ కేంద్రాలు, పైలట్ శిక్షణ అకాడమీలకు ఇది కేరాఫ్‌గా మారనుంది. దీనివల్ల ఉత్తరాంధ్రలోని ఫార్మా, సీఫుడ్, పండ్లు, పూలు, వస్త్ర పరిశ్రమల ఎగుమతులకు అవకాశాలు పెరగడంతో పాటు యువతకు పెద్ద ఎత్తున ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అరకు, పాడేరులోని గిరిజన ఉత్పత్తులకు, శ్రీకాకుళం జీడిపప్పుకు, విజయనగరం మామిడికి, కడియం పూలకు, అచ్యుతాపురం టెక్స్‌టైల్స్‌కు భోగాపురంలో ఎయిర్‌పోర్ట్‌తో ఎగుమతి అవకాశాలు మెరుగుకానున్నాయి.




# బలప్రదర్శన యాత్ర విడ్డూరం

న్యూఢిల్లీ, జులై 31, అనంతజనశక్తి న్యూస్

**మంత్రి నిమ్మల రామానాయుడు**

**- పరామర్శ యాత్ర అనిపించలేదు**

ప్రపంచంలో ఎక్కడైనా చనిపోయిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించడం చూశాం గానీ, హత్య చేసిన వ్యక్తిని పరామర్శించడం వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కే చెల్లిందని ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఎద్దేవా చేశారు. శుక్రవారం కాకినాడ జిల్లాలోని అన్నవరంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇది పరామర్శ యాత్రగా కాకుండా, బలప్రదర్శన యాత్రగా మాజీ సీఎం జగన్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ ప్రారంభోత్సవ పండగ వాతావరణంలో ఉంటే.. వైఎస్ జగన్ ఓర్వలేనితనంతో అలజడులు సృష్టించాలని చూస్తున్నారని విమర్శించారు.

కూటమి ప్రభుత్వం నీరు పారించాలని చూస్తుంటే, గొడ్డలి పార్టీ రక్తాన్ని పారించాలని చూస్తోందని మంత్రి నిమ్మల మండిపడ్డారు. దారిన పోయే దానయ్య చనిపోతే నష్టమేంటని వైఎస్ జగన్ మాట్లాడుతున్నారని చెప్పారు. దానయ్యకు 45 ఏళ్ళు వచ్చాయి.. వయసైపోయిన వ్యక్తి చనిపోతే నష్టమేంటని ఆయన ప్రశ్నిస్తున్నారని అన్నారు. మరి 54 ఏళ్ళు వచ్చిన గొడ్డలి పార్టీ అధినేతకు కూడా వయసై పోయినట్లే కదా? అని వ్యంగ్యంగా ప్రశ్నించారు. ఖాకీ డ్రెస్ అన్నా.. మహిళలన్నా గొడ్డలి పార్టీ నాయకుడికి గౌరవం లేదని విమర్శించారు. ఆడవాళ్ళ జోలికొస్తే అదే ఆఖరి రోజు అని సీఎం చంద్రబాబ వ్యాఖ్యలు.. గొడ్డలి పార్టీకి కూడా వర్తింపచేయాలని ఆయన డిమాండ్ చేశారు.

చనిపోయిన వ్యక్తిని కాదని, చంపిన వ్యక్తిని పరామర్శించడం సరికాదని.. మాజీ మంత్రి బొత్స లాంటి వారు కూడా జగన్‌కు ఎందుకు చెప్పలేకపోయారంటూ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని పాటిస్తామని ప్రమాణం చేసిన వ్యక్తి.. హత్య చేసిన వ్యక్తిని ఓదార్చడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. ఎర్ర బస్సు రాని ఊరికి, ఎయిర్ బస్ ఎందుకని నాడు జగన్ ప్రశ్నించారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కోర్టులకు వెళ్లి మరీ భోగాపురం ఎయిర్ పోర్టు రాకుండా అడ్డుకుంటానని జగన్ చెప్పిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు.

జగన్‌కున్న క్రెడిట్ చోరీ జబ్బును అందరికీ అంటించాలని చూస్తున్నాడని ఆరోపించారు. పోలవరం నుంచి 3 వేల టీఎంసీల నీరు వృధాగా సముద్రంలో కలసిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ధవళేశ్వరంకు ఎగువన నీటి నిల్వ కోసం, ఒక్క ప్రాజెక్టు కూడా లేకపోవడం చూసి సర్ ఆర్థర్ కాటన్ మనవరాలు ఆవేదన చెందారని చెప్పారు. నాడు చంద్రబాబు ప్రతి సోమవారాన్ని పోలవరంగా మార్చుకుని 72 శాతం ప్రాజెక్టు పనులు పూర్తి చేశారని వివరించారు. 2019లో ప్రభుత్వం మారకుండా ఉండి ఉంటే, 2024 నాటికి పోలవరం పూర్తయి అటు ఉత్తరాంధ్రకు, ఇటు రాయలసీమకు గోదావరి జలాలు వెళ్లి ఉండేవని అన్నారు.

ఒక్క ఛాన్స్ అంటూ గొడ్డలి పార్టీ అధికారంలోకి వచ్చి పోలవరాన్ని ధ్వంసం చేసి, డయాఫ్రం వాల్‌ను విధ్వంసం చేశారని మండిపడ్డారు. నాడు ఇరిగేషన్ మంత్రులు, సీఎం, పోలవరం ఎప్పుడు పూర్తవుతుందో చెప్పలేమంటూ అసెంబ్లీలోనే చెప్పి, ఆ ప్రాజెక్టును ప్రశ్నార్థకం చేశారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు మొదటి పర్యటన పోలవరంకు వచ్చి 2027 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తయ్యేలా లక్ష్యంగా పెట్టారని వివరించారు. గత ప్రభుత్వంలో విధ్వంసం అయిన డయా ఫ్రం వాల్‌ను పూర్తి చేసి.. ఈసీఆర్ఎఫ్ డ్యాం పనులను వేగవంతం చేశామని అన్నారు. పోలవరం పూర్తయ్యేలోగా ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తీసుకెళ్లేలా నాడు చంద్రబాబు పురుషోత్తమపట్నం లిఫ్ట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారని పేర్కొన్నారు.

పురుషోత్తపట్నం లిఫ్ట్ ద్వారా ఉత్తరాంధ్ర ప్రాంత సాగు, తాగునీటి అవసరాలతో పాటు పారిశ్రామిక అవసరాలకు నీరందిస్తున్నామని వివరించారు. 5 ఏళ్ళ గొడ్డలి పార్టీ పాలనలో పోలవరం ఎడమ కాలువ పనుల్లో తట్ట మట్టిగానీ, రూపాయి పని గానీ చేయలేదని వైసీపీని విమర్శించారు. తమ పాలనలో పోలవరం ఎడమ కాలువ పనుల వైపు కన్నెత్తి చూడని గొడ్డలి పార్టీకి ఉత్తరాంధ్ర గురించి మాట్లాడే నైతిక హక్కులేదన్నారు. జగన్ ఇరిగేషన్ శాఖలో రూ.18 వేల కోట్ల బకాయిలు వారసత్వంగా ఇచ్చి వెళ్లారంటూ వైఎస్ జగన్‌పై నిప్పులు చెరిగారు.

ఉత్తరాంధ్రకు న్యాయం చేయాలని రూ.1,800 కోట్లు ఖర్చు పెట్టి పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తి చేస్తున్నామని ఆయన వివరించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు పోలవరం ఎడమ కాలువలో ఉన్న క్లిష్టతరమైన పనులను రెండేళ్ళలోనే పూర్తి చేశామని ప్రకటించారు. ఆగస్టులోనే పోలవరం ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తీసుకెళ్లాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని వివరించారు. పోలవరం ఎడమ కాలువ పనుల జాప్యం నేపథ్యంలో ఏజెన్సీలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా అయితే చర్యలు తప్పవని అధికారులను మంత్రి నిమ్మల రామానాయుడు హెచ్చరించారు.

# నారా లోకేష్ అక్రమాలకు పాల్పడ్డారు

**- డీఎస్సీ పోస్టులు అమ్ముకున్నారు!**

**- వైసీపీ నేత అంబటి రాంబాబు**

న్యూఢిల్లీ, జులై 31, అనంతజనశక్తి న్యూస్



గుంటూరులో మెగా డీఎస్సీ నియామకాలపై మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. మెగా డీఎస్సీ నియామకాల్లో భారీ అక్రమాలు జరిగాయని, వాటిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కోరుతూ గుంటూరు జాయింట్ కలెక్టర్‌కు వైసీపీ నేతలతో కలిసి వినతిపత్రం సమర్పించారు. డీఎస్సీ నియామకాల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే కుట్రపూరిత ప్రణాళికతో వ్యవహరించిందని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అక్రమాలకు పాల్పడ్డారని, స్పోర్ట్స్ కోటా ఉద్యోగాలను తనకు కావాల్సిన వాళ్లకు ఇచ్చుకున్నారని అంబటి రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ.. 'మెగా డీఎస్సీలో మొత్తం 441 పోస్టుల నియామకాల్లో అక్రమాలు జరిగాయి. స్పోర్ట్స్ కోటాలోని కొన్ని పోస్టులను అక్రమంగా కేటాయించారు. మరికొన్ని పోస్టులు డబ్బులు తీసుకుని అమ్ముకున్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు అనుకూలంగా ఉండే అభ్యర్థులకు లబ్ధి చేకూర్చేందుకే స్పోర్ట్స్ కోటా నిబంధనలను మార్చారు. పరీక్ష నిర్వహణకు ముందు అమల్లో ఉన్న జీవోను రద్దు చేసి.. కొత్త జీవో తీసుకొచ్చారు. నియామకాలు పూర్తైన తర్వాత మళ్లీ పాత జీవోను పునరుద్ధరించారు. దీనిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి' అని డిమాండ్ చేశారు.

'స్పోర్ట్స్ కోటా విషయంలో సాధారణంగా 2 శాతం రిజర్వేషన్ ఉండాల్సి ఉండగా.. దానిని 3 శాతానికి పెంచారు. అంతేకాకుండా స్పోర్ట్స్ కోటా అభ్యర్థులు డీఎస్సీ పరీక్ష రాయాల్సిన అవసరం లేదని జీవోలో మార్పులు చేశారు. ఈ మార్పుల వల్ల కొందరికి అన్యాయం జరిగింది. నవీన్ అనే అభ్యర్థికి ఉద్యోగం రాకపోవడంతో కోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. ఈ మొత్తం వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించాలి. డీఎస్సీ అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలి. చర్చల పేరుతో అసలు సమస్యను ప్రభుత్వం పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తోంది. పరీక్షకు ముందు, తర్వాత జీవోలను మార్చడం వెనుక ఉన్న కారణాలను ప్రభుత్వం ప్రజలకు వివరించాలి' అని అంబటి రాంబాబు ఫైర్ అయ్యారు. అలాగే ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రతి ఏడాది నాలుగు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేసిన అంబటి రాంబాబు.. అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా నిరుద్యోగులకు తగిన ఉద్యోగాలు కల్పించలేదని ఆరోపించారు. నిరుద్యోగ భృతి కూడా అమలు చేయలేదని విమర్శిస్తూ.. ఉద్యోగాల పేరుతో యువతను మోసం చేశారని అన్నారు. మెగా డీఎస్సీ నియామకాలపై పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి, నిజాలు వెలుగులోకి తీసుకురావాలని అంబటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# సినిమా షూటింగ్‌లో రష్మికకు గాయాలు



సినీ నటి రష్మిక మందన్న గాయపడ్డారు. సినిమా షూటింగ్‌లో భాగంగా ఓ పాటకు డ్యాన్స్ చేస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. తుంటి భాగంలో బలమైన గాయమైనట్లు వైద్యులు గుర్తించారు. ఆరు వారాలపాటు విశ్రాంతి తీసుకోవాలని వారు సూచించారు. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో ఆమె నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా'. కథానాయిక ప్రాధాన్యమున్న ఈ చిత్రంలో రష్మిక గోండు తెగకు చెందిన మహిళగా కనిపించనున్నారు. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతోన్న 'మైసా'కు సంబంధించి కీలక యాక్షన్ సన్నివేశాలతో పాటు, అండర్ వాటర్ సీక్వెన్స్‌ను ఇటీవల పూర్తి చేశారు. తాజాగా ఓ పాటను షూట్ చేస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మరోవైపు విజయ్ దేవరకొండతో కలిసి రష్మిక 'రణబాలి'లో నటిస్తున్నారు. రాహుల్ సాంకృత్యన్ దర్శకుడు. ఈ ఏడాది సెప్టెంబరు 11న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

**టాలీవుడ్‌ను వెంటాడుతున్న గాయాలు**

ఈ ఏడాది తెలుగు సినీ నటులు వరుసగా గాయాల పాలవుతున్నారు. ఇటీవల అగ్ర కథానాయకుడు బాలకృష్ణ #NBK111 షూటింగ్‌లో గాయపడగా, ఆయనకు వైద్యులు ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం బాలకృష్ణ కోలుకుంటున్నారు. మరోవైపు అబ్బాయి ఎన్టీఆర్ భుజానికి కూడా గాయమైంది. ఆయన గాయం నుంచి పూర్తిగా కోలుకోవడానికి ఆరు నుంచి ఎనిమిది వారాల విశ్రాంతి అవసరమని వైద్య బృందం సూచించింది. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ 'డ్రాగన్' చేస్తున్నారు. 'పెద్ది' షూటింగ్‌లో రామ్‌చరణ్ మణికట్టుకు గాయమవగా, ఇటీవల కోయంబతూర్తు వెళ్లి శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో చిరంజీవి కూడా చేతికి బెల్ట్‌తో కనిపించారు. గత కొంతకాలంగా భుజం గాయంతో బాధపడుతున్న ఏపీ డిప్యూటీ సీఎం, సినీ నటుడు పవన్‌కల్యాణ్ ఇటీవల ముంబయిలో శస్త్రచికిత్స చేయించుకున్న సంగతి తెలిసిందే.

**విడుదల మరింత ఆలస్యం..**

ఒక కథానాయకుడు/నాయిక గాయపడటం వాళ్లు పనిచేస్తున్న సినిమాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. రష్మిక ప్రస్తుతం నాలుగు ప్రాజెక్టులు చేస్తున్నారు. అన్నీ భారీ బడ్జెట్ చిత్రాలే. సెప్టెంబరు 11న 'రణబాలి' విడుదల తేదీని ప్రకటించారు. మరి ఆమెకు సంబంధించిన షూట్ పూర్తయిందో లేదో స్పష్టత రావాల్సి ఉంది. బాలకృష్ణ #NBK111 విడుదల కూడా ఆలస్యం కానుంది. చరణ్ కూడా పూర్తిగా కోలుకున్న తర్వాతే సుకుమార్ మూవీ సెట్స్‌లో అడుగు పెట్టనున్నారు.

## నాలో ఆత్మవిశ్వాసం నింపిన క్షణం: ప్రీతి ముకుందన్



తాను నటనని కెరీర్‌గా ఎంచుకోవడానికి తల్లిదండ్రుల ప్రోత్సాహమే కారణమని అంటోంది అందాల తార ప్రీతి ముకుందన్. ఇటీవల 'బ్లాస్ట్', 'హృదయం మురళీ'లాంటి చిత్రాలలో వైవిధ్యమైన పాత్రల్లో కనిపించి ఆకట్టుకుంది ప్రీతి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన మొదటి ఆడిషన్‌కు సంబంధించిన ఓ ఆసక్తికర సంగతిని పంచుకుంది. "మా ఫ్యామిలీలో అందరం చదువుపైనే ఎక్కువ దృష్టి పెట్టే వాళ్లం. మా వాళ్లు చదువులో నన్ను ఎంతగా ప్రోత్సహించేవారో.. నేను నా మనసుకు నచ్చినట్టు కూడా నడుచుకోవాలని అంతే పట్టుదలతో ఉండేవారు. అందుకే కెరీర్ ప్రారంభంలో కొంత కాలం మోడలింగ్ చేశాను. 18 ఏళ్ల వయసులోనే నాకు ఓ చిత్రంలో నటించే అవకాశం వచ్చింది.

అప్పుడు నటనపై నాకంత నమ్మకం లేక ఆడిషన్ ఇవ్వలేనని చెప్పేశా. కానీ మా అమ్మానాన్న 'నువ్వు ఇది ఎందుకు ప్రయత్నించకూడదు?' అని ఆడిషన్‌కు వెళ్లమని ప్రోత్సహించారు. దాంతో ఆడిషన్‌లో నా వంతు నేను ప్రయత్నించాను కానీ, ఆ పాత్ర దక్కలేదు. కానీ నా తల్లిదండ్రులు నాలో ఆత్మవిశ్వాసాన్ని నింపిన క్షణమది. చిత్రపరిశ్రమ ఓ కొత్త ప్రపంచం. మా వాళ్లకి దాని గురించి ఏ మాత్రం తెలియదు కానీ, మనసుకి నచ్చింది చేయమని చెప్పడంతోనే నా ప్రయాణం మొదలైంది. ఆ తర్వాతే నెమ్మదిగా నటన పట్ల అభిరుచి పెరిగి, సినిమాని ప్రేమించడం మొదలు పెట్టాన"ని అంది.

## మిస్టరీ థ్రిల్లర్‌కు హారర్ మేళవింపుగా జాక్వెలిన్ చిత్రం?

వైవిధ్యమైన పాత్రల్లో గ్లామర్‌కు నటనను జోడించి.. మరోవైపు కుర్రకారుని ఉర్రూతలూగించే ప్రత్యేక గీతాలతో ఆకట్టుకుంటుంది అందాల తార జాక్వెలిన్ ఫెర్నాండెజ్. ఈ మధ్యే 'వెల్‌కమ్ టు ది జంగిల్'లో కనిపించి ప్రేక్షకుల్ని అలరించింది. జాక్వెలిన్ ఓ హారర్ జానర్ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లుగా ఇటీవల జోరుగా ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. తాజాగా ఆ సినిమాని హిందీ చిత్రం 1964లో వచ్చిన 'వహ్ కౌన్ థీ' మిస్టరీ థ్రిల్లర్ ఆధారంగా రూపొందించనున్నట్లు తెలుస్తోంది. "జాక్వెలిన్ ఓ హారర్ చిత్రంలో ప్రధాన పాత్రలో నటించేందుకు అంగీకరించారు. ఈ సినిమాని భయానక వాతావరణంతో కూడిన ఓ చిన్న గ్రామంలో చిక్కుకున్న అమ్మాయి.. యటపడడానికి చేసే పోరాటాల చుట్టూ తిరిగే కథాంశంతో రూపొందనుంది. ఇందులో జాక్వెలిన్‌పై ప్రత్యేక యాక్షన్ ఘట్టాలను తెరకెక్కించనున్నారు. త్వరలోనే ఈ చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నార"ని జాక్వెలిన్ సన్నిహిత వర్గాల సమాచారం.



## ప్యారడైజ్.. ప్రత్యేక పాట సన్నాహాలు

కథానాయకుడు నాని.. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కలయికలో రూపొందుతున్న చిత్రం 'ది ప్యారడైజ్'. 'దసరా' విజయం తర్వాత ఈ ఇద్దరి నుంచి వస్తున్న రెండో సినిమా ఇది. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ చిత్రం తాజాగా క్లైమాక్స్‌తో పాటు మొత్తం టాకీ పార్ట్‌ని పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు పాటల చిత్రీకరణకు సిద్ధమవుతున్నారు. దీనిలో భాగంగా ప్రత్యేక గీతం కోసం హైదరాబాద్‌లో ఓ భారీ సెట్‌ని సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పాట కోసం కీర్తి సురేశ్ పేరు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఇక మరోవైపు ఆగస్టు తొలి వారంలో ఓ చిన్న టీజర్‌తో విడుదల తేదీపై స్పష్టత ఇచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఇది 1980ల నాటి సికింద్రాబాద్ నేపథ్యంలో సాగే పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతున్నట్లు తెలిసింది. నాని ఇందులో జడల్‌గా విభిన్నమైన పాత్రలో అలరించనున్నారు. మోహన్‌బాబు ప్రతినాయక పాత్ర పోషిస్తున్నారు. కయాదు లోహర్ కథానాయిక. ప్రస్తుతం తుది దశలో ఉన్న ఈ చిత్రాన్ని సెప్టెంబరు నెలాఖరున తెరపైకి తీసుకు రానున్నట్లు ప్రచారం వినిపిస్తోంది.

## అభిమానులకు గుడ్ న్యూస్.. బూమ్ బూమ్ బుమ్రా ఫిట్



భారత క్రికెట్ అభిమానులకు శుభవార్త. జస్‌ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్ విషయంలో నెలకొన్న సందిగ్ధత తొలగింది. శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు అతడిని ఎంపిక చేసినా.. ఫిట్‌నెస్ పరీక్షలో పాసైతేనే ఆడతాడని బీసీసీఐ సెలక్షన్ కమిటీ ముందే చెప్పింది. ఈ క్రమంలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ తాజాగా తీపి కబురు అందించింది. జస్‌ప్రీత్ బుమ్రా ఫుల్ ఫిట్‌గా ఉన్నాడని స్పష్టం చేసింది. దీంతో శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్‌లో అతడు ఆడటం ఖాయమే.

"జస్‌ప్రీత్ బుమ్రా ( గాయం నుంచి పూర్తిగా కోలుకున్నాడు. ఫిట్‌నెస్ టెస్టులను క్లియర్ చేశాడు. ఇప్పటికే స్క్వాడ్‌లో ఉన్న అతడు.. రెండు టెస్టులకూ అందుబాటులో ఉంటాడు" అని బీసీసీఐ అధికారి వెల్లడించారు. ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్ సందర్భంగా బుమ్రా గాయం తిరగబెట్టిన సంగతి తెలిసిందే. దీంతో మూడో వన్డేలో బెంచ్‌కే పరిమితమయ్యాడు. అతడి లేని లోటు స్పష్టంగా కనిపించింది. పెద్దగా అనుభవం లేని భారత పేస్ ఎటాక్‌పై ఇంగ్లాండ్ బ్యాటర్లు విరుచుకుపడ్డారు. భారీ స్కోర్లు నమోదైన ఆ మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌నే విజయం వరించింది.

**శ్రీలంకతో టెస్టు సిరీస్ అత్యంత కీలకం..**

ఇప్పుడు శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో బుమ్రా ఆడటం భారత్‌కు అత్యంత కీలకం. ఇద్దరు ప్రధాన పేసర్లు మాత్రమే తుది జట్టులో ఉండే అవకాశం ఉంది. బుమ్రా ఉంటే ప్రత్యర్థి లంక బ్యాటర్లు హడలెత్తడం ఖాయం. అంతేకాకుండా.. గతంలో శ్రీలంక చేతిలో టీమ్‌ఇండియాకు ఓటమి ఎదురైంది. దీంతో ఆ జట్టుపై ప్రతీకారం తీర్చుకోవడంతోపాటు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరుకోవాలంటే ఈ సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాల్సిన అవసరం ఉంది. నాలుగో డబ్ల్యూటీసీ సీజన్‌లో భారత్ ఇంకా తొమ్మిది టెస్టులను ఆడనుంది. ఇందులో కనీసం ఏడు మ్యాచుల్లో గెలిస్తేనే ఫైనల్‌కు చేరేందుకు ఛాన్స్ ఉంటుంది. ఆగస్టులో శ్రీలంకతో సిరీస్ తర్వాత న్యూజిలాండ్‌తో అక్కడి గడ్డపైనే భారత్ తలపడాలి. అందుకే, ఇక్కడి నుంచి ప్రతి మ్యాచ్ విజయమూ భారత్‌కు కీలకం.

## టాలెంట్ ఉంటే పీఆర్ అక్కర్లేదని రుజువు చేశావ్: రహానేకు హీరో ప్రశంసలు



టీమ్‌ఇండియా మాజీ ఆటగాడు అజింక్య రహానే పై బాలీవుడ్ నటుడు, '12th ఫెయిల్' హీరో విక్రాంత్ మాస్సే ప్రశంసల వర్షం కురిపించాడు. నిన్న రహానే క్రికెట్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. దీంతో అతడి సేవలను గుర్తు చేసుకుంటూ ఇప్పటికే పలువురు స్పందించారు. తాజాగా విక్రాంత్ సోషల్ మీడియా వేదికగా ఆసక్తికర పోస్టు పెట్టాడు. "అజింక్య రహానే (Ajinkya Rahane).. మీరు ఈ జెర్సీని ధరించడం వల్ల భారత క్రికెట్ మరింత గొప్పగా మారింది. కొందరు ఆటగాళ్లు రికార్డులను సృష్టిస్తారు. మరికొందరు ప్రమాణాలను నెలకొల్పుతారు. మీరు రెండో జాబితాకు చెందుతారు. వ్యక్తిగతం కంటే జట్టు కోసమే ఆడారు. విజయాలను వినయంతో.. ఎదురుదెబ్బలను ప్రశాంతంగా, హుందాతనంతో స్వీకరించారు. మీ ప్రతిభతోపాటు వ్యక్తిత్వం కూడా స్ఫూర్తిదాయకమని మాకు గుర్తు చేశారు. రాహుల్ ద్రవిడ్‌కు మీరే అసలైన వారసుడిగా నిలిచారు. క్రికెట్ ప్రపంచం మీకు రుణపడి ఉండటానికి అదొక్క విషయం చాలు. ప్రచార ఆర్భాటాలనే విలువలుగా భావించే ప్రస్తుత పరిస్థితుల్లో.. నిజమైన ప్రతిభకు పీఆర్ టీమ్ అవసరం లేదని నిరూపించారు. నిస్వార్థ సేవ, పట్టుదల, ఆటపట్ల మీకున్న అంకితభావం తరతరాలపాటు గుర్తుండిపోతుంది. ధన్యవాదాలు జింక్స్" అని విక్రాంత్ పోస్టు పెట్టాడు.

## సుదీర్ఘ ఫార్మాట్‌లో వైభవ్‌ను ఎలా వైస్ కెప్టెన్ చేశారు?: హర్షా భోగ్లే



దులీప్ ట్రోఫీ 2026-27 సీజన్ కోసం ఈస్ట్ జోన్ స్క్వాడ్‌ను ప్రకటించింది. అనూహ్యంగా వైభవ్ సూర్యవంశీ కి వైస్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించింది. సారథిగా ఇషాన్ కిషన్‌ను సెలక్టర్లు ఎంపిక చేశారు. ఇప్పుడిప్పుడే అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌ను ప్రారంభించిన వైభవ్‌ను డిప్యూటీ చేయడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఆ నిర్ణయాన్ని స్వాగతించగా.. మరికొందరేమో సెలక్టర్లు తొందరపడ్డారని పేర్కొంటున్నారు. ఈ జాబితాలో క్రికెట్ వ్యాఖ్యాత హర్షా భోగ్లే కూడా చేరారు. సుదీర్ఘ ఫార్మాట్‌లో అతడు నేర్చుకోవాల్సింది చాలా ఉందని.. వైస్ కెప్టెన్సీ అప్పగించడం సరైనదిగా అనిపించడం లేదని వెల్లడించారు. "రెడ్ బాల్ క్రికెట్‌లో.. అదీనూ సీనియర్లు ఉండే జట్టుకు వైభవ్ సూర్యవంశీని వైస్ కెప్టెన్‌గా ఎలా నియమించారనేది నాకు ఇప్పటికీ ఆశ్చర్యంగానే ఉంది. అతడు ఫస్ట్‌క్లాస్‌లో ఇప్పటి వరకు సుదీర్ఘ ఫార్మాట్‌లో కేవలం 12 ఇన్నింగ్స్‌లు మాత్రమే ఆడాడు. 17.25 సగటుతో 207 పరుగులు చేశాడు. నేను అతడి టాలెంట్‌ను తక్కువ చేయడం లేదు. అద్భుతమైన నైపుణ్యం కలిగిన ప్లేయర్. కానీ, అతడు నేర్చుకోవాల్సిన అంశాలు చాలానే ఉన్నాయి" అని హర్షా భోగ్లే పోస్టు పెట్టారు.

## బిడ్డకు జన్మనిచ్చిన 11 నెలలకే బరిలోకి.. డిస్కస్ త్రోలో సీమా కళిరామన్‌కు కాంస్యం

కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత అథ్లెట్ల పతకాల వేట కొనసాగుతోంది. మహిళల డిస్కస్ త్రో విభాగంలో సీమా కళిరామన్ కాంస్య పతకం సాధించింది. మూడో రౌండ్‌లో 58.65 మీటర్లు విసిరిన సీమా.. ఆ తర్వాత వరుసగా మూడుసార్లు ఫౌల్ అయింది. అయినా, కాంస్యం వరించింది. జమైకాకు చెందిన సమంత హాల్ (61.66 మీటర్లు), కెనడా అథ్లెట్ జులియా టంక్స్ (60.67 మీటర్లు) స్వర్ణ, రజత పతకాలను కైవసం చేసుకున్నారు. అయితే, కాంస్యం నెగ్గిన కళిరామన్ ప్రయాణం ప్రతి అథ్లెట్‌కు స్ఫూర్తిదాయకం..

**ఇటు అమ్మతనం.. అటు చదువుల తల్లి**

హరియాణాకు చెందిన 27 ఏళ్ల సీమా కేవలం అథ్లెట్ మాత్రమే కాదండోయ్.. ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో పీహెచ్‌డీ చేసిన చదువుల తల్లి. చదువు, క్రీడలను బ్యాలెన్స్ చేసుకుంటూ వెళ్తుండగా.. ఈలోగా కొత్త పాత్ర పోషించాల్సి వచ్చింది. అమ్మగా మారిన ఆమె కేవలం 11 నెలల వ్యవధిలోనే డిస్కస్ త్రో పోటీలకు సిద్ధమైంది. ఆమెకు కోచింగ్ ఇచ్చింది మరెవరో కాదు.. ఆమె భర్త రవీందర్. జాతీయ స్థాయిలో డిస్కస్ త్రో మాజీ అథ్లెట్ అయిన రవీందర్.. మోను కళిరామన్‌గా సుపరిచితుడు.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314